

శనివారం ఒంగోలులో కురిసిన భారీ వర్షానికి జలమయమైన కర్నూలు రోడ్డు డిపో జంక్షన్



పొదిలి మండలం కొండాయపాలెం గ్రామంలో వర్షాలకు తడిసి మొలకలొచ్చిన సజ్జ కంకులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి తదితరులు

- మళ్లీ పలుచోట్ల మోస్తరు వర్షం
- జనజీవనం అస్తవ్యస్తం
- వెలుగుచూస్తున్న పంట నష్టాలు
- దెబ్బతిన్న పైర్లను పరిశీలించిన మంత్రి
- ఛిద్రంగా రోడ్లు, అధ్వానంగా పారిశుధ్యం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

వీడని వాన

ఒంగోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం ముప్పు తప్పినా జిల్లాను వర్షం వీడలేదు. శుక్ర, శనివారాల్లో చాలాచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీవర్షమే పడటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు భారీవర్షాలు తెరపి ఇచ్చి ఎండలు రావడంతో పంట నష్టాలు వెలుగుచూస్తుండగా మళ్లీ జల్లులు పడుతుండటంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేసమయంలో జిల్లా అంతటా రోడ్లు ఛిద్రంగా మారాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా పారిశుధ్యం అధ్వానంగా మారగా సీజనల్ వ్యాధులు విజృంభించే పరిస్థితి కనిపిస్తోంది. కాగా జిల్లాలో ఈ వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం సాయంత్రం మంత్రి డాక్టర్ స్వామి పలుచోట్ల పరిశీలించారు.

సగటున 15.38 సెం.మీ నమోదు

జిల్లాలో ఈనెల 11 నుంచి తెరపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. తొలుత మూడు రోజులు సాధారణ వర్షాలు పడగా 14 నుంచి 17 వరకు వాయుగుండం ప్రభావంతో కురిశాయి. అలా ఆ వారంరోజుల్లో జిల్లాలో సగటున 15.38 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా సగం మండలాల్లో 20 నుంచి 34 సెం.మీ మేర కురిసింది. గురువారం ఉదయం వాయుగుండం తీరం దాటడంతో ముప్పు తప్పిందని అందరూ భావించారు. అయితే తిరిగి శుక్ర, శనివారాల్లో జిల్లావ్యాప్తంగా జల్లులు పడుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు నుంచి భారీవర్షమే పడింది. శనివారం ఉదయం 8 గంటలకు గడిచిన 24గంటల్లో జిల్లాలో సగటున 9.10 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జరుగుమల్లి మండలంలో 40.60 మి.మీ కురియగా కేకేమిట్లలో 35.60, సింగరాయకొండ, బేస్తవారపేట, గిద్దలూరు, మార్కాపురం, పొదిలి, టంగుటూరు, కంభం, కొమరోలు, పెద్దారవీడు, వెలిగండ్ల తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. అలాగే శనివారం పగటిపూట కూడా చాలాచోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి 11 గంటలలోపు గరిష్ఠంగా సింగరాయకొండలో 46.4 మి.మీ, కురవగా కొత్తపట్నం 28.0, ఒంగోలు 24.4,

మిగతా 6వ పేజీలో

అక్రమాలకు సహకారం

పీడీసీసీ బ్యాంకులో అక్రమాలు చోటుచేసుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. బ్యాంకులో 11 అంశాల్లో అక్రమాలు జరిగినట్లు కొందరు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. బ్యాంకులో రుణాల మంజూరు, మరమ్మతులు, ఇతరాలలో రూ.80 కోట్లు దుర్వినియోగమైనట్లు పేర్కొన్నారు. బ్యాంకులో జరిగిన అక్రమాలపై వ్యవసాయ, సహకారశాఖ మంత్రికి, ఆప్కాబ్, నాబార్డులో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బ్యాంకులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కూడా సమాచారం వెళ్లింది. బ్యాంకు అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

- సీఎం, మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- పీడీసీసీ బ్యాంకుపై విజిలెన్స్
- ఏఎస్పీ ఆధ్వర్యంలో విచారణ
- పైళ్ల పరిశీలన ప్రారంభం
- మొత్తం 11 అంశాలపై ఫిర్యాదు

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నిధులు భారీగా దుర్వినియోగమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతలు రుణాల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలవెల్లువ, పొదుపు సంఘాలకు రుణాల పేరుతో భారీగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడు, ఆ శాఖ మంత్రి, ఆప్కాబ్, నాబార్డుతో పాటు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విజిలెన్స్ ఏఎస్పీ స్వయంగా ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయానికి వెళ్లి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) ఈద కోటిరెడ్డిని కలిసి విచారణకు అవసరమైన ఫైళ్లను అందజేయాలని కోరినట్లు తెలిసింది. బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ గోపాల కృష్ణను కలిసి విజిలెన్స్ విచారణ విషయాన్ని తెలియజేసి ఆయన అనుమతితో సీఈవో విజిలెన్స్ విచారణకు ఫైళ్లను అందజేసినట్లు తెలిసింది.

నాయకుల సిఫార్సుల మేరకు

పీడీసీసీ బ్యాంకు గతంలో నాబార్డు అనుబంధంగా ప్రకారం పనిచేసేది. ప్రస్తుతం అది రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ని బంధనల

మిగతా 6వ పేజీలో



ఒంగోలులోని పీడీసీసీబీ కార్యాలయం (ఫైల్)

పూర్వ డీపీవో అక్రమాలపై త్రీమెన్ కమిటీ

21,22న కలెక్టరేట్ లో విచారణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19: పూర్వ డీపీవో అవినీతి, అక్రమాలపై విచారణకు త్రీమెన్ కమిటీని నియమించారు. జిల్లా పంచాయతీ పరిధిలో పనిచేసే ఉద్యోగుల బదిలీలతోపాటు సచివాలయాల తనిఖీకి వెళ్లిన సమయంలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై పూర్వ జిల్లా పంచాయతీ ఇన్‌చార్జీ అధికారి, డీఎల్‌డీవో ఉషారాణిపై ఈనెల 21, 22వ తేదీల్లో విచారణ జరగనుంది. ఆ మేరకు ఉషారాణికి త్రీమెన్ విచారణ కమిటీ అధికారి లోకేశ్వరరావు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే బదిలీలపై ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు విచారణ చేసి కలెక్టర్ అన్సారియాకు నివేదికను అందజేయగా ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయిన విషయం విదితమే. ఉషారాణిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రీమెన్ కమిటీని నియమించింది. కమిటీలో ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు చైర్మన్‌గా జడ్పీ సీఈవో చిరంజీవితోపాటు ఆడిట్ అధికారిని సభ్యులుగా నియమించారు. 21వతేదీ గ్రేడ్-5, 6 ఉద్యోగులను కూడా విచారణకు రావాలన్నారు. ఈనెల 22వతేదీ ఉదయం 10.30కు కలెక్టరేట్‌లోని ఫారెస్టు సెటిల్‌మెంట్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఉషారాణికీ నోటీసులు జారీచేశారు.

ఆనందోత్సాహాలతో అట్లతద్దె

మహిళలకు ఎంతో ఇష్టమైన, తెలుగు సంప్రదాయానికి ప్రతిరూపమైన అట్లతద్దె పండుగను శనివారం జిల్లావ్యాప్తంగా మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ప్రతి సంవత్సరం ఆశ్వీయుజమాసం కృష్ణపక్షంలో వచ్చే తదియ రోజున ఈ పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. అందుకే దీనిని అట్లతదియ అని కూడా పిలుస్తారు. పండుగ రోజు గ్రామాలలో మహిళలు ఉదయాన్నే సంప్రదాయ దుస్తులతో ఇళ్లలో అట్లను పోసి చుట్టుపక్కల మహిళలను ఆహ్వానించి వారికి వాయినంగా ఇచ్చారు. అనంతరం గ్రామంలో వేసిన ఉయ్యాలల్లో ఊగుతూ అట్లతద్దోయ్ ఆరట్లో వంటి పాటలు పాడుతూ సందడి చేశారు. పలు పట్టణాలలో సైతం ఈ పండుగను మహిళలు వేడుకగా నిర్వహించుకున్నారు.

-ఒంగోలు (కల్చరల్)

అట్లతద్ది సందర్భంగా నిర్మల్‌నగర్ పార్కు వద్ద ఉత్సాహంగా సంప్రదాయ దుస్తులలో ఊయల ఊగుతున్న మహిళలు



చెడ్డీగ్యాంగ్ కలవరం

- ఉలిక్కిపడ్డ నగరం
- ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చొరబాటు
- నర్సింగ్ కాలేజీలో చోరీ
- గస్తీ ముమ్మరం : డీఎస్పీ



ట్రిపుల్ ఐటీ నడుపుతున్న ఆర్అండ్ నాయుడు కళాశాలలో గేట్లు పగులకొడుతున్న చెడ్డీగ్యాంగ్



సీసీ టీవీ ఫుటేజీలో హాస్టల్ రూముల్లో తాళాలు పగులగొడుతున్న చెడ్డీ గ్యాంగ్

ఒంగోలు క్రైం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): చెడ్డీగ్యాంగ్ చొరబాటు విషయం నగరంలో కలవరం పుట్టిస్తోంది. పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. రెండు రోజుల క్రితం నగర శివారు ప్రాంతంలో ఉన్న ట్రిపుల్ ఐటీలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసిన విషయం సీసీ పుటేజీలో వెలుగుచూసింది. దీంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. రావ్ అండ్ నాయుడు కాలేజీలో ట్రిపుల్ ఐటీ నడుస్తోంది. అక్కడ రెండు వేలమంది విద్యార్థులు ఉంటున్నారు దొంగలు కాలేజీలోకి చొరబడి చోరీ చేయడానికి విశ్వప్రయత్నం చేశారు. అక్కడ వారికి ఏమీ దొరకలేదు. అక్కడి నుంచి రైలు పట్టాల వెంట నడుచుకుంటూ రాంనగర్ 8 లైన్‌లో

మిగతా 6వ పేజీలో

తవ్వేకొద్దీ వెలుగులోకి అక్రమాలు

- మరో సర్కార్ దుకాణంలో రూ.9లక్షలు మాయం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ ఆస్తులపై దృష్టిసారించిన అధికారులు

మిగతా 6వ పేజీలో

కూలీలకు ఉపాధి కరువు

- తూర్పుగంగవరం, మన్నేపల్లిలో నియామకంకాని ఫీల్డ్ అసిస్టెంట్లు
- టీడీపీ నేతల మధ్య సఖ్యత కరువు
- పనుల నిలుపుదల

వివరాలు 7వ పేజీలో



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

నిమ్జ్ ప్రాంతంలో భారీ పరిశ్రమ!

- మాజీ కల్నల్ సారథ్యంలో పరిశీలనకు వచ్చిన బృందం
- అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ఎమ్మెల్యే ఉగ్ర హామీ
- కనిగిరి ప్రాంతవాసుల్లో చిగురిస్తున్న ఆశ

వివరాలు 6వ పేజీలో



కల్నల్ జయరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, మాజీ ఎమ్మెల్యే శివరాం

అక్రమాలకు సహకారం

(5వ పేజీ తరువాయి)

ప్రకారం పనిచేస్తుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తాయి. ఆ క్రమంలోనే పీడీసీసీ బ్యాంకు కూడా రుణాలు మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. అయితే బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జీ కమిటీ(పీఐసీ)ల పదవీకాలంలో అప్పటి నాయకుల సిఫార్సుల మేరకు అక్రమంగా రుణాలు మంజూరు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన 2019 నుంచి 2024 వరకు జరిగిన అక్రమాల్లో సుమారు రూ.80కోట్లు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఆ కాలానికి సంబంధించి మంజూరు చేసిన రుణాలన్నింటిపై విచారణ జరిపి అక్రమాలను వెలికితీయాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

11 అంశాల్లో అక్రమాలు

పీడీసీసీ బ్యాంకు వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో 11 అంశాల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొదటగా జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా ఇచ్చిన రుణాలు వాయిదా మీరిన బకాయిలుగా మారాయి. ఈ పథకం కింద పాడి రైతులకు గేదెలు కొనుగోలుకు, వాటి నిర్వహణకు ప్రకాశం కామధేను పథకం పేరుతో రైతులకు కనీసం రూ.30వేల నుంచి లక్షాన్నర వరకు రుణాలు ఇచ్చారు. కొందరికి వారు వారంరోజుల్లో పోసిన పాలను ప్రామాణికంగా తీసుకొని గేదెలకు రుణాలు ఇచ్చారు. అమూల్ డెయిరీకి వీరి ద్వారా పాలు సేకరించేవారు. అయితే ఆచరణలో జగనన్న పాల వెల్లువ పథకం తుస్సుమనడంతో గేదెల కొనుగోలుకు ఇచ్చిన రుణాల వసూలు కాలేదు. ఈ రుణాల మంజూరు, నిధుల విడుదలలో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి.

- ట్రాక్టర్ల కొనుగోలులో బినామీ రుణాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి.
- జాయింట్ లయబులిటీ గ్రూపులు(జేఎల్‌బీ) గ్రూపులకు జగనన్న తోడు రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి.
- ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకొని వారు పనిచేయని కాలానికి కూడా జీతాలు చెల్లించారు
- జాయింట్ లయబిలిటీ గ్రూపులకు ఇతర రుణాలు మంజూరులో అక్రమాలు చోటు చేసుకున్నాయి
- స్వయం సహాయక గ్రూపులు డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరులో భారీగా అవినీతి జరిగింది. అద్దంకి బ్యాంకు శాఖలో ఒక బినామీ స్వయం సహాయక గ్రూపునకు రూ.15లక్షల రుణం మంజూరు చేసి భారీగా అవినీతికి పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో అక్కడి ఉద్యోగిని బ్యాంకు సీఈవో చార్జ్‌షీటు చేశారు. ఒంగోలు నగరంలో కూడా బినామీ గ్రూపులకు రుణాలు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.
- జగనన్న షిప్ ఆంధ్ర పథకం కింద రుణాలు మంజూరులో భారీ కుంభకోణాలు జరిగాయి.
- బ్యాంకులో వ్యక్తిగతంగా గృహ తనఖా రుణాలు మంజూరులో కూడా అక్రమాలు జరిగాయి.
- రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల్లో భారీగా అవినీతి జరిగింది. బినామీలు కొందరికి కూడా ఈ రుణాలు మంజూరు చేశారు. కొన్ని బ్యాంకు శాఖల్లో రుణాలకు సంబంధించి బాండ్లు లేకుండా రుణాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.
- బ్యాంకు ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
- బ్యాంకు శాఖల్లో రీ మోడలింగ్‌లో కూడా పెద్ద కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ అంశాలన్నింటిపై విజిలెన్స్ విచారణలో ఏమి తేలుతుందో వేచిచూడాల్సి ఉంది.

వీడని వాన....

(5వ పేజీ తరువాయి)

జరుగుమల్లి 24.0 మి.మీ నమోదైంది. సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో జల్లులు పడుతూనే ఉన్నాయి.

పారిశుధ్యం అధ్వానం

అయితే వాయుగుండం ముప్పు తప్పిందని భావించిన ప్రజానీకానికి తిరిగి కురుస్తున్న వర్షాలు ఇబ్బందికరంగా మారాయి. వారంరోజులు కురిసిన వర్షాలతో అంతా అస్తవ్యస్తం కాగా మళ్లీ జల్లులు పడుతుండటం మరింత ఇబ్బందికరంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు భారీగా దెబ్బతినగా రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతుండగా పారిశుధ్య పరిస్థితి మరింత దిగజారింది. మురుగు తొలగింపు, చెత్త ఎత్తి వేసే పనులకు కూడా అధికారులు చేయలేకపోతుండగా వ్యాధులు ప్రబలే పరిస్థితి కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో మళ్లీ వర్షాలతో ప్రజలు మరింత అవస్థలు పడుతున్నారు. ఒంగోలు నగరంలో శనివారం భారీవర్షం కురవడంతో నగరం మరోసారి జలమయం అయింది ప్రధాన రోడ్లు, కాలువలను తలపిస్తూ నీరు పారగా పలు శివారు కాలనీల్లో ఇళ్లలోకి సైతం నీరు చేరి జనం ఇక్కట్లు పడ్డారు. ఇతర పలు పట్టణాల్లోనూ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

సజ్జ పంటను పరిశీలించిన మంత్రి

వారం రోజులపాటు కురిసిన వర్షాలు తెరపి ఇచ్చి కాస్తంత ఎండ రావడంతో వర్షాలు వల్ల దెబ్బతిన్న పంట నష్టాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో ఇటీవల వర్షాలకు 17 మండలాల్లోని 89 గ్రామాల్లో 3,231 మంది రైతులకు చెందిన 3,749 హెక్టార్లలో సజ్జ, జొన్న, మినుము, అలసంద, వరి, పత్తితదితర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే పంటనష్టాలు అంతకు నాలుగు రెట్లు అధికంగా ఉన్నట్లు తెలుస్తుండగా మరింత ఎండ వస్తే వాస్తవ నష్టాలు బయటపడే అవకాశం ఉంది. కాని తిరిగి జల్లులు పడుతుండటంతో అధికంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి డాక్టర్ స్వామి శనివారం పొదిలి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మిలతో కలిసి పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అయితే ఇంకా వర్షం కురిస్తే మొత్తం పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చెడ్డీగ్యాంగ్ కలవరం

(5వ పేజీ తరువాయి)

ఆలూరి నర్సింగ్ కళాశాలలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ కళాశాల కార్యాలయంలో రూ.లక్ష నగదు అపహరించుకెళ్లారు. అయితే ట్రిపుల్ ఐటీ కళాశాలలో మొదటి అంతస్తులో బాలికల వసతిగృహం ఉంది. అదేవిధంగా నర్సింగ్ కళాశాలలో అంతా బాలికలే ఉంటారు. దొంగలు కేవలం కళాశాల ఆఫీస్ గదులలో మాత్రమే దొంగతనానికి పాల్పడ్డారు. ఈ గ్యాంగ్‌లో ఐదుగురు సభ్యులు ఉన్నారు. వారు మారణ ఆయుధాలతో తిరుగుతుంటారు. అదేవిధంగా శివారు ప్రాంతాలలో ఉన్న పెద్దపెద్ద భవనాలను ఎంపిక చేసుకుని చోరీలు చేశారు. అయితే ఈ ముఠా చోరీలకు పాల్పడే సమయంలో జనసంచారం ఉంటే వారిపై దాడులు చేయడానికి కూడా వెనుకాడరు.

గస్తీ ముమ్మరం చేశాం: డీఎస్పీ

చెడ్డీగ్యాంగ్ కదలికలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల క్రితం ఒంగోలు ట్రిపుల్ ఐటీ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో చోరీలకు పాల్పడినట్లు సీసీ ఫుటేజీ లభ్యమైందని చెప్పారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గస్తీ ముమ్మరం చేశామన్నారు. అదేవిధంగా బ్లూకోట్స్, రక్షక్ వ్యవస్థను పటిష్ట పరిచామని తెలిపారు. ఏడు బ్లూకోట్స్ బృందాలలో ఒక్కో వాహనంపై ఇరువురు ఉండే విధంగా రక్షక్ వాహనంలో డ్రైవర్‌తోపాటుగా ముగ్గురు సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. పోలీసు బీట్ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. ప్రతి కానిస్టేబుల్ వాహనానికి సైరన్ ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. నిఘా పటిష్ట పరిచామని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లో, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిమ్జ్ ప్రాంతంలో భారీ పరిశ్రమ!

మాజీ కల్నల్ సారధ్యంలో పరిశీలనకు వచ్చిన బృందం

అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ఎమ్మెల్యే ఉగ్ర హామీ

కనిగిరి ప్రాంతవాసుల్లో చిగురిస్తున్న ఆశ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరి నియోజకవర్గంలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టిసారించారు. ముఖ్యంగా నేషనల్ ఇన్వెస్టిమెంట్ అండ్ మ్యాన్‌ఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)కు కేటాయించిన స్థలంలో పరిశ్రమ ఏర్పాటుకు కొందరు ముందుకు రావటం విశేషం. వారికి అవసరమైన అనుమతులు ఇప్పించటంలోను, సౌకర్యాలు కల్పించటంలోను పూర్తి సహకారం ఉంటుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వారికి హామీ ఇవ్వటంతో కనిగిరి నియోజకవర్గ ప్రజల్లో కూడా ఆశలు చిగురిస్తున్నాయి. శనివారం రిటైర్డ్ కల్నల్ జయరావు ఆధ్వర్యంలో వచ్చిన పారిశ్రామికవేత్తల బృందం నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని, కనిగిరి ప్రాంతంలోను పర్యటించింది. పది సంవత్సరాల క్రితం కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం ద్వారా ఆ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఆ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. నియోజకవర్గంలో పామూరు, పీసీపల్లి, కందుకూరు నియోజవకర్గంలోని వలేటివారిపాలెం మండలాల పరిధిలో సుమారు 12వేల ఎకరాల భూమిని నిమ్జ్‌కు



నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జయరావు, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కేటాయించేందుకు నిర్ణయించారు. అందులో 2వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. మిగిలిన భూముల్లో ప్రయివేటు వ్యక్తులకు సంబంధించిన భూముల సేకరణకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే గత ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో తదుపరి పనులు వేగంగా జరగలేదు. పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. రాష్ట్రంలో చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పారిశ్రామికవేత్తలు మళ్లీ రాష్ట్రం వైపు దృష్టిసారించిన విషయం తెలిసిందే. నిమ్జ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పారిశ్రామికవేత్తలను కలవటం ప్రారంభించారు. కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ ద్వారా రిటైర్డ్ కల్నల్ జయరావు బృందం ఈ వైపు దృష్టిసారించింది. డిఫెన్స్‌లో ఉన్నతస్థాయిలో పనిచేసి రిటైర్డ్ అయిన ఆయన ప్రస్తుతం కేంద్రంలో సలహాదారుడుగా ఉన్నారు. దేశంలో ప్రయివేటు సెక్టార్‌లో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సహకరిస్తే ఏర్పాటుచేయాలని వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి చెప్పారు. అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని చంద్రబాబు సూచించటంతో స్థల అన్వేషణ ప్రారంభించారు. ఈ దశలో డాక్టర్ శివరాం ద్వారా వారిని పరిచయం చేసుకున్న డాక్టర్ ఉగ్ర నిమ్జ్ ప్రాంతంలో అనువైన స్థలం ఉందని చెప్పటంతో వారు శనివారం వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆరుగురు సభ్యుల బృందం కనిగిరి నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న భూములతోపాటు నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని కూడా చూపించారు. పామూరు, పీసీపల్లి మండలాలకు మధ్య వలేటివారిపాలెం మండలపరిధి కూడా కలిసొచ్చే ప్రాంతాన్ని వారు ప్రత్యేకంగా పరిశీలించారు. సమీపంలో గ్రామాలు లేకుండా ఉంటే మంచిదని తెలిపారు. డిఫెన్స్ కారిడార్ అంటే కేవలం ఆయుధాల తయారీ పరిశ్రమే కాకుండా ఆయా స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే యూనివర్సిటీ కూడా వస్తుందని రిటైర్డ్ కల్నల్ జయరావు ఈ సందర్భంగా తెలిపారు. పెద్ద స్థాయి హెలికాప్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుదారులు కూడా స్థలం కోసం అన్వేషిస్తున్నారని వారిని కూడా ఇక్కడే పరిశ్రమ ఏర్పాటుకు ప్రోత్సహిస్తామని తెలిపారు. మొత్తం పరిశీలన అనంతరం నీటి సమస్యను వారు ప్రధానంగా ప్రస్తావించగా మోపాడు రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే ఉగ్ర హామీ ఇచ్చి అందుకున్న అవకాశాలు కూడా చూపించారు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిశ్రమ అయితే పూర్తిస్థాయిలో సహకరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అన్ని రకాల అనుమతులను వెంటనే ఇప్పిస్తామని తెలిపారు. అందులోభాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని ప్రభుత్వపరంగా ఇచ్చే సహకారంపై మాట్లాడతామని చెప్పగా వారు అంగీకరించారు. రోజంతా నియోజకవర్గంలోనే పర్యటించిన ఆ బృందం శనివారం కావటంతో ఇటు మాలకొండ, అటు భైరవకోన దేవాలయాల సందర్శన కూడా చేశారు. డాక్టర్ ఉగ్రతో పాటు దివి శివరామ్ వారికి అనేక అంశాలపై వివరణ ఇచ్చారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

● సీఎంతో మాట్లాడి పంట నష్టపరిహారం ఇస్తాం ● మంత్రి బాలవీరాంజనేయస్వామి

పొదిలి/తాళ్లూరు అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ ఆదుకుంటామని మంత్రి డోలాశ్రీబాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. పొదిలి, తాళ్లూరు మండలాల్లో మంత్రితోపాటు కలెక్టర్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ ఉన్నారు. తాళ్లూరు మండలం రామభద్రాపురం వద్ద దెబ్బతిన్న జొన్నతోటను, మాధవరం వద్ద దెబ్బతిన్న గుమ్మడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వర్షాలకు జిల్లాలో 17 మండలాలు ప్రభావితమయ్యాయన్నారు. జిల్లాలో రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల మేర పంటలకు నష్టం వాటిలినట్లు జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు చెప్పారు. పొదిలి, మార్కాపురం, కనిగిరి, దర్శి, కొండపి ప్రాంతాల్లో సజ్జ, జొన్న, పొగాకు , అలసంద, ప్రత్తి, మినుము, వరి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈక్రాప్ నమోదు చేయని రైతులకు కూడా పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టామన్నారు. కౌలు చట్టం ద్వారా ప్రతి రైతుని ఆదుకుంటామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 3749 హెక్టార్లలో 3231 మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు తయారుచేశారన్నారు. వాటితో పాటు ఉద్యానపంటలు 561 హెక్టార్లలో 797 మంది రైతులు వేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వానికి పంటల నష్టం వివరాలను పంపినట్లు చెప్పారు. మరలా వర్షాలు కురుస్తున్నందున మంత్రి సూచనమేరకు దెబ్బతిన్న పంటల నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాళ్లూరు మండలం రామభద్రాపురంలో సజ్జకంకి గింజలకు మొలిచిన మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి



కొత్తకోట వాగులో ప్రవహిస్తున్న వరదనీరు

ఆగని వాన

● ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తకోట వాగు

● నిలిచిన రాకపోకలు

నాగులుప్పలపాడు అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి మండలంలో మళ్లీ కుండపోత వర్షం కురవడంతో అంతా జలమయంగా మారింది. చదలవాడ రామన్న చెరువుకు ఇటీవల గండిపడిన ప్రాంతం వద్ద నుంచి 216 జాతీయ రహదారి పైకి వరదనీరు చేరింది. కొత్తకోట వాగులో సైతం వరదనీరు చేరడంతో నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ముప్పాళ్ల, ఈదుమూడి, మాచవరం, ఉప్పుగుండూరు గ్రామాల్లోని పొలాల్లో మరింత వరద నీరు చేరి కనుచూపు మేర అంతా జలమయంగా మారింది. మరో రెండు రోజుల తర్వాత మరో అల్పపీడనం ఏర్పడవచ్చన్న వాతావరణశాఖ సూచనలతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

● బైక్‌పై వస్తుండగా ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

● సంఘటనా స్థలంలోనే మృతి ● ఎస్పీ దామోదర్ నివాళి

● భార్య తొమ్మిది నెలల గర్భిణి

చీమకుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కష్టపడి తాను అనుకున్న ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించటంతో పాటు, సంఘ విద్రోహశక్తులను మట్టుబెట్టే అత్యంత రిస్క్‌తో కూడిన కీలకమైన బాధ్యతలో ఉన్న కానిస్టేబుల్ దూదేకుల మాబూసుభానీ(28) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. చీమకుర్తి మండలం రెడ్డినగర్ వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. మార్కాపురం సబ్‌డివిజన్‌లో మాబూసుభానీ తన విధులు ముగించుకొని బైక్‌పై హెడ్‌క్వార్టర్ ఒంగోలులో రిపోర్ట్ చేసే నిమిత్తం వస్తున్నారు. ఈక్రమంలో ఆయనను వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కానిస్టేబుల్ హెల్మెట్ ధరించినా అది ఊడిపోవటం, తలకు బలమైన గాయం తగలటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మాబూసుభానీ 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. దోర్నాల మండలం చినగుడిపాడుకు గ్రామానికి చెందిన ఆయనకు వివాహం అయింది. భార్య తొమ్మిదినెలల గర్భిణిగా ఉండటం అందరి హృదయాలను కలచివేసింది. ఘటనా స్థలానికి వచ్చిన సీఐ సుబ్బారావు, సిబ్బంది విగతజీవిగా పడిఉన్న సుభానీని చూసి చలించిపోయారు. కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మాబూ సుభాని (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

రిమ్స్‌లో ఎస్పీ నివాళి

ఒంగోలు క్రైం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ మాబూసుభానీ మృతదేహన్ని ఎస్పీ ఏఆర్.దామోదర్ సందర్శించారు. శనివారం రాత్రి స్థానిక రిమ్స్‌లో ఉన్న ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి ఎస్పీ ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలి

● డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఈనెల 21,22వ తేదీల్లో కేంద్ర ఆరోగ్య బృందం తనిఖీలు చేస్తుందని, అందువల్ల అన్ని రికార్డులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో శనివారం ప్రోగ్రామ్ అధికారుల సమావేశంలో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. జిల్లాలో అధికవర్షాలు కురుస్తున్నందున నీటికాలుష్యం వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది నిర్దేశించిన గ్రామాలు, పట్టణాల్లో విధిగా నివాసం ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంశాలవారీగా దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైద్య అధికారులు పద్మజ, వాణిశ్రీ, భగీరథి, నోడల్ అధికారి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

తవ్వేకొద్దీ వెలుగుచూస్తున్న అక్రమాలు

మరో సర్కార్ దుకాణంలో రూ.9 లక్షలు మాయం

ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ ఆస్తులపై దృష్టిసారించిన అధికారులు

ఒంగోలుక్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం శాఖలో చోటుచేసుకున్న అవినీతి బాగోతం బయటపడిన విషయం తెలిసిందే. తొలుత ఎలైట్ మాల్‌లో రూ.2.34 కోట్ల నిధులు గోల్‌మాల్ అయినట్లు నిర్ధారించిన అధికారులు రమణ వెరిఫికేషన్ అధికారిగా ఉన్న మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒంగోలులోని ఓ దుకాణంలో మరో రూ.9లక్షలు మాయం అయినట్లు తెలిసింది. దీంతో అక్కడ పనిచేసే సూపర్‌వైజర్ ద్వారా ఆ మొత్తాన్ని రికవరీ చేసినట్లు తెలిసింది. అదేక్రమంలో కానిస్టేబుల్ రమణ ఆస్తులపై అధికారులు దృష్టి సారించారు. ఎక్సైజ్ శాఖ నుంచి రవాణా, రిజిస్ట్రేషన్ శాఖలకు లేఖలు రాశారు. రమణకు సంబంధించిన ఆస్తులు, వాహనాలు ఎవరికి బదిలీ చేయకూడదని కోరారు. అదేవిధంగా బ్యాక్‌లలో ఉన్న నగదును ఫ్రీజ్ చేయాలని లేఖలు రాయనున్నట్లు తెలిసింది. అయితే ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు కానిస్టేబుల్ రమణపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఎలైట్ మాల్స్‌లో పనిచేసే సిబ్బందిని విచారణ చేసి రాత్రికి ఇంటికి పంపిస్తున్నారు.

భారీగా పంట నష్టాలు

● 4,510 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంట నష్టాలు భారీగానే వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పంట నష్టాలను గుర్తించే పనిలో ఉన్నారు. కాగా జిల్లాలోని 21 మండలాల్లోని 94గ్రామాల్లో సుమారు 4150.47 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 3,427మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. అందులో సజ్జ 1,883.47, మినుము 844, జొన్న 3, అలసంద 1,050, పత్తి 250, వరి 120 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి సుమారు 3,231మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు నివేదికను పంపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు తగ్గి ఎండలు వస్తుండటంతో పంట నష్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తున్నది.

సింగరాయకొండలో భారీ వర్షం

86.2 మీ.మీ నమోదు

సింగరాయకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండలో శనివారం ఉదయం భారీవర్షం కురిసింది. మండలంలో 86.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పది గ్రామాల్లోని చెరువుల్లోకి వర్షపునీరు భారీగా వస్తోంది. దీంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. బింగినపల్లి చెరువు సమీపంలో పీబీ చానల్‌కు గండి పడటంతో గ్రామానికి చెందిన రైతులు నీరు వృథా పోకుండా ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. నీటిని బింగినపల్లి చెరువుకు మళ్లించారు.



పీబీ చానల్‌కు పడిన గండిని పూడ్చుతున్న రైతులు

జిల్లాలో 9.1మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి మంచి వర్షం కురిసింది. శనివారం ఉదయానికి 19.1 మి.మీ వర్షపాతం నమోదైంది. జరుగుమల్లి మండలంలో 40.6, కొనకనమిట్ల 35.6, సింగరాయకొండ 29.8, బేస్తవారపేట27.8, గిద్దలూరు 25.6, మార్కాపురం 22.2, పొదిలి 17.4, టంగుటూరు 16.4, కంభం 14.8, కొమరోలు 13.4, పెద్దారవీడు 12.4, వెలిగండ్లలో 11.4 మి.మీ వర్షం కురవగా మరో పది మండలాల్లో కొద్దిపాటి వాన పడింది.

చెన్నకేశవస్వామికి వెండి తట్టలు బహూకరణ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి 2 వెండి తట్టలు శనివారం దాతలు బహూకరించారు. విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ మండవేముల శివరామకృష్ణ 992 గ్రాముల 2 వెండి తట్టలను ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులకు అందజేశారు.



చెన్నకేశవస్వామికి వెండి తట్టలు బహూకరిస్తున్న దాతలు

'ఊరి నుంచి చాలా తీసుకున్నాం. తిరిగి ఎంతోకొంత ఇచ్చేయాలి. లేకపోతే లావైపోతాం' అని శ్రీమంతుడు చిత్రంలో ఒక పాపులర్ డైలాగ్ ఉంది. ఊరి కోసం రోడ్డు వేయడం, నీళ్లు తెప్పించడం, పాఠశాల కట్టించడం ఆ సినిమాలో చూశాం. అలా చేసిన కథానాయకుడిని అందులో శ్రీమంతుడు అన్నారు. అలాంటి పనులు చేసిన ఒక ఎన్‌ఆర్‌ఐ రియల్ శ్రీమంతుడు అనిపించుకుంటున్నారు. ఆయన తన గ్రామం బాగు కోసం తపించారు. ఆ ఊరి జనం బాధను తన బాధగా భావించారు. వారి కష్టాలను చూసి చలించారు. వారు అడిగినదల్లా చేసి చూపించి ఈ తరం శ్రీమంతుడి అనిపించుకున్నారు. ఆయనే చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలేనికి చెందిన నల్లూరి వెంకట శేషయ్య. తన గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ కష్టాల్లో ఉన్నవారికి నేనున్నాను అంటూ ఆపన్నహస్తం అందిస్తున్న ఆ 'మహర్షి'పై ప్రత్యేక కథనం..


పరిశుభ్రమైన కారుమంచి కాలువ

ఊరు మెచ్చిన శ్రీమంతుడు

- స్వగ్రామ సమస్యలను తీరుస్తున్న ఎన్‌ఆర్‌ఐ
- సొంత ఖర్చుతో కేవీపాలెంలో పనులు
- నాయుడు చెరువు అభివృద్ధికి రూ.35 లక్షలు
- రూ.10 లక్షలతో కారుమంచి మేజర్ ఆధునికీకరణ
- గ్రామంలో సీసీ రోడ్డు, మరుగుదొడ్ల నిర్మాణం
- పదేళ్లలో రూ.3 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

రైతు కష్టం తెలిసే జలయజ్ఞానికి శ్రీకారం



నా చిన్నప్పటి నుంచి గ్రామంలో రైతులు పడే నీటి కష్టాలను చూశా. నేనూ ఆ కష్టాలు అనుభవించా. ఓ రైతు బిడ్డగా నాకు వచ్చిన అవకాశాన్ని ఉపగించుకుని కారుమంచి మేజర్ పనులు చేపట్టి రైతుల ఆనందం చూశా. ఎంత డబ్బైనా ఖర్చు అయినా వెనుకాడను. 15 గ్రామాల రైతుల కళ్లలో ఆనందం చూశాను. ఇదే కాదు ఇంకా చేస్తా..- నల్లూరి వెంకట శేషయ్య, ఎన్‌ఆర్‌ఐ

చీమకుర్తి,అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనంనేనివారి పాలేనికి చెందిన మాజీ సర్పంచ్ నల్లూరి వెంకట సుబ్బయ్య, వెంకమ్మల కుమారుడు వెంకట శేషయ్య. ఈయన దుబాయ్ కేంద్రంగా ఉన్న నాల్‌సాఫ్ట్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీకి అధిపతి. కరోనా కష్టకాలంలో కేవీ పాలెంతో పాటు, పరిసరప్రాంత గ్రామాల ప్రజలకు ఇంటింటికీ బియ్యం, నిత్యవసరాల సరకులు అందించి ఔదార్యం చూపారు. తన ఊరి బాగు కోసం ఏదో ఒకటి చేయాలని తపిస్తుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన రైతులు తమ సమస్యను శేషయ్య దృష్టికి తీసుకెళ్లారు.

శేషయ్య ఔదార్యంతో 'మేజర్' పనులు

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. నీటి సమస్యను ఎన్‌ఆర్‌ఐ నల్లూరి వెంకట శేషయ్య దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించారు. ఎంత ఖర్చయినా తాగు భరిస్తానన్నారు. పనులు మొదలు పెట్టమన్నారు. దాదాపు రూ.10 లక్షలకుపైగా వెచ్చించి మూడు రోజులుగా మేజర్‌కు నిర్వహిస్తున్న మరమ్మతుల పనులు శరవేగంగా జరుగుతూ ముగింపుకొచ్చాయి. కాలువ లోపల చిల్లచెట్లు తొలగించారు. పూడికతీసి వెడల్పు చేశారు. హెడ్ వద్ద గేటు బిగించారు. జీఎల్‌పురం వరకూ ఆరు కిలోమీటర్ల మేర కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ పూడికతీత పనులు చేపడుతున్నారు. పనులు ముగియగానే నీటి సరఫరా చేస్తారు. దీంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి సమస్యపై స్వాంతన చేకూరినట్టవుతుంది. కట్ట కూలినచోట పునరుద్ధరణ పనులు వరకైనా ప్రభుత్వం చేపడితే మేజర్ కింద సమస్యలు పూర్తిస్థాయిలో తీరినట్టు అవుతుంది.

కారుమంచి మేజర్ సమస్య ఇదీ..

రామతీర్థం జలాశయం దిగువ నుంచి కారుమంచి మేజర్ ద్వారా చీమకుర్తి, సంతనూతలపాడు, టంగుటూరు మండలాలకు తాగు, సాగునీరు అందుతుంది. మూడేళ్ల క్రితం మదుకాన్ గ్రానైట్ క్వారీ సమీపంలో కాలువ కుంది. కాలువ పక్కన క్వారీలో లోతుగా తవ్వడం వల్ల కాలువ గట్టు విరిగి క్వారీలో పడింది. తాత్కాలికంగా కాలువను మళ్లించి పక్కన చిన్న కాలువ చేసి కొంతమేర నీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. మూడేళ్ల నుంచి ఇదే దుస్థితి. నీరు సరిగ్గా సరఫరా చేయకపోవటంతో మేజర్ కాలువలో పూడిక పేరుకుపోయింది. చిల్లచెట్లుతో నిండిపో యింది. ఓబీసీ నుంచి కారుమంచి మేజర్‌కు నీటిని మళ్లించే హెడ్ వద్ద గేటు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నిధుల లేమి పేరుతో ప్రభుత్వం వీటి మరమ్మతులు చేపట్టలేదు. పలుమార్లు ప్రజాసంఘాలు, రైతు సంఘ, టీడీపీ నాయకులు కారుమంచి మేజర్‌కు మరమ్మతులు నిర్వహించాలని నిరసన ప్రదర్శనలు కూడా గత ప్రభుత్వ హయంలో జరిగినా ఎటువంటి స్పందనా లేదు.


ఓబీసి వద్ద కారుమంచి మేజర్‌కు బిగిస్తున్న షట్టర్లు

మా ఊరి దేవుడు



మాలో ఒకరుగా మా కష్టాల్లో పాలుపంచుకుంటూ, మా బిడ్డల బంగారు భవిష్యత్‌కు పాటుపడుతున్న శేషయ్యను మా ఊరి పాలిట దైవంగా మేమందరం భావిస్తాం. మాకు ఏమి కష్టమొచ్చినా అడిగిందే తడవుగా అన్ని విధాల అండగా ఉన్న ఆయన మేలును మేమెన్నడూ మరవం.

-బక్కా వనజ, క్రిస్టియన్‌పాలెం, కేవీ పాలెం

ఇప్పటికే రూ.3 కోట్లు



శేషయ్య గత దశాబ్దంగా మా ఊరి కోసం దాదాపు రూ.3 కోట్లు ఖర్చుట్టారు. ఊరి చెరువు బాగు చేయటం ద్వారా తిండి గింజలకు లోటులేకుండా చేశారు. కరోనా కష్టకాలంలో చాలా ఆదుకున్నారు. మా ఊరు మొత్తం ఆయనకు రుణపడి ఉంటాం.

- పాలడుగు నారాయణ, రైతు, కేవీపాలెం

గ్రామంలో మరికొన్ని సేవలు

గ్రామంలోని నాయుడు చెరువు అభివృద్ధికి 2018లో రూ.35 లక్షలు, ఆనాటి టీడీపి ప్రభుత్వం మంజూరు చేసిన మ్యాచింగ్ గ్రాంట్‌తో కలిపి రూ.50 లక్షలతో చెరువులో పూడికతీతలు, చిల్లచెట్లు తొలగింపు చేపట్టి దాదాపు 200 ఎకరాల్లో రైతుల ఇంట ధాన్యపు సిరులు కురిపించారు.

- ఇటీవల గ్రామంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు పూర్తి అయ్యే దశలో ఉన్నాయి. పదేళ్ల క్రితమే గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ కట్టించారు.
- కేవీపాలెంలో ఎస్సీ కాలనీ గృహాల్లో దాదాపు రూ.25లక్షలతో మరుగుదొడ్డి లేని గృహాలకు నిర్మాణాలు చేపట్టి ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని నిలిపారు. వారి పిల్లల విద్యాభివృద్ధికి నెలనెలా రూ.20వేలు ఖర్చు చేసి రాత్రివేళ ట్యూషన్ ఏర్పాటు చెప్పిస్తున్నారు.

టెట్‌కు 49 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు శనివారం 49 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా శనివారం ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్, మార్కాపురంలోని కృష్ణచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. పరీక్షకు 310 మంది అభ్యర్థులను కేటాయించగా 261 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 155 మందికి 30, మధ్యాహ్నం సెషన్‌కు 155 మందికి 9 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ శివకుమార్ తెలిపారు.

పరీక్షలు వాయిదా

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-2 పరీక్షలు నవంబరుకు వాయిదాపడ్డాయి. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు ఆకస్మికంగా సెలవులు ప్రకటించాల్సిరావడంతో పరీక్షలను నవంబరుకు వాయిదా వేశారు. గతంలో ప్రతిరోజు ఒక పరీక్ష కాకుండా ప్రతిరోజు రెండు పరీక్షలు చొప్పున నవంబరు 6,7,8 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అందజేస్తారు.


ఒంగోలు రైల్వే ఫ్లైఓవర్‌పై...


అద్దంకిలో..

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింట్లో అందాలు

ఆకాశం అనేక అద్భుతాలు పలికిస్తుంది. నీలి మేఘాలతో 'చల్లని' కబురు పంపి భూమండలానికి ఆహ్లాదాన్ని పంచుతుంది. సూర్యాస్తమయాన మబ్బుల్లో మర్డర్ జరిగినట్టు ఎరుపు ఛాయతో భానుడిని చూపి భయోత్పాన్ని సృష్టిస్తుంది. వెండి చాపతో భూమిని కప్పినట్టు మేఘాలను పంపి కనువిందు చేస్తుంది. అలాంటి అద్భుతాలే ఒంగోలు, అద్దంకిలో శనివారం ఆవిష్కృతమయ్యాయి. అద్దంకి సమీపంలో శనివారం సాయంత్రం సూర్యాస్తమయాన మబ్బుల చాటు నుంచి సూర్య కిరణాలు బంగారు వర్ణంలో భూమిని తాకుతున్నట్టు కనిపించాయి. ఒంగోలులో మేఘాలు నగరాన్ని కప్పేసినట్టు కనువిందు చేశాయి. - ఒంగోలు/అద్దంకి(ఆంధ్రజ్యోతి)


ఒంగోలులో ఆపిన గ్రానైట్ రవాణా వాహనాలు

ఆగని గ్రానైట్ అక్రమ రవాణా

- 8 కంటైనర్లు పట్టివేత
- అడ్డదారుల్లో అక్రమార్కుల రవాణా

ఒంగోలు క్రైం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రానైట్ అక్రమ తరలింపు ఆగడం లేదు. అక్రమార్కులు అడ్డదారుల్లో నిత్యం చెలరేగి పోతున్నారు. ఇటీవల మైనింగ్‌శాఖ ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు రెండు చెక్‌పోస్టులు, రెండు మొబైల్ టీమ్‌లు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో పేర్నమిట్ట దాటిన తరువాత ఒంగోలు డెయిరీ సమీపంలో ఆరు గ్రానైట్ కంటైనర్లను మైనింగ్‌శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. కనిగిరిలో రెండు గ్రానైట్ కంటైనర్లును మైనింగ్‌శాఖ విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఒంగోలు సమీపంలోని పేర్నమిట్ట, పొదిలి సమీపంలోని ఉప్పలపాడు వద్ద మైనింగ్ చెక్‌పోస్టులు ఉన్నాయి. గ్రానైట్ మాఫియా చెక్‌పోస్టుల సిబ్బందిని మేనేజ్ చేసి అక్రమ తరలింపులకు పాల్పడుతోందని ప్రచారం జరుగుతోంది. కోట్ల రూపాయల విలువైన గ్రానైట్ శ్లాబులు చెన్నయ్ పోర్టుకు, గ్రానైట్ పలకలు హైదరాబాద్, బెంగళూరు, కేరళ ఇతర ప్రాంతాలకు ఎలాంటి బిల్లులూ లేకుండా తరలిపోతున్నాయి. గ్రానైట్ అక్రమ తరలింపులపై కఠిన చర్యలు తప్పవని మైనింగ్ శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ హెచ్చరించినా కొనసాగడం గమనార్హం.


వాలీబాల్‌కు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(రూరల్), అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట జడ్పీ హైస్కూల్లో శనివారం అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీలకు బాల, బాలికలు ఎంపికలు జరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి మొత్త 200 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో 1 2మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైనా క్రీడాకారులు సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హాజీరాబేగం, హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య, పీడీలు వై.శీనయ్య, ఎం.చిరంజీవి, జిల్లా వాలీబాల్ అసోషియోషన్ కార్యదర్శ ఎం.అంజనేయులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కరువు

- తూర్పుగంగవరం, మన్నేపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత
- టీడీపీ నేతల మధ్య సఖ్యత లేనందునే పనులకు బ్రేక్

తాళ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలి. అయితే, అధికాపార్టీ నేతల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు కూలీలకు శాపంగా మారింది. మండలంలోని తూర్పుగంగవరం, మన్నేపల్లి పంచాయతీల్లో ఉపాధి పనులు నిలిచి పోకోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. తూర్పుగంగవరం పంచాయతీలో 1002 మంది కుటుంబాలకు, మన్నేపల్లి పంచాయతీలో 509 మంది కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. తూర్పుగంగవరంలో 2021 నుంచి ఉపాధి పనులు నిలిచిపోయాయి. అప్పటి వైసీపీ నేతల్లో ఉన్న అంతర్గత పోరుతో పనులు జరుగలేదు. అయితే, మన్నేపల్లిలో కూటమి ప్రభుత్వం వచ్చేవరకు పనులు బాగానే జరిగాయి. ఈరెండు గ్రామాల్లో ఉపాధి పనులు చేయించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌లను టీడీపీలో నెలకొన్న ఆధిపత్యపోరుతో నియమించలేదు. సీనియర్ మేట్ల నియామకాలు జరగలేదు. దీంతో ఉపాధి పనుల కల్పనకు తీవ్ర అడ్డంకిగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద గ్రామాల్లో అనేక రకాల ఉపాధి పనులు కల్పిస్తున్నారు. దీంతో కూలీలు ఈపనుల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ రెండు గ్రామాల్లో పనులు జరగక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగంగవరంలో మూడేళ్లగా ఉపాధి పనులు చేపట్టకపోయినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. వలసల నివారణకు ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా, అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ఉపాధికూలీలకు పనులు కల్పించేందుకు శ్రద్ధ చూపకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈగ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించి ఉపాధికూలీలకు పనులు కల్పించడంలో అధికారయంత్రాగం, అధికారపార్టీ కీలక నేతలు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు ఇప్పటికైనా ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తూర్పుగంగవరం, మన్నేపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.


తాళ్లూరులోని జాతీయ ఉపాధి హామీ కార్యాలయం

పదవీ బాధ్యతలు స్వీకరించిన దినకర్



దినకర్‌ను సత్కరిస్తున్న నూకసాని, సత్య, బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : 20 సూత్రాల పథకం అమలు కమిటీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన లంకా దినకర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. శనివారం సెక్రటేరియట్‌లోని పథకం కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టగా ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు, మరోవైపు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీలు బాధ్యతలు స్వీకరించిన దినకర్‌ను కలిసి బొకేలు అందజేసి అభినందించారు. మరో వైపు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీ వీ.శివారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు దినకర్‌కు భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి



కొమ్మమూరు కాలువ గండిని పరిశీలిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు, షేక్ మాబు కోరారు. ఉప్పుగుండూరు సమీపంలో వరదలకు దెబ్బతిన్న వరి పంటలు, కొమ్మమూరు కాలువకు పడిన గండ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో పంటలు మునిగిపోవడంతో దెబ్బతిన్నాయన్నారు. కొమ్మమూరు కాలువలకు గండ్లు పడి నష్టం పెరిగిందని, దీని పరిధిలో సమారు 1500ఎకరాల్లో నాట్లు వేశారని, ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి నీటిపాలయిందని చెప్పారు. కొమ్మమూరు కాలువలకు పక్కనున్న మురుగు కాలువలు పూడికతో నిండిపోయి వరద వెళ్లే మార్గం లేక పంట పొలాలను ముంచెత్తినట్లు పేర్కొన్నారు. 216 జాతీయ రహదారి నిర్మాణంలో డ్రైనేజి సౌకర్యం కల్పించకపోవడంతో అక్కడి వరదనీరు సైతం పంటపొలాలపై చేరి రైతులు అన్నివిధాల నష్టపోయారని తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.బసవపున్నయ్య, తూబాటి శ్రీకాంత్, నల్లూరి భాస్కరరావు, మాదాసు నాగేశ్వరరావు, పెంట్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో పూర్తి చేశారు. ప్రిన్సిపాల్, పీఈటీ, సీఆర్టీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కాగా ఒక్కొక్క పోస్టుకు ఐదుగురు చొప్పున మెరిట్ అభ్యర్థులను ఆహ్వానించారు. ఆదివారం పీజీటీల్లో అకౌంటెండెంట్, వార్డెన్ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. మేసేజ్‌లు అందుకున్న మెరిట్ అభ్యర్థులు హాజరుకావాలని ఇన్‌చార్జి డీఈవో సామా సుబ్బారావు కోరారు.

'గృహాల మధ్య మద్యం దుకాణం వద్దు'

సంతనూతలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గృహాల మధ్యన మద్యం షాపు వద్దంటూ శనివారం సాయంత్రం సంతనూతలపాడులోని పెద్దబజారుకు చెందిన ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మాబూ సుభానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం దుకాణం ఏర్పాటు చేయబోతున్న స్థలానికి ఎదురుగా సాయిబాబా సత్సంగ మందిరం, గ్రంథాలయం, ట్యూషన్ సెంటర్స్ ఉన్నాయని తెలిపారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు కొలతలు వేస్తుండగా స్థానికంగా నివాసం ఉండే మహిళలు నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జనావాసాలకు దూరంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయించాలని కోరారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

సంతనూతలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన మండలంలోని మన్నవారిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. దాదాపు పది ఇళ్లలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయి. దాదాపుగా రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. గ్రామంలోని వీధిలైట్లు సైతం పగిలిపోయినట్లు వారు తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

● 93 కేసుల నమోదు

కొండపి, అక్టోబరు19, (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు కొండపి సెక్షన్‌లో అన్ని గ్రామాల్లో దాడులు చేసి విద్యుత్ అక్రమ వాడకం దారులపై కేసులు నమోదు చేశారు. కందుకూరు ఈఈ మల్లెల నాగేశ్వరరావుతోపాటు ఏఈలు వివరాలను శనివారం సాయంత్రం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విలేకరులకు వివరించారు. ఇంటిలో మీటరు ఉన్నా నేరుగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చి అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న నలుగురిపై, కేటగిరీ మార్చుకుని విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరు, తక్కువ లోడుకు డబ్బులు చెల్లించి, ఎక్కువ లోడు వాడుకుంటున్న 89 మంది వినియోగదారుల నుంచి రూ.3,11,600 అపరాధ రుసుం విధించామని వివరించారు. సమావేశంలో డీఈలు యుగంధర్, రాఘవేంద్రరావు, విజయబాబు, ఏఈలు దాడుల్లో పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కొండపి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో బి.రామాంజనేయులు గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా తొలగింపజేయాలని సూచించారు. సమావేశంలో కార్యాలయ ఏవో పి.రామకృష్ణ, ఈవోఆర్డీ ఎం.అంజలీదేవి పాల్గొన్నారు.



భాగ్యనగర్‌లో..



కొత్త మార్కెట్‌రోడ్డులో..



శర్మా కళాశాల రోడ్డులో నిలిచిన నీరు



కర్నూలురోడ్డులో మోకాళ్లలోతులో నిలిచిన వర్షపునీరు

చినుకుపడితే చెరువులే..!

● కొద్దిపాటి వర్షానికి ఒంగోలు జలమయం

నగరంలో ప్రధాన సైడు కాలువలను ఆక్రమించి ర్యాంపులు, మెట్లు, సిమెంటుతో శాశ్వతంగా మూసివేయడంతో వర్షం పడినపుడు ఆ నీరు కాలువల్లోకి చేరే పరిస్థితి లేదు. ప్రత్యేకించి కర్నూలు రోడ్డు, ట్రంక్‌రోడ్, బాపూజీ కాంప్లెక్స్ ఏరియా, మంగమూరురోడ్, ఇలా పలు ప్రధాన రహదారులు చెరువుల్లా మారిపోతున్నాయి. దీంతో ఆ వైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అయితే వర్షం కురిసినపుడు తాత్కాలిక చర్యలకే పరిమితం అవుతున్నారు. మురుగు తొలగింపునకు ఎక్స్‌వేటర్లను వినియోగిస్తున్నారు. ఆక్రమనలు తొలగించకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నగరం జలమయం అవుతుంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నగరం నీట మునగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

– ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే బీఎన్



చదలవాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పల్లెపండుగలో భాగంగా మండలంలోని చదలవాడలో రూ.45లక్షలు, ఉప్పుగుండూరులో రూ.45లక్షలు, ఈదుమూడిలో రూ.30 లక్షలు, కె.తక్కెళ్లపాడులో రూ.30లక్షలతో చేపట్టనున్న సిమెంట్‌రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో బీఎన్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధిని విస్మరించారని ఆయన ఆరోపించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో రానున్న ఐదేళ్లలో గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. గ్రామాలకు కేటాయించిన నిధులను వినియోగించుకొని అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బేబీరాణి, ఎంపీడీవో మహాలక్ష్మి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నాయకులు గుమ్మడి సాయిబాబా, డీఈ కృష్ణమోహన్, ఏఈ రవి, ఏపీవో రవి, సర్పంచ్‌లు దాసరి లక్ష్మీ వరప్రసాద్, దేవరకొండ జయమ్మ, బోలే లక్ష్మీ, నూతలపాటి రామ్మోహనరావు, బోయిడి బ్రహ్మరాజు, కొల్లా ఆంజనేయులు, దాసరి సురేష్, కాట్రగడ్డ చంద్రబాబు, బెల్లం వెంకటేశ్వర్లు, కనగాల శ్రీనివాసరావు, కుర్రా వీరాంజనేయులు, ఆళ్ల ప్రేమ్‌చంద్, కొండ్రగుంట రంగారావు, రామ్మోహనరావు, మెట్టు సుబ్బయ్యనాయుడు, ఎన్.శంకర్, చావా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగంటే ఊరంతా పండుగే!

● టీడీపీ నేత జయంత్‌బాబు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జయంత్‌బాబు, అధికారులు, నాయకులు

టంగుటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగంటే ఊరంతా పండుగేనని మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు అన్నారు. శనివారం టంగుటూరులో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈసభలో జయంత్‌బాబు మాట్లాడుతూ గ్రామం నిండా సమస్యలేనని, కొత్త అధికార యంత్రాగం వచ్చినందున సమస్యలు పరిష్కరించాలని కోరారు. పల్లె పండుగలో భాగంగా తొలి విడతగా రూ.50లక్షలతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుంటే వైసీపీ నేతలు మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిరాల మమత, ఎంపీడీవో దేవసేనకుమారి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో సుభాషిణి, వెలుగు సీసీ వెంకట్రావు, వార్డు సభ్యుడు మక్కెన కోటేశ్వరరావు, టీడీపీ పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి తోకల భారతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గైర్హాజరు

టంగుటూరులో జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి ముందుగా మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కలెక్టర్ అన్సారియా హాజరుకానున్నట్లు విస్తృత ప్రచారం చేశారు. అయితే ఉదయం నుంచి కురుస్తున్న ఎడతెరపిలేని వర్షంతో వారు హాజరుకాలేదు. మంత్రి ద్వారా సమాచారం తెలుసుకున్న నాయకులు సభను కొనసాగించారు.

ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు

కాగా పల్లెపండుగ కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఉపాధి సిబ్బందిపై పీడీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఏపీడీ వెంకటస్వామి తెలిపారు. శనివారం రాష్ట్ర హెడ్ క్వార్టర్ నుంచి తనిఖీ బృందం టంగుటూరులోని కార్యాలయానికి వచ్చినా స్పందించలేదని, అలాగే పల్లె పండుగ కార్యక్రమానికి కూడా వారు నిర్లక్ష్యం వహించారని ఆయన చెప్పారు. వీరిలో ప్రధానంగా ఇద్దరు ఆఫీస్‌లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు విజయలక్ష్మి, సృజన, బీఎఫ్‌టీ చెన్నమ్మ ఉన్నట్లు సమాచారం.

మురుగునీటి పారుదలకు మెరుగైన చర్యలు

● కమిషనర్ వెంకటేశ్వరరావు



డ్రైనేజీకాలువను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షం వల్ల నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నగరంలో కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయం అయ్యాయి. దీంతో ఆయా కాలనీల్లో కమిషనర్ పర్యటించి, అందుకుగల కారణాలు పరిశీలించారు. కాగా, కార్పొరేషన్ మెయిన్ డ్రైయిన్‌తోపాటు, అండర్ కేబుల్‌కు వేర్వేరుగా కాలువలు ఉండటంతో మురుగుపోయే పరిస్థితి లేదని గుర్తించారు. దీంతో వ్యాపార సముదాయల ముందు నిర్మించిన ర్యాంపులు తొలగింపునకు చర్యలు చేపట్టారు. కాగా ప్రతి 10 అడుగులకు ఒక మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసి, కాలువ పూడికతీత పనులు చేపట్టాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. కాగా ఇకపై నగరంలో వర్షపునీరు నిలబడకుండా తగిన విధంగా తీసుకుంటున్నట్లు కమిషనర్ మీడియాకు తెలిపారు. అదేవిధంగా అగ్రహారం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఎంపీ మాగుంటను కలిశారు. అండర్ పాస్ నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి ఎన్‌ఓసీ ఇవ్వడం జరిగిందని కమిషనర్ వెంకటేశ్వరరావు ఎంపీకి వివరించారు.

రామాయపాలెంలో విషజ్వరాలు

మర్రిపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాయపాలెం గ్రామంలో నెలరోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. తరచూ పడుతున్న వర్షాలకు దోమల బెడద తీవ్రతరమైంది. దీంతో దోమల బారినపడి విషజ్వరాలపాలవుతున్నారు. ప్రతి ఇంటిలో జ్వరపీడిత లక్షణాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా జ్వరం సోకినవారికి కీళ్ల నొప్పులతో మరింత ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల అమెరికా నుంచి వచ్చిన ఓయువకునికి విషజ్వరం సోకవడంతో ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. జ్వరాల బారిన పడటంతో గ్రామస్థాయిలో సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ప్రతి కుటుంబంలో ముగ్గురు, నలుగురు జ్వరాలతో బాధపడుతుండటంతో వ్యవసాయ పనులకు సైతం ఇబ్బంది కరంగా మారింది. వైద్యాధికారులు స్పందించి రక్త నమూనాలు సేకరించడంతో పాటు జ్వరాలు ప్రబలకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భారీవర్షాలకు రేకుల ఇల్లు ధ్వంసం

మర్రిపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు జువ్విగుంట కృష్ణబలిజ కాలనీలో రేకుల ఇల్లు ధ్వంసమైంది. కాలనీకి చెందిన పసుపులేటి బ్రహ్మానందం సత్తుగిన్నెల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఇటీవల వీస్తున్న గాలులకు రేకులపైకప్పు లేచిపోయింది. దీంతో లక్షరూపాయలకుపైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. నిలువ నీడలేక పరుల పంచన ఆశ్రయం పొందాల్సి వస్తుందని, అధికారులు స్పందించి పక్కాగృహం మంజూరు చేయాలని ఆయన వేడుకున్నారు.

22 నుంచి గ్రామాల్లో ఆధార్ సేవలు

ఒంగోలు(రూరల్), అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు గ్రామాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు ఎంపీడీవో కె.రాజశేఖరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉలిచి, 23న కరవది, 24న వలేటివారిపాలెం, 25న చేజర్ల గ్రామంలో జరిగే ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఇళ్లను ఖాళీ చేయించడం తగదు

సంతనూతలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పేర్నమిట్టలోని పొగాకుబోర్డు సమీపంలో గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారిని ఎక్స్‌కవేటర్లతో అప్పటికపుడు ఖాళీ చేయించడం దారుణమని కార్పొరేటర్ తేళ్లచంద్రశేఖర్ శనివారం ఆరోపించారు. బాధితుల సమస్యను స్థానిక ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా పోరాడతామని తెలిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

సంతనూతలపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వి.అజయ్‌బాబు కోరారు. శనివారం సంతనూతలపాడు బస్టాండ్ వద్ద సరైన ధృవపత్రాలు లేని వాహనాలను ఆపి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి అపరాధరుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడవద్దని చెప్పారు. ఈ-చలానాలు ఉన్న వారు చెల్లించాలని సూచించారు.

వాగులో గల్లంతైన యువకుడు మృతి

● మృతదేహం లభ్యం



బ్రహ్మనాయుడు (ఫైల్)

మద్దిపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం రాచవారిపాలెం గ్రామానికి చెందిన యువకుడు గంగిశెట్టి బ్రహ్మనాయుడు ఈ నెల 17న వాగులో గల్లం తయిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు అతని ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. దీంతో వారు గాలింపు చర్యలు చేపట్టి వాగులో కిలోమీటర్ దూరంలో చిల్లచెట్లపొదల్లో చిక్కిపోయిన మృతదేహాన్ని కనుగొన్నారు. ఎస్సై శివరామయ్య మృతదేహాన్ని బ్రహ్మనాయుడుదిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్సుకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం సంతకాల సేకరణ

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగిన నటుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని కోరుతూ త్వరలో సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు లలిత కళా అకాడమీ వ్యవస్థాపకులు, కోటి వెలుగుల తెలుగు నిర్వాహకులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారికి, తెలుగు భాషకు ఎనలేని కీర్తిని తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది అని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ఎంతో ప్రాధాన్యతను, గౌరవాన్ని ఇచ్చిన మహనీయుడన్నారు. అటువంటి ఆదర్శమూర్తికి భారతరత్న ఇవ్వటం ఎంతో సముచితంగా ఉంటుందని, త్వరలో దీనిపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని పేర్కొన్నారు.

ఎంపీ మాగుంటకు సత్కారం



ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న అధికారులు

ఒంగోలుకలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మైన్స్ అండ్ జియాలజీ అధికారులు కలిసి ఎంపీ మాగుంటను శాలువతో సత్కరించి బొకే అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జియాలజిస్ట్ వర్మ, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్‌బాబు పాల్గొన్నారు. కాగా నగరంలో నూతనంగా ప్రారంభించిన స్నేహ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌ను మాగుంట సందర్శించారు. డాక్టర్ శరత్, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ సాయిస్నేహలు మాగుంటకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హాస్పటల్‌ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

టి.కృష్ణ వర్ధంతి సభ వాయిదా

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సంచలన దర్శకుడు టి.కృష్ణ 38వ వర్ధంతి సభ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఆదివారం వర్ధంతి సభ, ఈ సందర్భంగా పాటల పోటీలను ఏర్పాటు చేశామని, అయితే వర్షాలు కురుస్తున్నందున వాయిదా వేస్తున్నామని, త్వరలో మరొక తేదీని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు



కషాయం తయారీని వివరిస్తున్న రఘుపతిరావు

నాగులుప్పలపాడు అక్టోబరు 18 : పంటలపై సోకే తెగుళ్లను అరికట్టేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన అగ్నాస్త్రం ఆయుధంలా పని చేస్తుందని ఐసీఆర్‌పీ మండవ రఘుపతిరావు తెలిపారు. రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు శనివారం కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. పంటలపై వచ్చే ఆకుముడత తెగులు, కాండం తొలుచు పురుగు, వేరుపురుగు నివారణకు అగ్నాస్త్రం మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. రైతులు తమ ఇళ్ల వద్ద సులభంగా తయారుచేసుకొని పంటలపై ఉపయోగించుకొని తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలని చెప్పారు.

ఇంటి పన్నులను వసూలు చేయాలి

మద్దిపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి కోసం నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో వి.జ్యోతి కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త సంపద కేంద్రాలను వినియోగం లోకి తీసుకురావాలని ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ పట్ల దురుసు ప్రవర్తన దారుణం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండల సర్వసభ్యసమావేశంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పట్ల అసభ్య పదజాలంతో ఎంపీటీసీ వెంకట్రావు దూషించడాన్ని ఏపీ ప్రాథమిక వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ రాహుల్, డాక్టర్ ఖాదర్ మస్తాన్‌బీ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. సమావేశంలో ఒక మహిళా డాక్టర్‌ను అందరిముందు అసభ్యకరంగా దూషించడం దారుణంగా ఉందని విమర్శించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యుడైన వెంకట్రావుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తులు

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు నవోదయ విద్యాలయ పరిధిలో 29 మండలాల నుంచి ప్రభుత్వ, ప్రభుత్వగుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న వారు దరఖాస్తుకు అర్హులు. 9వతరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 8వతరగతి చదువుతున్నవారు, 11వతరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం పదో తరగతి చదువుతూ ఉండాలని, దరఖాస్తులను నవోదయవిద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచిడౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాలల హెచ్‌ఎంలతో దరఖాస్తులను ధృవీకరించి ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు.

నగరంలో అవగాహన ర్యాలీ

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో డైస్లెక్సియా వ్యాధి పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు విలీన విద్య ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ స్కూలులో నిర్వహించిన సదస్సులో సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ ఎం.రమేష్ మాట్లాడుతూ డైస్లెక్సియా అనేది ఒక అభ్యసనరుగ్మతకు సంబంధించినదన్నారు. ప్రసంగ శబ్దాలను గుర్తించడం, అక్షరాలు, పదాలు డీకోడింగ్ సమస్య కారణంగా చదవడంలో ఇబ్బంది ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంఈవో-2 సరస్వతి హెచ్‌ఎం ఎస్.పద్మావతి, ఉపాధ్యాయులు మాలిక్‌మొహిద్దీన్, నాగేంద్రమ్మ, సురేష్, ఆనంద్, రవికుమార్, సృజన, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మర్రిపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిమట గ్రామ శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. 8మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి రూ.72,170లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవీ..ఇవీ

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• పోలీసులకు సమాచారం అందించాలి : డీఎస్పీ నాగరాజు



మార్కాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్‌లోని ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. తాళాలు వేసి ఊళ్లకు వెళ్తున్న ఇళ్లపై దొంగలు దృష్టిసారి స్తారన్నారు. అంతేకాక గ్రామాలకు, పట్టణానికి దూరంగా ఉండే దేవాలయాల్లో ఈ మధ్య కాలంలో జిల్లాలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. శుభకార్యాలకు ఊళ్లకు వెళ్లే వాళ్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. లాక్డ్‌హౌస్ మాని టరింగ్ సిస్టం ద్వారా అలాంటి ఇళ్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచుతా రన్నారు. ముఖ్యంగా జిల్లాలో చెడ్డీగ్యాంగ్ తిరుగుతున్నట్లు వదంతులు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సివుందన్నారు. కొత్త వ్యక్తులు ఎవరు కనిపించినా తప్పకుండా పోలీసులకు తెలియజేయాలని అన్నారు.

కార్మికుల వినూత్న నిరసన

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన మున్సిపల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు శనివారం చెవులలో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల పట్ల అధికారుల మొండి వైఖరి విడనాడాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కార్మికులను బలి చేయవొద్దన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, యూసుఫ్, షబ్బీర్, బి.శ్రీను, సలాం, సుబ్బారెడ్డి, ఇమాంసా, నాగేంద్ర, మరియదాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ విజ్ఞానం అవసరం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు న్యాయ విజ్ఞానం అవసరం అని న్యాయవాది పైడి రామచంద్ర అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది రామయ్య, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మార్కాపురం రూరల్ అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి). మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోని శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ అంకమ్మరావు శనివారం తెలిపారు. వారి వద్ద నుండి రూ.1400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చే సినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి • కొమరోలులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కొమరోలు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక కొమరోలు సచివాలయం-3 రోడ్డు నుంచి ఎంపీడీవో కార్యాలయంల వరకు సిమెంటు రోడ్డును శనివారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరోలు మండలంలో రూ.2.5కోట్లతో సిమెంటు రోడ్లను వేయిస్తున్న ఘనత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో సిమెంటురోడ్లు, పలు కమ్యూనిటీ హాల్లను నిర్మించారన్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె పండుగ వారోత్సావాల్లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో రూ.2.5కోట్లు నిధులతో సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. కొమరోలు పట్టణంతో పెండింగ్‌లోని మినీ స్టేడియం, బీసీ, కాపు, మైనార్టీ భవనాలు, ముస్లిం షాదీఖానా భవనాలను త్వరలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యాక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఏపీవో మహాలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గజ్జలకొండ నారాయణ, కాంట్రాక్టర్ వీరంరెడ్డి కృష్టారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు బిజాల తిరుమలరెడ్డి, నాయకులు తుమ్మలపెంట వెంకట రమణ, చలిచీమల శ్రీనివాసచౌదరి, అంబారపు దామోదర్‌రెడ్డి, బిజ్జం రవింద్రారెడ్డి, అంబారపు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పెద్దారికట్లలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

పొదిలి : పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా మల్లవరం, కొష్టాలపల్లి గ్రామాల్లో రూ.11 లక్షలతో సీసరోడ్లకు ఎంపీడీవో శోభన్‌బాబు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ పంచాయతీల అభివృది కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఉందన్నారు. అధికారులు గ్రామస్థులను సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పం చ్ రెడ్డెబోయిన వెంకటసుబ్బయ్య, ఏపీవో వెంకట్రావు, భాస్కర్, పద్మా, ఉపాధిహామి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల : రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాయుడిపేట,పెదారికట్ల, సిద్దవరం గ్రామాలలో శనివారం ఆయన పల్లెపండుగ పంచాయితీ వారోత్సవాలలో భాగంగా పర్యటించారు. పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గొట్లగట్టు పంచాయితీలోని నాయుడిపేట రూ.20 లక్షలతో సీసీరోడ్లు అదేవిదంగా పెదారికట్లలో రూ.30 లక్షలు, సిద్ధవరం రూ25లక్షలతో గ్రామాలలో పలు సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నిగ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రస్తుతం తన ముందున్న లక్ష్యమన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ దారిలో నడవగలరా ?

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వర్షాల వలన మురికి నీరంతా రోడ్లపైకి చేరుకుంటోంది. అయితే డ్రైనేజీ వ్యవస్థ బాగా ఉన్న వీధుల్లో మళ్లీ మురికినీరు కాలువల్లో కలిసి పోతుండగా పట్టణంలోని కోటగడ్డవీధిలో మాత్రం సరియైన డ్రైనేజీ లేక మురికినీరు అలాగే రోడ్డుపై నిలువ ఉండి బురదగా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. ఈ రోడ్డుపై నడిచేందుకు వీలుకాని పరిస్థితి నెలకొనడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై అలాగే ఉన్న బురదలో ఉన్న మురికిని తొలగించాలని, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కోటగడ్డ వీధిలో రోడ్డుపై నిలిచిన మురుగు

ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు

- ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు
- పనులపై వచ్చే వారి పరిస్థితి అంతే

కంభం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు మరుగుదొడ్ల సమస్య వేధిస్తున్నది. ఒకేచోట అన్నిశాఖల భవనాలు ఉన్నాయని, సంతోషించాలో, కనీసం ఆయా శాఖల ఆవరణలో మరుగుదొడ్ల సౌకర్యం లేదని విచారించాలో తెలియని పరిస్థితి. ఉపాధి హామీ స్వచ్ఛభారత్ పథకాల ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు గానీ ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం వాటి ఊసేలేదు. గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, రాచర్ల, అర్థవీడు, బేస్తవారపేట, కొమరోలు మండలాల్లో ప్రభుత్వ భవనాలన్నీ దాదాపు ఒకేచోట నిర్మించారు.



కంభం ఎంపీడీవో కార్యాలయం

వివిధ పనులపై ప్రజలు ప్రతిరోజు ఆయా కార్యాలయాలకు అర్జీలు అందించేందుకు వస్తుంటారు. కానీ ఏ కార్యాలయం వద్ద కూడా మరుగుదొడ్లు నిర్మించలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మలమూత్ర విసర్జన కోసం కిలోమీటర్లు కొద్ది బయటకు పరుగులు తీస్తున్నారు. ఆరు బయటకు వెళ్లలేని వారు ఇంటికి వెళ్లేంత వరకు ఉగ్గపట్టుకుంటున్నారు. మహిళల పరిస్థితి వర్ణణాతీతం. కంభం మండల కార్యాలయ సముదాయంలో 13 భవనాలు ఒకే ప్రాంగణంలో ఉండగా మరుగుదొడ్ల సమస్య అధికారులు దృష్టి సారించలేదు. ఎంపీడీవో, తహసీల్దార్, ఉపఖజానా కార్యాలయాల్లో మరుగుదొడ్లు ఉండగా అవి కేవలం అధికారులు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల పరిధిలో మరుగుదొడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయంలో గంటలు చోరీ

పుల్లలచెరువు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పుల్లలచెరువు చౌటపల్లి ఆంజనేయస్వామి దేవస్థానంలో గంటలు చోరీకి గురైయ్యాయి. శనివారం ఆలయ పూజారి ఉమామహేశ్వరశర్మ గుడి తలుపులు తేరిచి చూడగా గుడిలో వున్న ఒక పెద్ద గంట, సుమారు 30 చిన్న గంటలు చోరీకి గురైయ్యాయని అన్నారు. చోరీ చేసిన సోత్తు విలువ రూ.30 వేలు ఉంటుందని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

చిరు వ్యాపారుల ధర్నా

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు చిరు వ్యాపారులు శనివారం ధర్నా నిర్వహించారు. కంభం రోడ్డులోని బంకులు ఏర్పాటు చేసుకుని నివశించే చిరువ్యాపారులు ఈ ధర్నా నిర్వహించి మాట్లాడుతూ తాము దాదాపు 30 ఏళ్ల నుంచి బంకులు ఏర్పాటు చేసుకుని వివిధ వ్యాపారాలతో తమ జీవనం కొనసాగిస్తున్నామని, వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారని, తాము జీవన ఆధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బంకులు తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు.



నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

దేవాలయానికి దారేది?

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొండమీద వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మెట్ల రహదారి బాగానే ఉన్నప్పటికీ రాజానగర్ నుంచి కొండమీదుగా దేవాలయం వరకు మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మించారు. ఈ రహదారి నుంచి మోటార్ సైకిళ్లు, కార్లు, జీపులు వెళ్లే అవకాశం ఉంటుంది. మెటల్ రహదారి అయినప్పటికీ మెట్లు ఎక్కలేని భక్తులు బైకులపై, ఇతర వాహనాలపై కొండపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే ఈ మెటల్ రోడ్డులో కొంతభాగం బాగానే ఉన్నప్పటికీ మరికొంత భాగం కంపచెట్లు, పిచ్చిచెట్లతో నిండిపోయింది. దీంతో భక్తులు ఈ రహదారి నుంచి పైకి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. దేవస్థాన అధికారులు గాని, మున్సిపల్ అధికారులు గాని కొండదారిలో ఇరువైపులా చొచ్చుకువచ్చిన చిల్లచెట్లను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



దేవాలయానికి వెళ్లే దారిలో పెరిగిన చిల్లచెట్లు

ఖైదీలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

• జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విచారణ ఖైదీలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. శనివారం పట్టణంలోని సబ్‌జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. అనంతరం సబ్ జైలులోని స్టోర్ రూములను పరిశీలించారు. నాణ్యమైన దిన్సులు వినియోగించాలన్నారు. విచారణ ఖైదీలకు అందుతున్న వసతుల గురించి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసుల వివరాలను తెలుసుకొని క్షణికావేశంలో నేరాలకు పాల్పడవద్దని సూచించారు. లాయర్‌ను పెట్టుకునే స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మేరీసారాదానమ్మ, జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ లాయర్లు రవిప్రకాశ్‌బాబు, పిచ్చయ్యయాదవ్, ఫాజిల్, న్యాయవాదులు జనార్ధన్, రైడర్‌బాబు, పారా లీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆహారాన్ని నాణ్యతగా రుచికరంగా సరియైన సమయంలో అందించాలన్నారు. విద్యార్థులకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100 గురించి వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవాలన్నారు. తద్వారా సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణ్‌రెడ్డి, అనురాధ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఖైదీలు సత్ప్రవర్తతో నడుచుకోవాలి

మార్కాపురం : ఖైదీలు సత్ప్రవర్తతో నడుచుకోవాలని జిల్లా న్యాయాధికారి ఎ.భారతి అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా ఆమె ఖైదీలతో మాట్లాడారు. న్యాయవాదులను పెట్టుకోలేని వారు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తప్పక ఏర్పాటు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా జైలు ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. వారికి అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఆమె వెంట మార్కాపురం అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం.బాలాజీ, న్యాయవాది పైడిమర్రి రామచంద్రలు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరుకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేసింది. మండలంలోని ముండ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 22 మందికి, కే.ఎస్.పల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురికి శనివారం స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎస్.ఖాశీంవలి, ముండ్లపాడు హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరప తోటల నుంచి నీటిని బయటకు పంపాలి

• ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న మిరప తోటల నుంచి తక్షణమే నీటిని బయటకు పంపించాలని, ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ సూచించారు. రాచర్ల మండలం రామాపురంలో సాగులో ఉన్న మిరప తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్లపై మట్టిని వేయాలన్నారు. తేమ ఆరే వరకు, పోషకాలను తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. కొమ్మ ఎండు తెగులు, పూత రాలకుండా ఉండేందుకు వీలుగా పురుగు మందులను పిచికారి చేయాలని సూచించారు. అలాగే అరటి, బొప్పాయి తోటల్లో కూడా నీరు నిలువ ఉండకుండా చూసుకుని చెట్లు వాలిపోకుండా ఊతం అందజేయాలన్నారు.



మిరప తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

తర్లుపాడు : వారం రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవటంతో పొగాకు, మిర్చి పంటలు బాగా దెబ్బతిన్నాయి. మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు, చెన్నారెడ్డిపల్లి, గొల్లపల్లెలలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను మార్కాపురం ఏడీఏ బాలాజీ నాయక్, వ్యవసాయాధికారులు పరిశీలించారు. దెబ్బతిన్న పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మొదళ్ల వద్ద యూరియా చల్లాలన్నారు. వ్యవసాయాధికారులు టి.వెంకటేశ్వర్లు, వీఏఏలు పూర్ణశంకర్, సావిత్రి, గోవింద్ బాషా, రైతులు ఉన్నారు.

విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాయితీపై శనగ విత్తనాలు కావాలనుకొనే రైతులు రైతుసేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని రాచర్ల మండల వ్యవసాయా ధికారి అబ్దుల్‌రఫిక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరాకు 40 కిలోల చొప్పున 5 ఎకరాల వరకు జెజీ-11 శనగ విత్తనాలను 25 శాతం రాయితీపై పొందవచ్చని, రైతు సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహూకరణ

పొదిలి, అక్టోబరు 19 : స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు లాలఫౌండేషన్, ఆల్‌మొమిన్ బీఈడీ కళాశాల ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో యలమందారెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ప్రతిఒక్కరు ప్రోత్సహించడం వలన మంచి చదువులు చదివే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులపట్ల ఉపాధ్యాయులు స్నేహభావంతో ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థుల్లో మంచి అలవాట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో వివేకానంద కళాశాల కరస్పాండెంట్ కేవీ.రమణారెడ్డి, డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ కుమార్, లాల్‌ఫౌండేషన్ ఆలీహజీర్, బండి అశోక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు

పాఠశాల రహదారిని బాగుచేయరూ!

పొదిలి, అక్టోబరు 19 : పట్టణంలోని విశ్వనాథపురం కోర్టు సమీపంలోని పాఠశాలకు వెళ్లే రహదారి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పాఠశాలను గత 60 సంవత్సరాల క్రితం నిర్మించారని ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డి తెలిపారు. ఈ పాఠశాల నుండి ఎంతో మంది విద్యాభ్యాసం చేశారని ఉన్నతమైన పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలకు వెళ్లే రహదారి గుంతలతో నిండిందన్నారు. పాఠశాలకు వెళ్లే రోడ్డును కూడా ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డి కోరుతున్నారు.

జాతీయస్థాయి క్రీడాపోటీలకు గొట్లగట్టు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కొనకనమిట్ల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి క్రీడాపోటీలకు గొట్లగట్టు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యయురాలు ఎం.విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఇటీవల కాలంలో కర్నూల్ జిల్లాలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో లక్ష్మికల్పన, మహేశ్వరి, చంద్రలిఖిత, గురులక్ష్మి, జస్సీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ క్రీడలలో రాజారపు లక్ష్మికల్పన జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. బీహార్ రాష్ట్రంలో డిసెంబరు నెల 25- 30వ తేదీ వరకు జరిగే పోటీలలో పాల్గొనేందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. విద్యార్థినులకు తర్ఫీదు నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బాల గురవయ్యను విద్యార్థినులను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

మునగాకుతో రక్తహీనత నివారణ

పామూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు మునగాను ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో శనివారం మునగాకు ప్రాధాన్యతపై అవగాన కల్పించారు. మునగాకు ఉపయోగించి పదార్థాలు తయారుచేయడం గురించి వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఎస్.ప్రత్యూష, మంగమ్మ, పి.రమణమ్మ, వి. కుమారి, కె.అరుణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

పామూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండాపురం వద్ద నిమ్జ్ భూముల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకోసం ప్రభుత్వం ఆదేశాలతో విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసింది. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి అందులోని రాగి తీగతో పాటు విలువైన పరికరాలు అపహరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పీసీపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ షారూఖ్ అన్నారు. మండలంలోని చినవరిమడుగు, పీసీపల్లి రైతుసేవాకేంద్రాల పరిధిలో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కంది, ఇతర పైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కంది పంటలో ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మనోహర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న 'గుండ్లకమ్మ'

కురిచేడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. కురిచేడు మండలం పక్కనే గుండ్లకమ్మ నది ప్రవహిస్తున్నది. ముష్టగంగవరం గ్రామం వద్ద రైతు వారధి, జగన్నాథపురం వద్ద గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి అందుబాటులో ఉంది. ఆవులమంద, కల్లూరు కురిచేడు గ్రామాల వారు గుండ్లకమ్మ నది దాటుకుంటూ త్రిపురాంతకం వెళ్లాల్సి వస్తుంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ నదికి నీరు రాలేదు. అయితే, గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నదికి నీరు వచ్చింది. గుండ్లకమ్మకు నీరు రావడంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

కాగా, కురిచేడులో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంట చేలల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. పత్తి, పొగాకు పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నది



పొగాకు చేలో నిల్చిన వర్షపు నీరు

వర్షార్పణం

- కురిచేడు మండలంలో దెబ్బతిన్న పంటలు
- రూ.5 కోట్లకు పైగా నష్టపోయిన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కురిచేడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కురిచేడు మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. ఈసంవత్సరం సకాలంలో వర్షాలు కురవడంతో పత్తి, మిర్చి, పొగాకు సాగు చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో కురిసిన తేలికపాటి వర్షాలు తమకు మేలు చేకూర్చాయని రైతులు సంతోషించారు. ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు పంటలకు ముంచాయి. రూ.5 కోట్లకు పైగా రైతులు నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మండలంలోని దేకనకొండ, పెద్దవరం, నమశ్శివాయపురంలలో పత్తి సాగుచేస్తున్నారు. ప్రభుత్వ ఈక్రాప్ లెక్కల ప్రకారం ఈ మూడు గ్రామాలలో 1260 ఎకరాలలో పత్తి సాగుచేస్తున్నారు. మరో 200 ఎకరాలు ఉండే అవకాశం ఉంది. అలాగే మండలం మొత్తమీద పొగాకు, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. ఈక్రాప్ లెక్కల ప్రకారం పొగాకు 1820 ఎకరాలలో ఉండగా అదనంగా 3 వేల ఎకరాలు సాగులో ఉండే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. మిర్చి 2080 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు. భారీ వర్షాలకు చేలల్లో నీరు నిలబడటంతో పంటలు దెబ్బతిన్నాయి. పొగాకు ఆకులలో జిడ్డు కారిపోవడమే కాక ఎర్రగా మారాయి. పత్తి కాయలు నల్లగా మారాయి. మిర్చి చేలల్లో నీరు నిలబడటంతో మొక్కలు కుళ్ళిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



నల్లగా మారిన పత్తి కాయ

మండలంలో సుమారు 1500 ఎకరాలలో పత్తి సాగుచేస్తుండగా, మొదటి కోత వర్షార్పణం అయింది. దీంతో రూ.కోటిన్నరకు పైగా రైతులు నష్టపోయారు. ప్రస్తుతం క్వింటా పత్తి రూ.6 వేలు పలుకుతుండగా, ఎకరాకు 3 క్వింటాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా, ఎకరాకు రూ.18 వేలు నష్టపోతున్నారు. మొత్తంమీద రూ.కోటిన్నరకు పైగా పత్తి రైతులు నష్టపోతున్నారు. పొగాకు సాగు చేస్తున్న రైతులూ తీవ్రంగా నష్టపోతున్నారు. పొగాకు ఆకులపై మడ్డి కారిపోవంతో దిగుబడి నాసిరకంగా వస్తుంది. ఆకులు వడలి పోతుండటంతో రాలిపోయి దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం క్వింటా పొగాకు ధర రూ.16 వేల వరకు ఉంది. మొదటి దశలో రైతులకు ఎకరాలకు 2 నుంచి 3 క్వింటాలు దిగుబడి వస్తుంది. సుమారు ఐదు వేల ఎకరాల్లో రూ.3 కోట్లకు పైగా రైతులు నష్టపోతున్నారు. మిర్చి పంటలో వర్షపు నీరు నిలబడటంతో మొక్కలు కుళ్ళిపోతున్నాయి. ఈ పంట ప్రస్తుతం మొక్క దశలోనే ఉన్నందున దిగుబడి కంటే పెట్టిన పెట్టుబడే రూ.50 లక్షలకుపైగా ఉంది. మొత్తం మీద రైతులు ఈ మూడు పంటల మీదనే రూ.5 కోట్లకు పైగా నష్టపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారుల నిర్మాణాలు అభివృద్ధికి పునాదులు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామాల్లోని అంతర్గత రహదారులను నిర్మించిననాడే అభివృద్ధి పునాదులు ఏర్పడతాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పల్లె పండుగ వారోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పామూరు పట్టణానికి రూ.5 కోట్ల ఉపాధి నిధులు కేటాయించినట్టు చెప్పారు. ఇందులోభాగంగా విరాట్ నగర్‌లో రూ.50 లక్షలతో నిర్మించేబోయే ఆరు రోడ్లకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో రూ.15 కోట్ల ఉపాధి నిధులతో జరిగే సీసీ రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసిన మండలానికి అదనంగా మరో రూ.కోటి మంజూరు చేస్తామని చెప్పారు. ఈసందర్భంగా రోడ్లతో పాటు మురుగు కాలువలు నిర్మించాలని స్థానిక మహిళలు ఉగ్రను కోరారు. విరువూరు అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వీటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని టీడీపీ నాయకులు షేక్ గౌస్‌బాషా, కావేరి రసూల్ స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని పంచాయతి కార్యదర్శి అరవిందకు సూచించారు.



సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉగ్ర

కార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేష్, ఏఈ మస్తాన్‌వలి, ఏపీవో బి.మాల్యాద్రి, ఎంపీటీసీలు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, టీడీపీ నాయకులు కె.సుభాషిణి, సయ్యద్ అమీర్‌బాబు, ఆర్‌ఆర్ రఫి, షేక్ ఖాజారహంతుల్లా, డీవీ మనోహర్, జనసేన నాయకులు వై.రహీముల్లా, సందాని బాషా, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో భారీ వర్షం

దర్శి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో శనివారం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని ప్రధాన కూడలిలో కుంటలా నీరు చేరటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దర్శి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారటంతో వర్షం పడిన ప్రతిసారి నీరు రోడ్లపైకి చేరుతుంది. కాలువల్లోని మురుగనీరు వర్షపు నీటితో కలిసి రోడ్లపై ప్రవహిస్తుండటంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ప్రజలు రోడ్లపై నడిచే వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గడియారం స్తంభం సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- పలు గామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ

ముండ్లమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శంకరాపురం, నూజెండ్లపల్లి, మారెళ్ళ, జమ్ములమడక, పూరిమెట్ల గ్రామాల్లో ఉపాధి హామి పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 120 రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొనేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ప్రస్తుతం నిర్మిస్తున్న సీసీ రోడ్లు, మురుగు కాలువలను జనవరిలోగా పూర్తిచేసి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన పేద ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించటం జరుగుతుందన్నారు. మండలంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. మారెళ్ళ సమీపంలో ఈదర వాగుపై ఉన్న నేల చప్టాను ఆమె పరిశీలించారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరుచేసి బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. శంకరాపురంలో రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లను అందజేశారు.



శంకరాపురంలో స్ప్రేయర్లను అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి

కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఏపీవో కె.నాగరాజు, ఏపీఎం హనుమంతరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుంకర రాఘవరెడ్డి, ఎంపీటీసీలు పాలపర్తి సుబ్బారావు, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

- జిల్లా విజిలెన్స్ అధికారి హైమావతి

కనిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని జిల్లా విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి అన్నారు. విద్యుత్ అదనపు లోడ్ వినియోగంపై కనిగిరి ప్రాంతంలో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పట్టణ సమీపంలోని కొత్తూరు వద్ద సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో దాదాపు 45 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అపరాధ రుసుం కింద రూ.లక్షా 92 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

కనిగిరి నియోజకవర్గంలో దాదాపు 25 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినట్లు హైమావతి తెలిపారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న వినియోగదారుడిపై రూ 600 జరిమానా విధించినట్లు చెప్పారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలంటే ప్రతిఒక్కరూ బాధ్యతగా విద్యుత్ చౌర్యం చేసే వారి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ జిల్లా విద్యుత్ అధికారి హైమావతి

సమావేశంలో డీఈఈ వీరయ్య, ఏడీఈ ఆర్ ఉమా కాంత్, డీఈ వీ కృష్ణారెడ్డి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

భైరవకోన అభివృద్ధికి కృషి



భైరవకోన జలపాతం వద్ద డాక్టర్ ఉగ్ర తదితరులు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. భైరవకోనలోని త్రిముఖ దుర్గాంబమాత క్షేత్రాన్ని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, కల్నల్ జయరావుతో కలిసి శనివారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కనువిందు చేస్తున్న జలపాతాన్ని పరిశీలించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ పర్యాటక రంగానికి కావలసిన వనరులు భైరవకోనకు ఉన్నాయన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయిస్తే ఈ ప్రాంతం వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

దర్శి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగినట్లయితే శిక్షాకాలం తగ్గించే అవకాశం ఉంటుందని జిల్లా న్యాయాధికారి ఏ.భారతీ దేవి అన్నారు. స్థానిక సబ్ జైలును శనివారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. వసతులు, మెనూ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట దర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.శివశంకర్‌రెడ్డి, జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రత్యూష తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక బీసీ హాస్టల్‌లో భోజనశాలను పరిశీలించారు.

పంచాయతీరాజ్ డీఈ ఆదిశేషు మృతి బాధాకరం

దర్శి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీరాజ్ డీఈ ఆదిశేషు మృతి బాధాకరమని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తెలిపారు. గుంటూరులోని ఆయన స్వగృహంలో మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సన్నబియ్యం భోజనం పెట్టించండి సారూ..!

- న్యాయాధికారికి విద్యార్థినుల విన్నపాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయాధికారి భరత్‌చంద్ర

కనిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ సన్నబియ్యం అన్నం పెట్టించండి సారూ.. అంటూ బాలికల హైస్కూల్ విద్యార్థినులు కనిగిరి జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్రకు విన్నవించుకున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం, కూరలు పెడుతున్నారా అని విద్యార్థినులను ప్రశ్నించగా, సన్నబియ్యం అన్నం పెట్టించండి సార్ అంటూ వేడుకున్నారు. ఇకనుంచి విద్యార్థినులకు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనాన్ని వడ్డించాలని నిర్వాహకులకు చెప్పారు. మరోసారి తనిఖీ చేస్తానని చెప్పారు. బోధన గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

భావితరానికి దిక్సూచిగా మా రాలన్నారు. మంచి నడవడికతో విద్య నేర్చుకుంటే ఉన్నతస్థాయికి చేరుకుంటారని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఎవరైనా విద్యార్థినుల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ప్రధానోపాధ్యాయురాలు దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్కూల్ రికార్డులను, హాజరు శాతాన్ని పరిశీలించారు. స్కూలు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచటం పట్ల హెచ్‌ఎం కలవ విజయలక్ష్మి, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం తాగునీరు, వంటగది, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినుల టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట న్యాయసేవాధికార సంస్థ, గుడ్‌హెల్ప్ సంస్థ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దొనకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు సహాయం కోసం వెళ్ళి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన మండలంలోని చందవరం గ్రామ పొలాల్లో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కె.విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తేలిక నాగార్జున(26) అదే గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. విద్యుత్ విషయంలో కొద్దిగా పరిజ్ఞానం ఉండటంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ ఎడ్జ్ ఫీజు వేయాలని అడిగారు. నాగార్జున ఫీజు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అల్లారు ముద్దుగా చూసుకునే తండ్రి చనిపోవడంతో కుమార్తెలు శోకసంద్రంలో మునిగిపోయారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కె. విజయకుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేస్తామన్నారు. ఏఈ షేక్ నాగూర్ వలిని వివరణ కోరగా నష్ట పరిహారం వచ్చేవిధంగా ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దొనకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ నడి బజారులో శనివారం లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ పాలెంకు చెందిన చీరాల సంతమ్మ(55) అనారోగ్యంతో ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు వెళ్ళి చూపించుకుని తిరిగి ఇంటికి వస్తుంది. ఈక్రమంలో మాచర్ల నుంచి దొనకొండకు వెళుతున్న లారీ ఢీకొనడంతో మృతిచెందింది.

సదరు లారీ డ్రైవర్ గ్రామంలోని నడి వీధిలోనుంచి మార్కాపురం వెళ్ళడానికి ఒక దారి, దొనకొండకు వెళ్ళడానికి మరో దారి ఉండటంతో ఎటూ వెళ్లాలో అర్థంకాలేదు. దీంతో లారీని నిలిపి స్థానికులతో మాట్లాడుతున్నాడు. ఈలోపు సంతమ్మ రోడ్డు దాటుతుండగా, సంతమ్మను చూడక లారీని కదిలించాడు. ఆమె టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే గ్రామస్థులు ఆమెను మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్‌ఐ కె.విజయకుమార్ సిబ్బందితో కొచ్చెర్లకోట గ్రామానికి వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏడీఏగా కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

పామూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పామూరు విద్యుత్‌శాఖ ఏడీఏగా కృష్ణారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా చీమకుర్తి నుంచి పామూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడీఏగా పనిచేసిన టి.శ్రీకాంత్ ఒంగోలు రూరల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణారెడ్డిని పామూరు ఏఈ షేక్ జిలానిబాషా, లైన్‌మెన్‌లు కాలేషా, ఖాజావలి, ఎల్‌డీసీ పి.నాగరాజు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



అమరావతికి మళ్లీ అంకురార్పణ

- రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా పూజలతో రాయపూడి వద్ద పనుల ప్రారంభం
- రైతుల హర్షధ్వానాల మధ్య సీఎం చంద్రబాబు భూమిపూజ
- మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బాటలు వేసింది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులను అధికారంలోకి వచ్చిన ఐదో నెలలోనే తిరిగి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం అడివిలా మార్చిన రాజధాని ప్రాంతంలో తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు రాజధాని అంతటా పర్యటించారు. నిలిచిపోయిన పనులను పరిశీలించి వాటిని ఎలా తిరిగి పట్టాలెక్కించాలనే దానిపై అవగాహనకు వచ్చారు. మరోవైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ అమరావతిలో పర్యటించి పనుల పునః ప్రారంభానికి బాటలు వేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటి నుంచి అమరావతి పనులు ప్రారంభిస్తారని రాజధాని ప్రాంత ప్రజలే కాకుండా రాష్ట్రమంతటా ఎదురు చూస్తున్న క్రమంలో శనివారం సీఎం చంద్రబాబునాయుడు అమరావతి పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. ప్రజల హర్షధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా పూజలతో రాజధాని పనులను ప్రారంభించారు. రాయపూడి వద్ద జీ ప్లస్ 7 విధానంలో నిర్మించతలపెట్టిన సీఆర్డీయే కార్యాలయం నిర్మాణం గత ప్రభుత్వంలో నిలిచిపోగా దాని నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు పునః ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. అమరావతిలో రూ.160 కోట్లతో జీ ప్లస్ 7 భవనం నిర్మిస్తున్నామని దీనిని 121వ రోజున ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రానికి అమరావతి ఒక్కటే రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానన్నారు. రైతులకు కౌలు పెండింగ్ నిధులు 170 కోట్లు ఇచ్చామని, రూ.225 కోట్లు త్వరలో ఇస్తామన్నారు.


రాజధాని పనులకు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు


రాజధాని మ్యాప్‌ను సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

విధ్వంసం పోయి.. నిర్మాణం ప్రారంభం

1631 రోజులు పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారని చంద్రబాబు తెలిపారు. విధ్వంసం పోయింది.. నిర్మాణం ప్రారంభమైందన్నారు. గత పాలకుల విధ్వంసంతో నిలిచిన పనుల వల్ల రూ.7 వేల కోట్లు అదనంగా భారం పడుతోందన్నారు. రూ.52 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామని, కేంద్రం రూ.15 వేల కోట్లు అందించేందుకు ముందుకొచ్చిందన్నారు. 8,603 కి.మీ సీఆర్డీయే, 217 చ.కిమీ పరిధిలో రాజధాని, 16.9 చ.కి పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుందన్నారు. అమరావతిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి కావాలని సీఆర్డీఏ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అడిషనల్ కమిషనర్ జీవీఎస్ ప్రవీణ్‌చంద్, ఎస్పీ సతీష్‌కుమార్, రైతు నాయకులు పువ్వాడ సుధాకరరావు జొజాల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవిలా రాజధాని మహిళలు

అమరావతికి మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేశామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం కోసం రైతులు భూములు ఇస్తే గడిచిన ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. రాజధాని ఉద్యమ సమయంలో ఇక్కడి మహిళలు రాణీరుద్రమ దేవిలా పోరాడారన్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం కార్యక్రమం చేపడితే అన్నం తిననివ్వకుండా అడగడుగునా వేధించారన్నారు. ఈ పవిత్రమైన పుణ్యభూమిని మహిళ శక్తి కాపాడిందని తెలిపారు. ఎంతమంది రాక్షసులు వచ్చినా అమరావతిని కాపాడిన చరిత్ర రైతులదేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిపై విష ప్రచారం చేసిందన్నారు. ముంపు ఎడారి అన్న జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్ మునిగిందన్నారు. దేవుడు స్క్రిప్ట్ అంటే ఇదేనని చంద్రబాబు తెలిపారు.

మా భూముల్లో

ఇసుక మాకే

- కొల్లూరు ట్రాక్టర్లను అడ్డుకున్న పెసర్లంకవాసులు
- లాకు సెంటర్‌లో కొల్లూరు ఎస్సీకాలనీవాసుల ఆందోళన
- ఎస్ఐ ఏడుకొండలు జోక్యంతో సద్దు మణిగిన వివాదం

కొల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మా పట్టాభూముల్లోని ఇసుక మాకే సొంతం.. ఇతరులను రానివ్వం.. అని కొల్లూరు ఎస్సీ కాలనీవాసులకు చెందిన ఇసుక ట్రాక్టర్లను శనివారం పెసర్లంకలో స్థానికులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కొల్లూరు ఎస్సీ కాలనీవాసులు లాకు సెంటరుకు చేరుకుని పెసర్లంక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎస్ఐ ఏడుకొండలు ఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చించారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక తీసుకు వెళ్లమని చెప్పినా పెసర్లంకవాసులు తమను అడ్డుకుని, దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పైగా దేవాలయాలకు నిధులు సమకూర్చు పేరుతో ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.500 వసూలు చేశారని ఆరోపించారు. నగదు వసూలు చేసిన వ్యక్తి ఎవరిని ఆరా తీయగా ఆ గ్రామానికి చెందిన సాతా ప్రసాద్ అని చెప్పడంతో అక్కడే ఉన్న అతడ్ని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ స్టేషన్‌కు తరలించారు. వివాదాలు లేకుండా ఇసుక రవాణా చేసుకోవాలని చెప్పి వివాదాన్ని పరిష్కరించారు.


కొల్లూరు లాకు సెంటర్‌లో ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా అడ్డుకోవడంతో స్తంభించిన ట్రాఫిక్

నదిలోకి వెళ్లకుండా గండ్లు ఏర్పాటు

పెసర్లంక అరవింద వారధి వద్ద నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గ్రామస్తులు గండ్లు ఏర్పాటు చేశారు. తమ పట్టా భూముల్లో ఇతరులు ఇసుక తరలించకుండా ఉండేందుకు గండ్లు ఏర్పాటు చేశామని, తాము కూడా ఇకపై ఇసుక రవాణా చేయమని ఎస్ఐకు తెలిపారు. మండల పరిధిలోని చిలుమూరు, జువ్వలపాలెం కాకులడొంక వద్ద ఇసుక రవాణాను నిలువరించేందుకు ఆయా గ్రామాలకు చెందిన రైతులు గండ్లు ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తుంది.

తగ్గిన ధరలు

ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకు వెళ్లవచ్చన్న ప్రభుత్వ ప్రకటనతో ఇసుక ధరలు తగ్గాయి. గాజుల్లంక, పెసర్లంక, ఈపూరు, చిలుమూరు, ఈపూరులంక, జువ్వలపాలెం తదితర నదీ పరివాహక గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరిగింది. దీంతో నిన్న మొన్నటి వరకు ట్రాక్టర్ ఇసుక దూరబారాన్ని బట్టి రూ.8 వేలు పలకగా, శనివారం ఆ ధర సగానికి తగ్గిపోయింది. చెరుకుపల్లి, తెనాలి, ప్రాంతాల్లో ఇసుక రూ.3 వేలు నుంచి రూ.4500లకు సరఫరా చేశారు.

లా సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

పెదకాకాని(ఏఎన్‌యూ), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయ శాస్త్ర కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ లా సెట్-2024 సంబంధించి ప్రవేశాలలో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం పూర్తయింది. ఆన్‌లైన్ ఆన్లైన్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. బ్రహ్మాజీ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎన్ సీ సీ అభ్యర్థులు 126 మంది, సీఏపీ అభ్యర్థులు 12 మంది, పీహెచ్ అభ్యర్థులు 37 మంది, స్పోర్ట్స్ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారని తెలి పారు. సర్టిఫికెట్ల పరిశీలనను ఏపీ లా సెట్ 2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్యనారాయణ పర్యవేక్షించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ తమిళనాడు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యునివర్సిటీ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తమిళనాడు రాష్ట్రం ఓవర్ ఆల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అలాగే బాలుర విభాగంలోనూ, బాలికల విభాగం లోనూ తమిళనాడు రాష్ట్రం అత్యధిక పాయింట్లు సాధించి రికార్డు సృష్టించారు. మూడు కేటగిరిలో తమిళనాడు మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. విజేతలకు పోటీల నిర్వాహక కార్యదర్శి ఎ. గౌతమ్ కిరణ్, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా ఈసీ మెంబర్ ఏ హైమావతి, జాయింట్ సెక్రటరీ ఏ.వీ. రాఘవేంద్రరావు, తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. సారంగపాణి, మాజీ ఇంటర్నేషనల్ అథ్లెట్ శ్రీనివాస్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ అఫీషియల్ శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ ఎం. నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. మధుసూదన్‌రావు తదిత రులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను తమిళనాడు మహిళా జట్టుకు అందజేస్తున్న నిర్వాహకులు

అర్హులందరికీ సంక్షేమం అందాలి

- పారదర్శకంగా కేంద్ర పథకాలను అమలు చేయాలి
- దిశ కమిటీ చైర్మన్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ నిధులతో అమలయ్యే సంక్షేమపథకాల ఫలాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం(దిశ) జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఎంపీ పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. కేంద్రప్రభుత్వం ఖర్చుపెడుతున్న ప్రతి పైసా నిరుపేదలకు చేరాలని చెప్పారు. అత్యంత పారదర్శకంగా పథకాలను అమలు చేయాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబాటులో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరాలన్నారు. ప్రతిఒక్కరికి విద్య, యువతలో నైపుణ్యాలు అభివృద్ధి, సూక్ష్మ,చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేలా ఔత్సాహికుల ప్రోత్సాహంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రాథమిక వైద్యం ప్రతిఒక్కరికి అందాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు ఉపాధి చూపించాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదరికం నుంచి ప్రజలు విముక్తి పొందేలా అధికారులు పనిచేయాలన్నారు. అర్హులైన ఎస్టీలందరికీ జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ వేదికపై కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

అసహనం.. ఆగ్రహం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన గృహాల సమగ్ర వివరాలు లేకపోవడంపై అధికారులపై ఎంపీ తెన్నేటి అసహనం వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ కింద రూ.578 కోట్లు మంజూరు కాగా 40 శాతానికి మించి పనులు చేయకపోవటం ఏమిటని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. పనులు చేసినా నిధులు విడుదల కాలేదని అధికారులు సమాధానం చెప్పగా తక్షణమే నివేదిక ఇవ్వాలని ఎంపీ సూచించారు. బాపట్లలో ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు వినియోగంపై విజిలెన్స్ విచారణ చేయిస్తామన్నారు. ముద్రరుణాలు పంపిణీ లక్ష్యాలు చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిర ఆస్తులు సమకూర్చడమే లక్ష్యంగా ఉపాధి నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పల్లెవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 19 మండలాలలో 19 వేల ఇంకుడు గుంతలు తీయాలని లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో సమగ్ర విచారణ చేసి అర్హులకు మాత్రమే పింఛన్ అందించాలని అనర్హులను తొలగించాలన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, జ్యోతిబసు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ కేంద్రం ప్రారంభం

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.5 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఎంపీల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయాలన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటంతో వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు.

పేదలపై ఫీజుల పిడుగు

- విద్యా హక్కు చట్టం ప్రవేశాలకు బ్రేక్
- ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా తీర్పు
- ఫీజులు చెల్లించాలని యాజమాన్యాల ఒత్తిడి
- ఆందోళనలో తల్లిదండ్రులు.. స్పష్టత ఇవ్వని విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500పైగా ఆర్టీఈ విద్యార్థులు

గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నచందంగా తయారైంది. ఇప్పటికే విద్యా సంవత్సరం సగం గడిచింది. ఈ సమయంలో ఆర్టీఈ ప్రవేశాలపై ప్రైవేటు విద్యా సంస్థలకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లకు సంబంధించి గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 24ను ఇటీవల హైకోర్టు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయి. న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు వచ్చి రెండు రోజులు కాకముందే ప్రైవేటు యాజమాన్యాలు తమ ఫీజులపై జులుం ప్రదర్శిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలలో విద్యా హక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందిన 1500 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది తెలియడం లేదు. వీరిలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే ఎక్కువగా ఉన్నారు. మరింత ఆందోళన కరమైన విషయం ఏమి టంటే హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు కూడా వీరిలో ఉన్నారు. ఆయా వర్గాలు వేలకువేలు ఫీజులు చెల్లించుకోలేరు. అయినా విద్యాహక్కు చట్టం ప్రకారం ఆయా వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఆ చట్టాన్ని కోర్టు రద్దు చేయడంతో పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాయి. అంతంత ఫీజులు కట్టే స్థితిలో చాలామంది తల్లిదండ్రులు లేరు. ఫీజులు కట్టకపోతే అడ్మిషన్లు రద్దు చేస్తామని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. విద్యా సంవత్సరం సగంలో పిల్లల్ని వేరే పాఠశా లలో చేర్పించే అవకాశం లేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఫీజులపై యాజమా న్యాల ఒత్తిళ్ల.. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆందోళనలో ఉన్నా విద్యా శాఖ మౌనంగా ఉంది. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే విషయంలో విద్యాశాఖ అనేకసార్లు ప్రకటనలు విడుదల చేసింది. ఈ ప్రకారం పలు కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల్ని అధికారులు చేర్పించారు. తాజాగా జీవో రద్దు కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. యాజమా న్యాలు కోరినట్లు ఇప్పటికిప్పుడు వేలాది రూపాయల ఫీజులు చెల్లించాలంటే తమవల్లకాదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్టీ ఈ కింది చేరిన విద్యార్థులకు ఆయా పాఠశాలలను బట్టి రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఫీజులు నిర్దేశించాయి. తొలి విడత దీపావళిలోపు రూ.10 వేలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇప్పటికే తల్లిదండ్రుల్ని వ్యక్తిగతంగా పాఠశాలలకు పిలిచి ఫీజులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం. నాటి వైసీపీ ప్రభుత్వం కనీసం విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష కూడా నిర్వహించకుండా ఈ జీవోను తీసుకువచ్చింది. దీంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇని స్టిట్యూషన్స్ ఫెడరేషన్(యూపీఈఐఎఫ్)గా ఏర్పడి న్యాయస్థానా న్ని ఆశ్రయించారు. తాజాగా న్యాయంస్థానం ప్రైవేటు స్కూల్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఫలితంగా ఆర్టీఈ ద్వారా చేరిన పేద కుటుంబాల పిల్లలపై పిడుగు ప డినట్లు అయింది.



అమరావతి రైలుకు భూసేకరణ

- కార్యకలాపాలకి రైల్వే శాఖ టెండర్ నోటిఫికేషన్
- రూ.76.68 లక్షల పనిని ఏజెన్సీకి కేటాయించేందుకు నిర్ణయం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి నూతన రైలుమార్గాన్ని సాధ్యమైనంత త్వరగా నిర్మించాలని రైల్వే శాఖ భావిస్తున్నది. భూసేకరణ ప్రక్రియని సులభతరం చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా రూ.76 లక్షల 68 వేల 373కి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 29న బిడ్డింగ్ ప్రారంభించి నవంబరు 12న ముగించి ఏజెన్సీని ఖరారు చేయనుంది. ఎర్రుపాలెం - నంబూరు వయా అమరావతి 56.53 కిలోమీటర్ల పొడవునా రైలుమార్గాన్ని రాబోయే మూడు నాలుగేళ్లలోనే పూర్తి చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే భూసేకరణ ఏ గ్రామాల్లో చేపట్టాలనే వివరాలను యంత్రాంగానికి నివేదించింది. సాదారణంగా రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ కాంపిటెంట్ అథారిటీగా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి బాధ్యతలు కేటాయిస్తారు. అయితే అమరావతి నూతన రైలుమార్గం ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యం కలిగినది కావడంతో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏటీ తేజకు కాంపిటెంట్ అథారిటీ బాధ్యతలను ఇటీవలే కేటాయించారు. సర్వే నెంబర్ల వారీగా భూముల సేకరణ కోసం ప్రస్తుతం రికార్డువర్కు జరుగుతున్నది. ఈ ప్రాజెక్టు కోసం ఇటు గుంటూరు, కృష్ణానదికి అవతలి వైపున ఎన్‌టీఆర్ కృష్ణా, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోనూ భూసేకరణ చేయాల్సి ఉన్నది. ఇందుకోసం ఫెసిలిటేషన్ బాధ్యతలను ఒక ఏజెన్సీకి అప్పగిస్తే భూసేకరణ ప్రక్రియ సులభతరంగా రెవెన్యూవర్గాలు పూర్తి చేయగలవన్న అభిప్రాయాన్ని రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. ప్రస్తుతానికి రైల్వే శాఖ సింగిల్ లేన్ మార్గాన్ని నిర్మించనున్నప్పటికీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు వరసల మార్గానికి భూమి ఎంతైతే అవసరం అవుతుందో అంత విస్తీర్ణంలో భూసేకరణ చేపడుతుందని తెలిపాయి.

విజయవాడకు బైపాసు మార్గంగా..

ఎర్రుపాలెం - అమరావతి రాజధాని - నంబూరు రైలుమార్గం విజయవాడ జంక్షన్‌కు బైపాసు లైన్‌గా ఉపయోగపడనుంది. ప్రస్తుతం విజయవాడ జంక్షన్ రద్దీగా మారిన దృష్ట్యా సికింద్రాబాద్, బోపాల్ వైపు నుంచి వచ్చే రైళ్లు ఈ మార్గం మీదగా నంబూరుకు మళ్లించి అక్కడి నుంచి న్యూగుంటూరు మీదగా తెనాలికి చేర్చి ఆ తర్వాత మెయిన్‌లైన్‌లోకి తీసుకెళ్లొచ్చు. మరోవైపు గుంటూరు - నంద్యాల మీదగా ఒకమార్గం రేణిగుంటకు చేర్చవచ్చు.



అక్రమాలకు సహకారం

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో భారీగా నిధులు దుర్వినియోగమ య్యాయి. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతల రుణగోల్‌మాల్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలవెల్లువ, పొదుపు సంఘాలకు రుణాల పేరుతో భారీగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడు, ఆ శాఖ మంత్రి, ఆప్కాబ్, నాబార్డుతో పాటు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విజిలెన్స్ ఏఎస్పీ స్వయంగా ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయానికి వెళ్లి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) ఈద కోటిరెడ్డిని కలిసి విచారణకు అవసరమైన ఫైళ్లను అందజేయాలని కోరినట్లు తెలిసింది. బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ గోపాలకృష్ణను కలిసి విజిలెన్స్ విచారణ విషయాన్ని తెలియజేసి ఆయన అనుమతితో సీఈవో విజిలెన్స్ విచారణకు ఫైళ్లను అందజేసినట్లు తెలిసింది.

నాయకుల సిఫార్సుల మేరకు

పీడీసీసీ బ్యాంకు గతంలో నాబార్డు నిబంధనల ప్రకారం పనిచేసేది. ప్రస్తుతం అది రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం పనిచేస్తుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తాయి. ఆ క్రమంలోనే పీడీసీసీ బ్యాంకు కూడా రుణాలు మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. అయితే బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జీ కమిటీ(పీఐసీ)ల పదవీకాలంలో అప్పటి నాయకుల సిఫార్సుల మేరకు అక్రమంగా రుణాలు మంజూరు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన 2019 నుంచి 2024 వరకు జరిగిన అక్రమాల్లో సుమారు రూ.80కోట్లు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఆ కాలానికి సంబంధించి మంజూరు చేసిన రుణాలన్నింటిపై విచారణ జరిపి అక్రమాలను వెలికితీయాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

11 అంశాల్లో అక్రమాలు

పీడీసీసీ బ్యాంకు వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో 11 అంశాల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొదటగా జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా ఇచ్చిన రుణాలు వాయిదా మీరిన బకాయిలుగా మారాయి. ఈ పథకం కింద పాడి రైతులకు గేదెలు కొనుగోలుకు, వాటి నిర్వహణకు ప్రకాశం కామధేను పథకం పేరుతో రైతులకు కనీసం రూ.30వేల నుంచి లక్షాన్నర వరకు రుణాలు ఇచ్చారు. కొందరికి వారు వారంరోజుల్లో పోసిన పాలను ప్రామాణికంగా తీసుకొని గేదెలకు రుణాలు ఇచ్చారు. అమూల్ డెయిరీకి వీరి ద్వారా పాలు సేకరించేవారు. అయితే ఆచరణలో జగనన్న పాల వెల్లువ పథకం తుస్సుమనడంతో గేదెల కొనుగోలుకు ఇచ్చిన రుణాల వసూలు కాలేదు. ఈ రుణాల మంజూరు, నిధుల విడుదలలో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి.

- ట్రాక్టర్ల కొనుగోలులో బినామీ రుణాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి.
- జాయింట్ లయబులిటీ గ్రూపులు(జేఎల్‌బీ) గ్రూపులకు జగనన్న తోడు రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి.
- ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకొని వారు పనిచేయని కాలానికి కూడా జీతాలు చెల్లించారు
- జాయింట్ లయబిలిటీ గ్రూపులకు ఇతర రుణాలు మంజూరులో అక్రమాలు చోటు చేసుకున్నాయి
- స్వయం సహాయక గ్రూపులు డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరులో భారీగా అవినీతి జరిగింది. అద్దంకి బ్యాంకు శాఖలో ఒక బినామీ స్వయం సహాయక గ్రూపునకు రూ.15లక్షల రుణం మంజూరు చేసి భారీగా అవినీతికి పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో అక్కడి ఉద్యోగిని బ్యాంకు సీఈవో చార్జీషీటు చేశారు. ఒంగోలు నగరంలో కూడా బినామీ గ్రూపులకు రుణాలు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.
- జగనన్న షిప్ ఆంధ్ర పథకం కింద రుణాలు మంజూరులో భారీ కుంభకోణాలు జరిగాయి.
- బ్యాంకులో వ్యక్తిగతంగా గృహ తనఖా రుణాలు మంజూరులో కూడా అక్రమాలు జరిగాయి.
- రైతులకు స్వల్పకాలిక, ధీర్ఘకాలిక రుణాల్లో భారీగా అవినీతి జరిగింది. బినామీలు కొందరికి కూడా ఈ రుణాలు మంజూరు చేశారు. కొన్ని బ్యాంకు శాఖల్లో రుణాలకు సంబంధించి బాండ్లు లేకుండా రుణాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.
- బ్యాంకు ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
- బ్యాంకు శాఖల్లో రీ మోడలింగ్‌లో కూడా పెద్ద కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ అంశాలన్నింటిపై విజిలెన్స్ విచారణలో ఏమి తేలుతుందో వేచిచూడాల్సి ఉంది.

వీడని వాన

ఒంగోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం ముప్పు తప్పినా జిల్లాను వర్షం వీడలేదు. శుక్ర, శనివారాల్లో చాలాచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీవర్షమే పడటంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు భారీవర్షాలు తెరపి ఇచ్చి ఎండలు రావడంతో పంట నష్టాలు వెలుగుచూస్తుండగా మళ్లీ జల్లులు పడుతుండటంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేసమయంలో జిల్లా అంతటా రోడ్లు ఛిద్రంగా మారాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా పారిశుధ్యం అధ్వానంగా మారగా సీజనల్ వ్యాధులు విజృంభించే పరిస్థితి కనిపిస్తోంది. కాగా జిల్లాలో ఈ వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం సాయంత్రం మంత్రి డాక్టర్ స్వామి పలుచోట్ల పరిశీలించారు.

సగటున 15.38 సెం.మీ నమోదు

జిల్లాలో ఈనెల 11 నుంచి తెరపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. తొలుత మూడు రోజులు సాధారణ వర్షాలు పడగా 14 నుంచి 17 వరకు వాయుగుండం ప్రభావంతో కురిశాయి. అలా ఆ వారంరోజుల్లో జిల్లాలో సగటున 15.38 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా సగం మండలాల్లో 20 నుంచి 34 సెం.మీ మేర కురిసింది. గురువారం ఉదయం వాయుగుండం తీరం దాటడంతో ముప్పు తప్పిందని అందరూ భావించారు. అయితే తిరిగి శుక్ర, శనివారాల్లో జిల్లావ్యాప్తంగా జల్లులు పడుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు నుంచి భారీవర్షమే పడింది. శనివారం ఉదయం 8 గంటలకు గడిచిన 24గంటల్లో జిల్లాలో సగటున 9.10 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జరుగుమల్లి మండలంలో 40.60 మి.మీ కురియగా కేకే మిట్లలో 35.60, సింగరాయకొండ, బేస్తవారపేట, గిద్దలూరు, మార్కాపురం, పొదిలి, టంగుటూరు, కంభం, కొమరోలు, పెద్దారవీడు, వెలిగండ్ల తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. అలాగే శనివారం పగటిపూట కూడా చాలాచోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి 11 గంటలలోపు గరిష్ఠంగా సింగరాయకొండలో 46.4 మి.మీ, కురవగా కొత్తపట్నం 28.0, ఒంగోలు 24.4, జరుగుమల్లి 24.0 మి.మీ నమోదైంది.

సజ్జ పంటను పరిశీలించిన మంత్రి

వారం రోజులపాటు కురిసిన వర్షాలు తెరపి ఇచ్చి కాస్తంత ఎండ రావడంతో వర్షాలు వల్ల దెబ్బతిన్న పంట నష్టాలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇటీవల వర్షాలకు 17 మండలాల్లోని 89 గ్రామాల్లో 3,231 మంది రైతులకు చెందిన 3,749 హెక్టార్లలో సజ్జ, జొన్న, మినుము, అలసంద, వరి, పత్తితదితర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే పంటనష్టాలు అంతకు నాలుగు రేట్లు అధికంగా ఉన్నట్లు తెలుస్తుండగా మరింత ఎండ వస్తే వాస్తవ నష్టాలు బయటపడే అవకాశం ఉంది. కాని తిరిగి జల్లులు పడుతుండటంతో అధికంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి డాక్టర్ స్వామి శనివారం పొదిలి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మిలతో కలిసి పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నిమ్జ్ ప్రాంతంలో భారీ పరిశ్రమ

- మాజీ కల్నల్ సారథ్యంలో పరిశీలనకు వచ్చిన బృందం
- అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ఎమ్మెల్యే ఉగ్ర హామీ
- కనిగిరి ప్రాంతవాసుల్లో చిగురిస్తున్న ఆశ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరి నియోజకవర్గంలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టిసారించారు. ముఖ్యంగా నేషనల్ ఇన్వెస్టిమెంట్ అండ్ మ్యాన్‌ఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)కు కేటాయించిన స్థలంలో పరిశ్రమ ఏర్పాటుకు కొందరు ముందుకు రావటం విశేషం. వారికి అవసరమైన అనుమతులు ఇప్పించటంలోను, సౌకర్యాలు కల్పించటంలోను పూర్తి సహకారం ఉంటుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వారికి హామీ ఇవ్వటంతో కనిగిరి నియోజకవర్గ ప్రజల్లో కూడా ఆశలు చిగురిస్తున్నాయి. శనివారం రిటైర్డ్ కల్నల్ జయరావు ఆధ్వర్యంలో వచ్చిన పారిశ్రామికవేత్తల బృందం నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని, కనిగిరి ప్రాంతంలోను పర్యటించింది. పది సంవత్సరాల క్రితం కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం ద్వారా ఆ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఆ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. నియోజకవర్గంలో పామూరు, పీసీపల్లి, కందుకూరు నియోజవకర్గంలోని వలేటివారిపాలెం మండలాల పరిధిలో సుమారు 12వేల ఎకరాల భూమిని నిమ్జ్‌కు



నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జయరావు, ఎమ్మెల్యే డాక్టర్‌ఉగ్ర

కేటాయించేందుకు నిర్ణయించారు. అందులో 2వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. మిగిలిన భూముల్లో ప్రయివేటు వ్యక్తులకు సంబంధించిన భూముల సేకరణకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే గత ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో తదుపరి పనులు వేగంగా జరగలేదు. పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పారిశ్రామికవేత్తలు మళ్లీ రాష్ట్రం వైపు దృష్టిసారించిన విషయం తెలిసిందే. నిమ్జ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పారిశ్రామికవేత్తలను కలవటం ప్రారంభించారు. కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ ద్వారా రిటైర్డ్ కల్నల్ జయరావు బృందం ఈ వైపు దృష్టిసారించింది. డిఫెన్స్‌లో ఉన్నతస్థాయిలో పనిచేసి రిటైర్డ్ అయిన ఆయన ప్రస్తుతం కేంద్రంలో సలహాదారుడుగా ఉన్నారు. దేశంలో ప్రయివేటు సెక్టార్‌లో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సహకరిస్తే ఏర్పాటుచేయాలని వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి చెప్పారు. అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని చంద్రబాబు సూచించటంతో స్థల అన్వేషణ ప్రారంభించారు. ఈ దశలో డాక్టర్ శివరాం ద్వారా వారిని పరిచయం చేసుకున్న డాక్టర్ ఉగ్ర నిమ్జ్ ప్రాంతంలో అనువైన స్థలం ఉందని చెప్పటంతో వారు శనివారం వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆరుగురు సభ్యుల బృందం కనిగిరి నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న భూములతోపాటు నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని కూడా చూపించారు. పామూరు, పీసీపల్లి మండలాలకు మధ్య వలేటివారిపాలెం మండలపరిధి కూడా కలిసొచ్చే ప్రాంతాన్ని వారు ప్రత్యేకంగా పరిశీలించారు. సమీపంలో గ్రామాలు లేకుండా ఉంటే మంచిదని తెలిపారు. డిఫెన్స్ కారిడార్ అంటే కేవలం ఆయుధాల తయారీ పరిశ్రమే కాకుండా ఆయా స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే యూనివర్సిటీ కూడా వస్తుందని రిటైర్డ్ కల్నల్ జయరావు ఈ సందర్భంగా తెలిపారు. పెద్ద స్థాయి హెలికాప్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుదారులు కూడా స్థలం కోసం అన్వేషిస్తున్నారని వారిని కూడా ఇక్కడే పరిశ్రమ ఏర్పాటుకు ప్రోత్సహిస్తామని తెలిపారు. మొత్తం పరిశీలన అనంతరం నీటి సమస్యను వారు ప్రధానంగా ప్రస్తావించగా మోపాడు రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే ఉగ్ర హామీ ఇచ్చి అందుకున్న అవకాశాలు కూడా చూపించారు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిశ్రమ అయితే పూర్తిస్థాయిలో సహకరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అన్ని రకాల అనుమతులను వెంటనే ఇప్పిస్తామని తెలిపారు. అందులోభాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని ప్రభుత్వపరంగా ఇచ్చే సహకారంపై మాట్లాడతామని చెప్పగా వారు అంగీకరించారు. రోజంతా నియోజకవర్గంలోనే పర్యటించిన ఆ బృందం శనివారం కావటంతో ఇటు మాలకొండ, అటు భైరవకోన దేవాలయాల సందర్శన కూడా చేశారు. డాక్టర్ ఉగ్రతో పాటు దివి శివరామ్ వారికి అనేక అంశాలపై వివరణ ఇచ్చారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

- సీఎం మాట్లాడి పంట నష్టపరిహారం ఇస్తాం
- మంత్రి బాలవీరాంజనేయస్వామి

పొదిలి/తాళ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ ఆదుకుంటామని మంత్రి డోలాశ్రీబాల వీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. పొదిలి, తాళ్లూరు మండలాల్లో మంత్రితోపాటు కలెక్టర్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఉన్నారు. తాళ్లూరు మండలం రామభద్రాపురం వద్ద దెబ్బతిన్న జొన్నతోటను, మాధవరం వద్ద దెబ్బతిన్న గుమ్మడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వర్షాలకు జిల్లాలో 17 మండలాలు ప్రభావితమయ్యాయన్నారు. జిల్లాలో రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల మేర పంటలకు నష్టం వాటిలినట్టు జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు చెప్పారు. పొదిలి, మార్కాపురం, కనిగిరి, దర్శి, కొండపి ప్రాంతాల్లో సజ్జ, జొన్న, పొగాకు , అలసంద, ప్రత్తి, మినుము, వరి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈక్రాప్ నమోదు చేయని రైతులకు కూడా పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టామన్నారు. కౌలు చట్టం ద్వారా ప్రతి రైతుని ఆదుకుంటామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 3749 హెక్టార్లలో 3231 మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు తయారుచేశారన్నారు. వాటితో పాటు ఉద్యాన పంటలు 561 హెక్టార్లలో 797 మంది రైతులు వేసిప పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వానికి పంటల నష్టం వివరాలను పంపినట్టు చెప్పారు. మరలా వర్షాలు కురుస్తున్నందున మంత్రి సూచనమేరకు దెబ్బతిన్న పంటల నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాళ్లూరు మండలం రామభద్రాపురంలో సజ్జకంకి గింజలకు మొలిచిన మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి



కొత్తకోట వాగులో ప్రవహిస్తున్న వరదనీరు

ఆగని వాన

- ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తకోట వాగు
- నిలిచిన రాకపోకలు

నాగులుప్పలపాడు అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి మండలంలో మళ్లీ కుండపోత వర్షం కురవడంతో అంతా జలమయంగా మారింది. చదలవాడ రామన్న చెరువుకు ఇటీవల గండిపడిన ప్రాంతం వద్ద నుంచి 216 జాతీయ రహదారి పైకి వరదనీరు చేరింది. కొత్తకోట వాగులో సైతం వరదనీరు చేరడంతో నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ముప్పాళ్ల, ఈదుమూడి, మాచవరం, ఉప్పుగుండూరు గ్రామాల్లోని పొలాల్లో మరింత వరద నీరు చేరి కనుచూపు మేర అంతా జలమయంగా మారింది. మరో రెండు రోజుల తర్వాత మరో అల్పపీడనం ఏర్పడవచ్చన్న వాతావరణశాఖ సూచనలతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఈనెల 21,22వ తేదీల్లో కేంద్ర ఆరోగ్య బృందం తనిఖీలు చేస్తుందని, అందువల్ల అన్ని రికార్డులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో శనివారం ప్రోగ్రామ్ అధికారుల సమావేశంలో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. జిల్లాలో అధికవర్షాలు కురుస్తున్నందున నీటికాలుష్యం వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది నిర్దేశించిన గ్రామాలు, పట్టణాల్లో విధిగా నివాసం ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంశాలవారీగా దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైద్య అధికారులు పద్మజ, వాణిశ్రీ, భగీరథి, నోడల్ అధికారి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 9.1 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి మంచి వర్షం కురిసింది. శనివారం ఉదయానికి 19.1 మి.మీ వర్షపాతం నమోదైంది. జరుగుమల్లి మండలంలో 40.6, కొనకనమిట్ల 35.6, సింగరాయకొండ 29.8, బేస్తవారపేట27.8, గిద్దలూరు 25.6, మార్కాపురం 22.2, పొదిలి 17.4, టంగుటూరు 16.4, కంభం 14.8, కొమరోలు 13.4, పెద్దారవీడు 12.4, వెలిగండ్లలో 11.4 మి.మీ వర్షం కురవగా మరో పది మండలాల్లో కొద్దిపాటి వాన పడింది.

చెన్నకేశవస్వామికి వెండి తట్టలు బహూకరణ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి 2 వెండి తట్టలు శనివారం దాతలు బహూకరించారు. విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ మండవేముల శివరామకృష్ణ 992 గ్రాముల 2 వెండి తట్టలను ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులకు అందజేశారు.



చెన్నకేశవస్వామికి వెండి తట్టలు బహూకరిస్తున్న దాతలు

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

- బైక్‌పై వస్తుండగా ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ఘటనా స్థలంలోనే మృతి
- ఎస్పీ దామోదర్ నివాళి
- భార్య తొమ్మి దినెలల గర్భిణి



మాబూసుబాని (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

చీమకుర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఎంతో కష్టపడి తాను అనుకున్న ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించటంతో పాటు, సంఘ విద్రోహశక్తులను మట్టుబెట్టే అత్యంత రిస్క్‌తో కూడిన కీలకమైన బాధ్యతలో ఉన్న కానిస్టేబుల్ దూదేకుల మాబూసుబాని (28) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. చీమకుర్తి మండలం రెడ్డినగర్ వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. మార్కాపురం సబ్‌డివిజన్‌లో మాబూసుబానీ తన విధులు ముగించుకొని బైక్‌పై హెడ్‌క్వార్టర్ ఒంగోలులో రిపోర్ట్ చేసే నిమిత్తం వస్తున్నారు. ఈక్రమంలో ఆయనను వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కానిస్టేబుల్ హెల్మెట్ ధరించినా అది ఊడిపోవడం, తలకు బలమైన గాయం తగలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సుబాని 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. దోర్నాల మండలం చినగుడిపాడుకు గ్రామానికి చెందిన ఆయనకు వివాహం అయింది. భార్య తొమ్మిదినెలల గర్భిణి. ఇది అందరి హృదయాలను కలచివేసింది. ఘటనా స్థలానికి వచ్చిన సీఐ సుబ్బారావు, సిబ్బంది విగతజీవిగా పడిఉన్న సుబానీని చూసి చలించిపోయారు. కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రిమ్స్‌లో ఎస్పీ నివాళి

ఒంగోలు క్రైం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ మాబూసుబాని మృతదేహన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించారు. శనివారం రాత్రి స్థానిక రిమ్స్‌లో ఉన్న ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి ఎస్పీ ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తవ్వేకొద్దీ వెలుగుచూస్తున్న అక్రమాలు

- మరో సర్కార్ దుకాణంలో రూ.9లక్షలు మాయం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ ఆస్తులపై దృష్టి

ఒంగోలుక్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం శాఖలో చోటుచేసుకున్న అవినీతి బాగోతం బయటపడిన విషయం తెలిసిందే. తొలుత ఎలైట్ మాల్‌లో రూ.2.34 కోట్ల నిధులు గోల్‌మాల్ అయినట్లు నిర్ధారించిన అధికారులు రమణ వెరిఫికేషన్ అధికారిగా ఉన్న మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒంగోలులోని ఓ దుకాణంలో మరో రూ.9లక్షలు మాయం అయినట్లు తెలిసింది. దీంతో అక్కడ పనిచేసే సూపర్‌వైజర్ ద్వారా ఆ మొత్తాన్ని రికవరీ చేసినట్లు తెలిసింది. అదేక్రమంలో కానిస్టేబుల్ రమణ ఆస్తులపై అధికారులు దృష్టి సారించారు. ఎక్సైజ్ శాఖ నుంచి రవాణా, రిజిస్ట్రేషన్ శాఖలకు లేఖలు రాశారు. రమణకు సంబంధించిన ఆస్తులు, వాహనాలు ఎవరికి బదిలీ చేయకూడదని కోరారు. అదేవిధంగా బ్యాక్‌లలో ఉన్న నగదును ఫ్రీజ్ చేయాలని లేఖలు రాయనున్నట్లు తెలిసింది. అయితే ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు కానిస్టేబుల్ రమణపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఎలైట్ మాల్స్‌లో పనిచేసే సిబ్బందిని విచారణ చేసి రాత్రికి ఇంటికి పంపిస్తున్నారు.

చెడ్డీగ్యాంగ్ కలవరం



కళాశాలలో గేట్లు పగులకొడుతున్న చెడ్డీగ్యాంగ్

ఒంగోలు క్రైం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): చెడ్డీగ్యాంగ్ చొరబాటు విషయం నగరంలో కలవరం పుట్టిస్తోంది. పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. రెండు రోజుల క్రితం నగర శివారు ప్రాంతంలో ఉన్న ట్రిపుల్ ఐటీలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసిన అనే విషయం సీసీ ఫుటేజీలో వెలుగుచూసింది. దీంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. రావ్ అండ్ నాయుడు కాలేజీలో ట్రిపుల్ ఐటీ నడుస్తుంది. అక్కడ రెండు వేలమంది విద్యార్థులు ఉంటున్నారు దొంగలు కాలేజీలోకి చొరబడి దొంగతనం చేయడానికి విశ్వప్రయత్నం చేశారు. అక్కడ ఏమి వారికి దొరకలేదు. అక్కడి నుంచి రైలు పట్టాలు వెంట నడుచుకుంటూ రాంనగర్ 8 లైన్‌లో ఆలూరి నర్సింగ్ కళాశాలలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ కళాశాల కార్యాలయంలో రూ.లక్ష నగదు అపహరించుకెళ్లారు. అయితే ట్రిపుల్ ఐటీ కళాశాలలో మొదటి అంతస్తులో బాలికల వసతిగృహం ఉంది. అదేవిధంగా నర్సింగ్ కళాశాలలో అంతా బాలికలే ఉంటారు. దొంగలు కేవలం కళాశాల ఆఫీస్ గదులలో మాత్రమే దొంగతనానికి పాల్పడ్డారు. ఈ గ్యాంగ్‌లో ఐదుగురు సభ్యులు ఉన్నారు. వారు మారణ ఆయుధాలతో తిరుగుతుంటారు. అదేవిధంగా శివారు ప్రాంతాలలో ఉన్న పెద్దపెద్ద భవనాలను ఎంపిక చేసుకుని చోరీలు చేశారు. అయితే ఈ ముఠా చోరీలకు పాల్పడే సమయంలో జనసంచారం ఉంటే వారిపై దాడులు చేయడానికి కూడా వెనుకాడరు.

గస్తీ ముమ్మరం చేశాం: డీఎస్పీ

చెడ్డీగ్యాంగ్ కదలికలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల క్రితం ఒంగోలు ట్రిపుల్ ఐటీ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో చోరీలకు పాల్పడినట్లు సీసీ ఫుటేజీ లభ్యమైందని చెప్పారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గస్తీ ముమ్మరం చేశామన్నారు. అదేవిధంగా బ్లూకోట్స్, రక్షక్ వ్యవస్థను పటిష్ఠ పరిచామని తెలిపారు. ఏడు బ్లూకోట్స్ బృందాలలో ఒక్కో వాహనంపై ఇరువురు ఉండే విధంగా రక్షక్ వాహనంలో డ్రైవర్‌తోపాటుగా ముగ్గురు సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. పోలీసు బీట్ వ్యవస్థను పటిష్ఠం చేశామన్నారు. ప్రతి కానిస్టేబుల్ వాహనానికి సైరన్ ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. నిఘా పటిష్ఠ పరిచామని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లో, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.



ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆర్డీవోను కలిసిన జనసేన పార్టీ నేతలు

చీరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో దేవరకొండ అఖిలను జనసేన పార్టీ నాయకులు గూడూరి శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి దీక్షధారులకు అన్నదానం

మేదరమెట్ల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : శ్రీ గణపతి మురగన్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి అయ్యప్ప దీక్షధారులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో డిసెంబరు 2వ తేదీ వరకు 44 రోజులు అన్నదానం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప, శివ, భవానీ, గోవింద దీక్షధారులు అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జోరుగా వైట్‌బర్లీ సాగు

- పెరుగుతున్న విస్తీర్ణం
- మిర్చిని వదిలేసి పొగాకు వైపు రైతుల చూపు

పర్చూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైట్ బర్లీ మొక్కలు నాటే కార్యక్రమం పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మొక్కలు నాటే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో వైట్ బర్లీ మొక్కలు నాటే కార్యక్రమం సాగుతుంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి సక్రమంగా వర్షాలు లేకపోవడం, గత ఏడాది వేల ఎకరాల్లో సాగుచేసుకున్న మిర్చి పంటలు దెబ్బతినడంతో ఖరీఫ్ సాగు నామమాత్రంగానే సాగింది. అయితే వైట్ బర్లీ పొగాకుకు దిగుబడులతోపాటు, నాణ్యమైన ధర ఉండడంతో అధిక శాతం రైతులు వైట్ బర్లీ పొగాకు సాగువైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈఏడాది వైట్ బర్లీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అటు రైతులతోపాటు వ్యవసాయాధికారులు కూడా అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూడలంగా ఉండడం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఖురద యాతగా వైట్‌బర్లీ మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకుంది. పర్చూరు వ్యసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాలలో గత ఏడాది 20వేల ఎకరాలలో రైతులు వైట్ బర్లీ పొగాకును సాగు చేసారు. ఈ ఏడాది రెట్టింపు ఎకరాల్లో చేస్తున్నట్లు కన్పిస్తోంది.

తగ్గిన మిర్చి సాగు

మార్టూరు : గత ఏడాది పొగాకు పంట ఆశాజనకంగా ఉండటం, మిరప పంట దెబ్బతినడంతో ఈ ఏడాది మండలంలోని మిరప పంట రైతులు పొగాకు పంట సాగువైపు దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా గత ఏడాది ఎకరా పొగాకు పంట సాగుచేసిన రైతులు 2 నుంచి రూ.4లక్షల దాకా లాభాలు సాధించిన వారున్నారు. దానికి తోడు మిరపను సాగు చేసిన రైతులు నల్లతామర వైరస్‌తో సరైన ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాక నష్టాలలో మునిగిపోయిన రైతులూ ఉన్నారు. అంతేగాకుండా మూడేళ్లుగా మిరపను సాగుతో రైతులు నష్టపోవడంతో వారంతా ఈ ఏడాది పొగాకు పంట సాగు పట్ల ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.



పర్చూరు ప్రాంతంలో వైట్ బర్లీ మొక్కలు నాటుతున్న వ్యవసాయ కూలీలు.. లంబాడీ తాండాలో సాగులో ఉన్న పొగాకు

మిరపను తగ్గించి.. పొగాకు వేశా



ఏటా మిరప పంట సాగు చేస్తున్నాను. మూడేళ్లుగా నష్టాలు వస్తున్నాయి. గతేడాది 2 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. లాభదాయకంగా ఉంది. ఈ ఏడాది కూడా మిరపను తగ్గించి నాలుగు ఎకరాలలో పొగాకును సాగుచేశాను.

- పావులూరి విజయ్‌బాబు, నాగరాజుపల్లి

గత ఏడాది ఖరీఫ్, రబీలో 1100 ఎకరాలు మిర్చి పంట సాగుచేయగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో కేవలం 380 ఎకరాలు మాత్రమే సాగుచేశారు. మండలంలో ప్రధానంగా మిరప సాగుకు నాగరాజుపల్లి, జొన్నతాళి, బొబ్బేపల్లి గ్రామాల రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. మిగిలిన గ్రామాలలో తక్కువ మోతాదులో మిరప సాగుచేస్తారు. ఎకరాకు లక్షన్నర రూపాయలు ఖర్చు చేసి సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు మిరపకు బదులు పొగాకు సాగు చేపట్టారు. మండలంలో దాదాపుగా 200 ఎకరాలు దాకా పొగాకు సాగు చేస్తున్నారు. మార్టూరు పంచాయతీలోని లంబాడితాండా వాసులు ఏకంగా 50 ఎకరాలు దాకా పొగాకును సాగు చేస్తున్నారు. ఇంకా మండలంలో పొగాకు సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది క్వింటా పొగాకు 16 నుంచి 17వేలు రూపాయల దాకా ధర పలికింది. దానికి తోడు దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్ల దాకా వచ్చింది. దాంతో పొగాకు సాగు చేసిన రైతులుకు బాగానే డబ్బులు వచ్చాయి.



బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

పథకాలను వినియోగించుకోవాలి

న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నాగవెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఆహారం, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టాక్ రూములను పరిశీలించారు. రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. హెచ్‌ఎం డీ పద్మావతి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యర్రమోతు రమేష్, ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు షేక్ మహ్మద్ రఫీ, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీను మృతిపై పారదర్శక విచారణ జరపాలి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- డీఎస్పీ హామీతో రాస్తారోకో విరమణ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను మృతిపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం ఆందోళనకు దిగారు. ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని పెద్ద సంఖ్యలో ప్రజలు, బాధిత కుటుంబ సభ్యులు చీరాల గడియార స్తంభం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు వారితో పాటు సెంటర్ వరకు వచ్చారు. రాస్తారోకో మొదయ్యాక ఆరోగ్య కారణాలతో ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఉద్దేశపూర్వకంగానే హత్య కోణం దాగి ఉందని ఆరోపించారు. డీఎస్పీ జగదీష్ నాయక్ కేసును వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ముందుగా పట్టణంలోని ములాయ్ సింగ్ యాదవ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. అదుపులో నలుగురు

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు. పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నదిలో మంచినీటి పథకాల పంప్‌హౌస్ వద్ద ఉన్న సామాజిక అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి పేకాట జరుగుతుండగా ఎస్ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేసి, 4గురుని అదుపులోకి తీసుకొని రూ.5240 స్వాధీనం చేసుకున్నారు.

వరదకు కొట్టుకుపోయిన గేదె

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరాయపాలెం సమీపంలో దోర్నపు వాగులో వరద నీటి ఉధృతికి గేదె కొట్టుకుపోయి కల్వర్టు తూములలో ఇరుక్కుపోయి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పేరాయపాలెంకు చెందిన పుట్టా శ్రీనివాసరావు గేదెల ను గురువారం సాయంత్రం మేతకు దోర్నపు వాగు వైపు తోలుకెళ్లారు. ఇంటికి వచ్చే సమయంలో గేదెలు వాగు లోకి దిగగా, ఒక గేదె వాగులో కొట్టుకుపోయి తూములలో ఇరుక్కుంది. శనివారం చనిపోయిన గేదె బయట పడింది. రూ.95వేల విలువైన గేదె మృతి చెందినట్లు రైతు తెలిపారు.

లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతి



బాబుల్‌రెడ్డి

అద్దంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గూడా బాబుల్‌రెడ్డి (42) గుండెపోటుతో మృతి చెందారు. అద్దంకి మండలం కలవకూరుకు చెందిన బాబుల్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా లండన్‌లో పనిచేస్తున్నారు. గురువారం గుండె పోటుతో మృతి చెందినట్లు బంధువులకు సమాచారం అందింది. భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం బాబుల్‌రెడ్డి మృతదేహాన్ని కలవకూరు తీసుకురానున్నట్లు తెలిపారు.

అప్పు చెల్లించాలని గ్రామస్థుల ఆందోళన

- సుమారు 40 మంది వద్ద రుణం తీసుకున్న సిమెంట్ వ్యాపారి
- రూ.కోటి వరకూ ఇవ్వాలని బాధితుల గగ్గోలు
- రోడ్డుపై బైఠాయించిన యజమాని

బల్లికురవ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు డబ్బులు చెల్లించడం లేదని పలువురు బాధితులు శనివారం ఆందోళనకు దిగారు. కొప్పెరపాడు గ్రామానికి చెందిన సిమెంట్ దుకాణ నిర్వాహకురాలు తమ వద్ద అప్పుగా తీసుకున్న కోటి రూపాయలను ఇవ్వడం లేదని సుమారు 40 మంది బాధితులు నిరసన చేపట్టారు. కొప్పెరపాడులో సిమెంట్ దుకాణం నిర్వహించే మహిళ గ్రామంలో సుమారు 40 మంది వద్ద రూ.కోటి వరకు అప్పులు చేశారు. తాము ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నా ఆమె వారికి సరైన సమాధానం చెప్పకపోవడంతో విసిగిపోయిన వారు శనివారం సిమెంట్ దుకాణం వద్దకు వచ్చి షాపుకు తాళాలు వేసి తమ డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టారు. అప్పులు తీసుకొని ఏళ్ల గడుస్తున్నా చెల్లించకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మహిళ భర్త కరోనాతో చనిపోగా అప్పట్లో చేసిన అప్పులు ఇప్పటి వరకు చెల్లించలేదని, దుకాణం మాత్రం నిర్వహిస్తున్నారన్నారు. కూలినాలి చేసుకొని కూడబెట్టిన నగదు ఇచ్చామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు అడుగుతుంటే తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారని చెప్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళన చేస్తున్నవారిని పంపించేశారు. సమస్య ఉంటే చట్టప్రకారం వెళ్లాలని సూచించారు. అనంతరం బాధితులంతా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యజమాని హైడ్రామా

అప్పులు ఇచ్చిన వారు వచ్చి తమ డబ్బులు ఇవ్వండని ఆందోళనకు దిగగా, సిమెంట్ దుకాణానికి చెందిన యజమాని, ఆమె కుమార్తె అద్దంకి నార్కెట్‌పల్లి ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. తాము చనిపోతామని హైడ్రామా ఆడారు. ట్రాఫిక్‌ను నిలిపి మరి రోడ్డుకు అడ్డుగా వారు ఉండడంతో పోలీసులు వారిని బయటకు తెచ్చారు. డబ్బులు ఇచ్చిన వారు నిరసన చేయడం ఒక వంతైతే అప్పుగా తీసుకున్న వారు కూడా రోడ్డుపైకి రావడం ప్రజలను విస్మయానికి గురి చేసింది. అప్పులు ఇచ్చిన వారు, తీసుకున్న వారు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు.



సిమెంట్ దుకాణం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు



వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యునిగా సెయింట్ ఆన్స్ వ్యాయామ ఉపాధ్యాయుడు

చీరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ(కే) యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబరుగా సెయింట్ ఆన్స్ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

యువత చొరవతో మానవ అక్రమ రవాణా నియంత్రణ

డీఎస్పీ జగదీష్ నాయక్



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ జగదీష్ నాయక్, ప్రతినిధులు

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యువతరం చొరవతో మానవ అక్రమ రవాణా, మహిళల రక్షణ నియంత్రించవచ్చని చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో మదర్ సర్వీస్ సొసైటీ చీరాల వారి ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమం నిర్వహించారు. చైతన్య భారతి డిగ్రీ కళాశాల, గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హాజరయిన డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా తరలించిన వారిని ఇతర ప్రాంతాల్లో యాచన చేయించడం లేక అవయవాలను విక్రయానికి పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ప్రతినిధి నాగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు, గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర, డీసీఐసీ కన్వీనర్ దాసరి ఇమ్మానియేల్, చీరాల మహిళా మండలి ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

23న సర్వసభ్య సమావేశం

పర్చూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 23న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పల్లె పండుగతో అభివృద్ధి

బల్లికురవ. అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కన్పిస్తోందని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడులో సీసీ రోడ్లు, గోకులం షెడ్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మాధవ్, టీడీపీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, అబ్రహం, అధికారులు పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం, చిన మల్లవరంలో సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణానికి ఎంపీడీవో స్వరూపారాణి, స్థానిక నేతలు, అధికారులతో కలసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషం, ఈవో ఆర్డీ కె.సుమంత్, టీడీపీ మండల అధ్య క్షుడు రావూరి రమేష్, బాలిన రామసుబ్బారావు, ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఉపాధి, సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పల్లె పండుగతో గ్రామాలు, పల్లెలలో నూతన వెలుగులు సంతరించుకుంటాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి ఉషారాణి అన్నారు. వీరన్నపాలెం, పోతుకట్ల, కొమర్నేనివారిపాలెం, చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోకుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కోసనా సత్యనారాయణ, ఏపీవో బుల్లియ్య, మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, నాయకులు మానం హరిబాబు, షేక్ జమాలుద్దీన్, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్టూరు : ఉపాధి నిధులు రూ.కోటీ 50లక్షలతో సీసీ రోడ్లకు శనివారం మార్టూరు పంచాయతీలో అధికారులు, టీడీపీ నాయకులు భూమి చేశారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, శివనాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జాష్టి సాంబశివరావు, శ్రీను, పీఆర్ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. నాగరాజుపల్లిలో సీసీ రోడ్లుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు మిన్నెకంటి రవికుమార్, సాంబశివరావు, పోతురాజు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లు : గ్రామాలలో సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఇంకొల్లులో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ రాజ్యలక్ష్మి, ఏపీవో రేణుక టీడీపీ నాయకులు, ఎంపీపీ బండారు అనూష, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, మార్క్, మాబాషా పాల్గొన్నారు.



కూకట్లపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న అధికారులు





కల్లంవారిపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నేతలు.. చెరుకూరులో పాల్గొన్న నాయకులు



చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చిన్నారుల సంరక్షణపై అప్రమత్తం

న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని చిన్నారుల సంరక్షణకై అప్రమత్తంగా ఉండాలని న్యాయాధికారి ఎస్.సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం కస్తూర్బా మునిసిపల్ బాలికోన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. స్కూల్‌లో వసతులపై ఆరా తీశారు. భోజన వతిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాలికల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఎల్‌వీలు రామారావు, మదీన్, సుభాని, ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, బాబు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకుల అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

మార్టూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరు సెంటర్లో జనసేన పార్టీ నాయకులు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎన్నారై మన్యం శ్రీకాంత్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మందపాటి కిషోర్, ముస్తఫా అంబేద్కర్, కొండపల్లి కాశిలింగం, కందుల ప్రేమ్ కుమార్, బొబ్బేపల్లి నటరాజ్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



హరిహర గోశాలలో ఊయల ఊగుతున్న బాలికలు

సంప్రదాయాలను కాపాడుదాం

ఉత్సాహంగా అట్లతద్ది పండుగ

అద్దంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అట్లతద్ది వస్తుందంటే చాలు గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా వీధికొకటి చొప్పున పెద్ద పెద్ద ఉయ్యాలలు కనిపించేవి. వాటిలో ఊగటానికి చిన్నా పెద్దా తారతమ్యం మరిచి బాలికలు మొదలు నడి వయస్సు మహిళల వరకు ఉత్సాహం చూపించే వారు. అయితే గత రెండు, మూడు దశాబ్దాలుగా అంతా మారిపోయింది. అట్ల తద్దె అంటే మొక్కుబడిగా జరుపుకునే పండుగగా మారింది. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలోని విశ్వభారతి కళాశాల సమీపంలో హరిహర గోకులంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఊయల ఏర్పాటు చేసి అట్లతద్దె ఆచారం నేటి తరానికి అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. కొంతమంది బాలికలు, యువతులు ఉయ్యాలలో ఊగారు. కార్యక్రమంలో హరిహర గోకులు నిర్వాహకుడు గోనుగుంట్ల సుబ్బారావు, రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళీసుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరి, ఊటుకూరి నాగరాజకుమారి పాల్గొన్నారు.

అటకెక్కిన అట్లతద్దె

మార్టూరు : అట్లతద్దె పండుగ జాడ గ్రామాల్లో కన్పించలేదు. అంతా కంప్యూటర్ యుగంగా మారిన నేపథ్యంలో పండుగలు, సంప్రదాయాలు అటకెక్కుతున్నాయని గ్రామాల్లో పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. తాటివారిపాలెం గ్రామంలో మాత్రం ఊయలు ఊగడం కన్పించింది.

- విచ్చలవిడిగా పసుపురంగు, చైనా సాల్ట్ వినియోగం
- కల్తీ నూనె.. నిల్వ మాంసంతో అనారోగ్యంపాలే!
- నరాల బలహీనత, మెదడు రుగ్మతలు

బిర్యానీ.. బాప్‌రే!

ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు నీళ్లు

ఇంట్లో వండుకుంటే అద్భుతం.. బయట తింటే అనారోగ్యం

బిర్యానీ... ఈ పేరు చెబితే మాంసాహార ప్రియులకు నోరూరక తప్పదు. పుట్టిన రోజు, పెళ్లిరోజు, ఉద్యోగం వచ్చినా, ఇంటికి బంధువులొచ్చినా, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినా, ఇద్దరు స్నేహితులు కలిసినా ఇలా ఏ శుభకార్యమైనా బిర్యానీ రుచి చూడాల్సిందే! ఇలా ప్రతీ ఒక్కరి జీవితంలో బిర్యానీ ఓ పరిచయం లేని వంట అయ్యింది. ఈ ఎడారి వంట ఇంట్లో వండుకుని తింటే అద్భుతమైన రుచి.. అదే హోటళ్లలో తింటే అనారోగ్యంపాలు కావాల్సిందేనం టున్నారు వైద్యునిపుణులు. వ్యాపార రంగంలో పోటీని తట్టుకునేందుకు హోటళ్ల నిర్వాహకులు ఆకర్షణ కోసం రంగులు, రుచి కోసం రసాయనాలను కలిపే స్తుండటమే ఇందుకు కారణం. ప్రధానంగా అజినోమోటో (చైనాసాల్ట్)ను ఎక్కువగా వాడటం వల్ల నరాల బలహీనత, మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ)



ఇంట్లో జరిగే ఏకార్యమైన ఖర్చు ఎక్కువని చక్కటి శాకాహార భోజనం మానేసి సింపుల్‌గా తక్కువ ఖర్చుతో వచ్చే బిర్యానీ ఆర్డర్ ఇస్తున్నాము. మన సంస్కృతికి అద్దంపట్టే శాకాహార భోజనానికి ఎప్పుడో టాటా చెప్పేసి అనారోగ్య మాంసాహార వంటలకు వెల్‌కం చెబున్నాము. ఇందులో బిర్యానీ ప్రధానమైంది. ఇంట్లో వండిన బిర్యానీ ఫర్వాలేదనిపించినా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలలో వడ్డిస్తున్న బిర్యానీ ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు.

● అజినోమోటోతో తీవ్ర ప్రభావం

బిర్యానీ తయారీకి కచ్చితంగా అజినోమోటో వేయాల్సిందే. ఇది వేస్తే తప్ప మనకు కావాల్సిన రుచి రాదు. ఇది చైనా ఉప్పు. వ్యక్తి శరీరంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. నరాల బలహీనత, మెదడుపై ప్రతికూలతను చూపడం దీని ప్రత్యేకత. ఈ విషయాన్ని ఆరోగ్య భద్రత అధికారులు తేల్చారు కూడా. ప్రజలకు అవగాహన సదస్సులు పెట్టి మరీ వివరిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో దీని వాడకం కచ్చితంగా ఉంటుంది. అలాగే వంట నూనెను ఒకటికి రెండు సార్లు కాచడం వల్ల పెద్దగా ప్రమాదం లేదు కానీ అంతకు మించి కాచి వంటలో వాడితే మాత్రం అత్యంత ప్రమాదకరం. ఇలా కాయడం వల్ల నూనె సహజత్వాన్ని కోల్పోయి రసాయనంగా మారుతుంది. ఈ విషయాన్ని కూడా ఎఫ్ఎస్‌వోలు గుర్తించారు. బిర్యానీలోకి కావాల్సిన వివిధ రకాల డిష్‌లలో ఈ తరహా కాచిన నూనెనే ఎక్కువగా వాడుతున్నట్లు ఎఫ్ఎస్‌వోల తనిఖీల్లో వెల్లడైంది.

● నకిలీ పౌడర్లతో జర భద్రం

బిర్యానీ తయారీకి ధనియాలపొడి, మిరప్పొడి, గరంమసాలా, డాల్డా, నెయ్యి అవసరం. నాణ్యమైనవి వాడాలంటే వ్యాపారులకు గిట్టుబాటు కాదు. అందుకనే నల్లబజారులో అత్యంత తక్కువ ధరకు లభించే నకిలీ పౌడర్లను వాడేస్తున్నారు. పైగా బయటి ప్రాంతాల నుంచి తక్కువ ధరకు తెచ్చిన చికెన్, మటన్, చేపలు, రొయ్యలను నిల్వ ఉంచి బిర్యానీలో వాడటం వల్ల సహజత్వాన్ని కోల్పోయి విషంగా మారుతున్నాయి. అందుకే బిర్యానీ తిన్న కొందరిలో అజీర్తి, గ్యాస్, ఫుడ్‌పాయిజన్ సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారం మహిళల్లో హార్మోన్ల సమస్యకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, బిర్యానీ ఆకర్షణీయంగా ఉండేందుకు ఎల్లో, రెడ్, ఆరెంజ్ రంగులతో కూడిన రసాయానాలు కలుపుతున్నారు. వీటి వల్ల కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ప్రజల్లో మార్పు రావాలి

ఆహార తయారీ కేంద్రాలపై దాడులు చేసి అక్కడ నెలకొన్న ప్రజారోగ్య సమస్యలు గుర్తించి నిర్వాహకులను హెచ్చరిస్తున్నాము. ప్రజల్లోనూ అవగాహన రావాలి. రంగులు కలపడం, నిల్వ మాంసం వాడటం, నూనె వరుసగా కాయడం చాలా ప్రమాదకరం. నరాల బలహీనత, మెదడుపై అనారోగ్య తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అజినోమోటో ఉప్పును పూర్తిగా వాడకపోవడం మంచిది.

- వెంకటేశ్వరరావు, సహాయ ఫుడ్ కంట్రోలర్



బయట వంటకాలకు దూరంగా ఉండాలి

నిల్వ మాంసం, రంగులు, చైనా ఉప్పు వంటి వాటివల్ల హార్మోన్ల సమస్య, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దారితీస్తుంది. బయట వంటకాలకు దూరంగా ఉంటే మంచిది. అజినోమోటో వల్ల నరాలు బలహీనపడతాయి. చిన్నారుల్లో మెదడు సంబంధిత వ్యాధులు సంభవిస్తాయి.

- కృష్ణచరిత, ప్రముఖ గైనకాలజిస్టు



అవగాహన లేకపోవడం ప్రధానం

బిర్యానీ ఇప్పుడు అందరికీ ఇష్టమైన ప్రధాన ఆహార పదార్థమైంది. చిన్నారులకు ఇదంటే మక్కువ పెరిగింది. ఇందులో విషపూరిత పదార్థాల కలయిక ఉందని ప్రజలకు అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్య. ఇంట్లో వంటల కంటే హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల్లో లభించి రుచికోసం అందరు తాపత్రయపడుతున్నారు. దీనివల్లే జబ్బులు వస్తున్నాయి.

- ఇరువూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు

మందుబాబులు
ఫుల్ ఖుషీ

- క్వార్టర్ బాటిల్ రూ.99లకే!
- షాపులలో ఎమ్మార్పీ విక్రయాలు.. బార్లలో రేట్ల తగ్గింపు
- అందుబాటులోకి అన్ని బ్రాండ్లు



రూ.99లకే దొరుకుతున్న క్వార్టర్ బాటిల్

నెల్లూరు (క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మందుబాబు భలే ఖుషీ అవుతున్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో నాసిరకం మద్యానికి తోడు ధరలతో మద్యంప్రియులు అల్లాడిపోయారు. బార్లలో మాత్రం అన్ని బ్రాండ్ల మద్యం దొరికేది. అయితే, ఎమ్మార్పీపై రూ.100 నుంచి 150 వరకు అదనంగా వసూలు చేసేవారు. గడిచిన ఐదేళ్లలో ఇటు మద్యం దుకాణాలు, అటు బార్లలో వైసీపీ సర్కారు మందుబాబుల నుంచి నిలువుదోపిడీ చేసింది. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి తెస్తామని, మద్యం పాలసీలో మార్పులు చేస్తామని ప్రచారంలో పదే పదే చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు నూతన మద్యం పాలసీను ఈ నెల 16వ తేదీ నుంచి అందుబాటులోకి తెచ్చి, లాటరీ ద్వారా వ్యాపారులకు షాపులు కేటాయించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.99లకే క్వార్టర్ మద్యం అందుబాటులోకి వచ్చింది. ధర తక్కువగా ఉన్నా మీఎస్‌టీపీ కంపెనీ మద్యం కావడంతో మందుబాబులు ఇష్టంగా తాగుతున్నారు. ఇక ఎంసీ, ఐబీ, రాయల్‌స్టాక్ బ్రాండ్‌లు అందుబాటులోకి వచ్చాయి. అయితే మద్యం ధరలు తగ్గుతాయని ఆశించిన ప్రజలకు మాత్రం నిరాశ మిగిలింది. ఈ అంశంపై అధికారులను వివరణ కోరగా నవంబరు 1వ తేదీకల్లా కొత్త ధరలు అమలులోకి రానున్నట్టు చెప్పారు.


● బార్లలో ధరల తగ్గింపు

నూతన పాలసీ పుణ్యమా అని బార్లలోనూ మద్యం ధరలు దిగొచ్చాయి. గతంలో బార్లలో

- మిగతా 6లో



ధర తగ్గింపుపై ఓ బార్‌లో ఏర్పాటు చేసిన బోర్డు



భూ ప్రక్షాళనకు గ్రామసభలు మొదలు

నెల్లూరు (హరనాథపురం) : గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వేలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు, బాధితుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు శనివారం జిల్లావ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. జిల్లాస్థాయి అధికారులు మొదలు గ్రామస్థాయి అధికారుల వరకు సభల్లో పాల్గొని అర్జీలు స్వీకరించారు. తొలిరోజు ఆత్మకూరు, కావలి, నెల్లూరు, కందుకూరు మండలాల్లోని 21 గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో జరిగిన సభలో భూ రికార్డులు-సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను వచ్చినట్లు అధికారులు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

- వివరాలు 8లో..



జొన్నవాడలో అర్జీ స్వీకరిస్తున్న సర్వే శాఖ ఏడీ నాగేశ్వర్



ఇండోర్ స్టేడియం పరిశీలనలో రవినాయుడు, బీద రవిచంద్ర తదితరులు

నిబద్ధతతో పని చేయండి

జిల్లాలో క్రీడాభివృద్ధికి నిబద్ధతతో పని చేయండి. సమస్యలపై అధ్యయనం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు నివేదికలను సిద్ధం చేసి మాకు పంపండి. అంతేగాక క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రతి మూడు నెలలకోసారి స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్షించండి. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఇండోర్ మైదానం, ఇతర మైదానాల మరమ్మతులు చేపట్టడంతోపాటు అకాడమీలను వినియోగంలోకి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.'

- నెల్లూరులో జరిగిన శాప్ అధికారుల సమీక్షలో చైర్మన్ రవినాయుడు

- వివరాలు 6లో..



కుర్రపల్లి వద్ద దున్నపోతుల వాగు ఉధృతి

మెట్టలో భారీ వర్షం

పొంగి ప్రవహించిన వాగులు, వంకలు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరుములు, మెరుపులతో మెట్టప్రాంతం దద్దరిల్లిపోయింది. శనివారం ఉదయం నుంచే భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. 112.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయగిరిలో వీధులు వాగుల్లా మారాయి. మురికి కాలువలు పొంగి పొర్లడంతో చెత్తాచెదారం రోడ్లపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ బస్టాండ్ చెరువును తలపించింది. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పుల్లాయపల్లి గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొండకింద గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. దాసరిపల్లి గ్రామ పెద్ద చెరువు సప్లయ్ చానెల్‌కు గండిపడడంతో నీరు నివాసాల్లోకి చేరింది. విషయం తెలుసుకొన్న మాజీ సర్పంచ్ సయ్యద్ జమ్మత్ జాఫర్ మొహిద్దీన్ ఎక్స్‌కవేటర్ సహాయంతో గండిని పూడ్చడంతో ప్రమాదం తప్పింది. ఇక గండిపాళెం జలాశయానికి 4 అడుగుల మేర నీరు చేరింది. వింజమూరులో

- మిగతా 6లో

డిప్ పద్ధతిలోనే ఇసుక టెండర్లు

- అక్రమార్కులకు కళ్లెం వేసే వ్యూహం
- రవాణా ధర స్థిరీకరణ
- ఒకటీ రెండు రోజుల్లో జీవో?

నెల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రీచ్ నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుక రవాణా టెండర్లలో అక్రమార్కుల రంగ ప్రవేశాన్ని కట్టడి చేయడానికి డిప్ పద్ధతిలో టెండర్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ఇసుక కాంట్రాక్టులతో కోట్లు కొల్లగొట్టిన గుత్తేదారులు, రాజకీయ పార్టీ నాయకులు ప్రస్తుతం ఇసుక టెండర్లలో చొరబడి దోచుకోవడానికి సిద్ధమయ్యారన్న అనుమానాలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

జిల్లాలో నాలుగు ఇసుక రీచ్‌లకు ఇటీవల టెండర్లు పిలిచారు. ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు రవాణా చేయడానికి టన్నుకు రూ. 115 ధర నిర్ణయించారు. ఈ టెండర్లలో 40 మందికిపైగా పాల్గొన్నారు. వారిలో కొద్ది మంది మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన రూ. 115 కన్నా అధిక ధర కోట్ చేశారు. అత్యధికులు భారీ లెస్‌తో టెండర్లు వేశారు. రూ.80కే రవాణా చేస్తామని కొందరు టెండర్లు వేస్తే మరి కొందరు కేవలం 30 నుంచి 36 లకే సప్లయ్ చేస్తామని దరఖాస్తు చేశారు. ఈ ధరలను చూసిన కలెక్టర్ ఓ ఆనంద్ ఇంగుతిని విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని గమనించిన నారాయణ దొడ్డిదారిన ఇసుకను విక్రయించుకోవాలనే ఉద్దేశంతోనే భారీ లెస్‌కు టెండర్లు వేశారన్న విషయం అర్థం చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమార్కులకు అవకాశం కల్పించకూడదనే ఉద్దేశంతో మైనింగ్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు టెండర్లలో జరుగుతున్న బాగోతాన్ని వివరించారు. దీనికి పరిష్కార మార్గంగా ప్రభుత్వం నిర్ణయించిన రూ.115లకే ధర స్థిరీకరించి టెండర్లలో పాల్గొన్నవారిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇది మంచి పరిష్కారం అని భావించి అలాగే చేయమని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం నెల్లూరు జిల్లాలో ఇసుక టెండర్లు వేసిన అందరినీ చేర్చి డిప్ పద్ధతిలో నలుగురిని ఎంపిక చేసి వారికి కాంట్రాక్టు అప్పగించారు. అయితే డిప్ విధానంపై జీవో లేని పక్షంలో న్యాయపరమైన సమస్యలు, విమర్శలు ఎక్కువ అవుతాయనే ఉద్దేశంతో నెల్లూరు జిల్లాలో డిప్ పద్ధతిన కేటాయించిన కాంట్రాక్టులను రద్దు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరను స్థిరీకరిస్తూ టెండర్లను డిప్ పద్ధతిలో ఖరారు చేసే విధంగా జీవో విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇసుక టెండర్లలో అక్రమార్కుల ప్రవేశాన్ని నియంత్రించి ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుక లభ్యం అయ్యేలా పకడ్బందీగా చట్టం తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

72 ఏళ్ల క్రితం స్వర్ణం ధర ఎంతో తెలుసా!?

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : బంగారం అంటే ఇష్టం ఉండని వారుండరు. మగువలకైతే మహా ప్రీతి. అలాంటి స్వర్ణం ఇప్పుడు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరిపోయింది. ఒక గ్రాము పసిడి ధర రూ.7వేలకు పైగానే ఉంది. ఇది మరింత పెరిగే అవకాశమూ ఉందని నిపుణులు అంటున్నారు. మరి పదేళ్ల క్రితం ఇదే బంగారం ధర ఎంత ఉండేదో మీకు తెలుసా!? 1952లో ధర ఇంకెంత ఉండేదో తెలుసా!?. ఆ వివరాలు పట్టిక రూపంలో ఆంధ్రజ్యోతి అందిస్తోంది.. ఓ లుక్కేయండి!

పది గ్రాముల బంగారం ధర (రూ.లలో)

సంవత్సరం	ధర
1952	26
1953	73
1954	77
1955	79
1956	90
1957	90
1958	95
1959	102
1960	111
1961	119
1962	119
1963	97
1964	63
1965	72
1966	84
1967	102
1968	168
1969	176
1970	170
1971	190
1972	202
1973	278
1974	506
1975	540
1976	432
1977	486
1978	685
1979	937
1980	1,330
1981	1,800
1982	1,645
1983	1,800
1984	1,970
1985	2,130
1986	2,140
1987	2,570
1988	3,130
1989	3140
1990	3,200
1991	3,466
1992	4,334
1993	4,140
1994	4,598
1995	4,680
1996	5,160
1997	4,725
1998	4,045
1999	4,234
2000	4,400
2001	4,300
2002	4,990
2003	5,600
2004	5,850
2005	7,000
2006	8,400
2007	10,800
2008	12,500
2009	14,500
2010	18,500
2011	26,400
2012	31,050
2013	29,600
2014	29,600
2015	26,343
2016	28,673
2017	29,667
2018	34,438
2019	35,220
2020	48,651
2021	50,045
2022	52,950
2023	60,300
2024	74,510



ఊటీ కాదు.. ఉదయగిరే..!



ఉదయగిరి దుర్గం కొండలను కమ్మేసిన మేఘాలు



కనువిందు చేస్తున్న జలపాతం

వర్షాలతో ఉదయగిరి దుర్గం కొండలు పచ్చగా కనువిందు చేస్తున్నాయి. శనివారం కుండపోత వర్షం కురవడంతో దుర్గంపై ఉన్న సల్వాపేట్ జలపాతం దుముకుతోంది. అడవుల్లో సెలయేళ్లు గలగల పారుతుండటంతో ప్రకృతి రమణీయతకు అద్దం పడుతున్నాయి. దుర్గం కొండలను మేఘాలు కమ్మేసిన దృశ్యాలు చూపరులను కనువిందు చేశాయి. పచ్చటి అందాలను తిలకించేందుకు ప్రజలు తరలివస్తున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా సెలయేళ్లలో స్నానమాచరిస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)

మెట్టలో భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

నీటమునిగిన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరిశీలించారు. నెల్లూరు నగరంతో పాటు మనుబోలు, రాపూరు, వరికుంటపాడు, సీతారామపురం, దుత్తలూరు, కలిగిరి, లింగస ముద్రం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

● 'సోమశిల'కు ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి శనివారం 32,116 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. డ్యాంలో 58.644 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. రాళ్లపాడు రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది.

22న జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లిప్‌కార్ట్ సంస్థలో కావలిలో పనిచేసేందుకు 20 డెలివరీ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఇనోవ్‌సూర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెలీకాలర్స్, టీమ్‌లీడర్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 30 పోస్టులకు, అపోలో ఫార్మశీలో ఫార్మా ట్రైనీస్, ఫార్మసిస్ట్ 25 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అమర్‌రాజా బ్యాటరీస్‌లో మిషన్ ఆపరేటర్ 200 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్‌లో 20 ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఇంటర్న్‌షిప్ పీవో 30 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఎన్‌పీసీ కావలి, నెల్లూరులోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు.

మందుబాబులు ఫుల్ ఖుషీ

(5వ పేజీ తరువాయి)

మద్యం పార్శిల్ తీసుకోవాలంటే ఎమ్మార్పీపై రూ.70, నాన్‌ఏసీలో కూర్చొని మద్యం సేవించాలంటే రూ.100, ఏసీలో రూ.330 నుంచి 400 వరకు అదనంగా వసూలు చేసేవారు. ఇప్పుడు ప్రైవేటు షాపుల్లో అన్ని బ్రాండ్లు దొరుకుతుండటంతో మద్యంప్రియులు బార్లకు వెళ్లడం తగ్గించేశారు. దీంతో బార్ల యజమానులు ఎమ్మార్పీపై రూ.20 అధికం అంటూ ఆఫర్ పెట్టారు.

హాస్టళ్ల మరమ్మతులకు రూ.10 కోట్లతో నివేదిక

● అనుమతులు రాగానే పనులు పూర్తి చేస్తాం

● 'ఆంధ్రజ్యోతి'తో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 19 : జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రూ.10.16 కోట్లతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) బి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 71 హాస్టళ్లు ఉండగా, 65 ప్రభుత్వ భవనాల్లోను, ఐదు ప్రైవేటు భవనాల్లో నడుస్తు న్నాయన్నారు. ప్రభుత్వ భవంతులలో ఉన్న కొన్ని హాస్టళ్లకు శ్లాబు, గచ్చు, కిటికీలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఇంకొన్ని చోట్ల మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని నివేదిక తయారు చేసి పంపినట్లు చెప్పారు. అనుమతులు రాగానే మరమ్మతు పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

● డీఎస్సీకి ఉచిత శిక్షణ

డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు. మూడు నెలలపాటు ఈ శిక్షణ ఉంటుందని, శిక్షణలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పించనున్నట్లు వెల్లడించారు. డీఎడ్, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలలోపు ఉండాలని, ఈ నెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

ఈ కవలలు వరల్డ్ రికార్డ్



కావలికి చెందిన తోషణ్, తోషిణి (9నెలల కవలలు) లకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కిడ్స్ టాలెంట్ పోటీల్లో (బేబీ ఒలింపిక్స్) వీరు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, సూపర్ టాలెంటెడ్ కిడ్స్‌గా ఎంపికయ్యారు. ఈ క్రమంలో వారు ఇంటర్నేషనల్ బుక్ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. పట్టణంలోని ప్రైవేట్ ఉద్యోగి సిద్ధార్థ్ మణికంఠ, రూపశ్రీ దంపతుల పిల్లలు వీరు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేశామని తెలిపారు. క్రియేట్ రికార్డ్ కింద తోషన్, తోషిణీల పేర్లు నమోదైనట్లు శనివారం సైట్‌లో ప్రకటించగా, సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నామన్నారు. మరో 20రోజుల్లో మెడల్స్, సర్టిఫికెట్లు పంపించనున్నట్లు సమాచారం అందిందన్నారు.

- కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి)

క్రీడాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయండి

● సమస్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపండి

● నెలకోసారి ప్రజాప్రతినిధులతో సమీక్షించాలి

● శాప్ అధికారులకు చైర్మన్ ఆదేశం

నెల్లూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) 19 : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, సిబ్బంది జిల్లాలో క్రీడాభివృద్ధికి నిబద్ధతతో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. శనివారం నెల్లూరు రూరల్ మండలం మొగళ్లపాళెం మల్టీపర్పస్ ఇండోర్ క్రీడామైదానాన్ని, నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆయన సందర్శించారు. అనంతరం స్టేడియంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అధికారుల, సిబ్బంది సమీక్షలో చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు నివేదికలను సిద్ధం చేసి తమకు అందించాలన్నారు. క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రతి మూడు నెలలకోసారి స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్షించాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్, టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కాకర్ల తిరుమలనాయుడు, క్రీడాసంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


● 2 వారాల్లో స్టేడియం ప్రారంభం

మొగళ్లపాళెంలో 150 ఎకరాల స్థలంలో క్రీడామైదానాల నిర్మాణం రూ. 80 శాతం పూర్తి అయ్యాయని రవినాయుడు అన్నారు. పెండింగ్ పనులతోపాటు పైప్ లైన్స్‌కు అవసరమైన మరో రూ.10లక్షలు విడుదల చేయించి రెండు వారాల్లో ఇండోర్ స్టేడియం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఇండోర్ మైదానం, ఇతర మైదానాల మరమ్మతులు చేపట్టడంతోపాటు అకాడమీలను వినియోగంలోకి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేవీకేలు, ఇండోర్ మైదానాలను సిద్ధం చేయడంతోపాటు డీఎస్ఏల పనితీరుపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్రీడారంగం ఉన్నతికి అన్ని వర్గాల వారు పూర్తి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. నెల్లూరులోని క్రీడామైదానాలన్నీ సిద్ధం చేసి వినియోగంలోకి తేవాలని కోరారు.



నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

C.R.I.M.E D.A.I.R.Y



మృతులు కృష్ణారావు, సునీత (ఫైల్)

2022, ఆగస్టు 28వ తేదీ తెల్లవారుజాము...

నెల్లూరు నగర పరిధి పొడారుపల్లిలోని అశోక్‌నగర్‌లో ఓ ఇంటిలో పాలు పోసేందుకు వెళ్లిన మహిళకు ప్రధాన ద్వారం ముందే రక్తపు మడుగులో ఓ మృతదేహం కనిపించింది. అంతే, ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్టు అయ్యింది. బిగ్గరగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వాళ్లు హడావిడిగా అక్కడకు చేరుకున్నారు. నిన్నటివరకు కలివిడిగా మాట్లాడిన వ్యక్తి రక్తపుమడుగులో ఉండటాన్ని చూసి కంటతడి పెట్టుకున్నారు.

సమాచారం అందుకున్న వేదాయపాలెం పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అక్కడ జరిగింది ఒక హత్య కాదు.. రెండు. భర్తతోపాటు భార్యనూ కిరాతకంగా కడతేర్చారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకోవడం కోసం నానా తిప్పలు పడ్డారు. ఇతర రాష్ట్రాలకు చెందిన దారి దోపిడీ గ్యాంగ్ ఈ ఘాతుకానికి పాల్పడిందా!? ఆర్థిక లావాదేవీల గొడవలు ఏమైనా ఉన్నాయా!? రాజకీయ కక్షలు కూడా ఉన్నాయా!? ఇలా అనేక అనుమానాలు పోలీసులను చుట్టేశాయి. చివరకు వేలిముద్రలే నిందితులను పట్టించాయి. అదెలాగో ఈ కథనం చదవండి..

ఆ కేసును ఎప్పటికీ మరువలేం



జంట హత్యలు జరిగిన సమయంలో నేను నగర డీఎస్పీగా ఉన్నా. సహజంగా అంత కిరాతకంగా హత్య చేసింది ఎవరన్న కోణంలో విచారణ సాగించాం. సాధారణంగా హత్య చేసిన వారు పోలీసులకు దూరంగా ఉండాలని అను కుంటారు. అయితే ఈ కేసులో మాత్రం నిందితుడు శివకుమార్ ఎక్కడికీ పారిపోకుండా హత్య జరిగిన ప్రాంతంలో అందరితో కలిసి బాధపడుతూ, మార్చురీ వద్దకు వెళ్లడం, అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. దీంతో ఎవరికీ అనుమానం రాలేదు. అయితే సాంకేతిక పరిజ్ఞానం అతడ్ని పట్టించింది. ఇలాంటి కేసులను ఎప్పటికీ మరువలేం.

- అబ్దుల్ సుబాన్

నమ్మకస్తుడే గొంతు కోశాడు!

● సంచలనం రేపిన దంపతుల హత్య కేసుకు రెండేళ్లు!

● డబ్బుపై వ్యామోహంతోనే ఘటన ● హోటల్‌లో పని చేసే వ్యక్తే సూత్రధారి

● నిందితులను పట్టించిన వేలిముద్రలు

పడారుపల్లి అశోక్‌నగర్‌లో ఉంటున్న కృష్ణారావు క్యాటరింగ్‌తోపాటు ఓ హోటల్ నడుపుతున్నారు. ఈయన ఇద్దరు సంతానంలో పెద్ద కుమారుడు సాయిచంద్ విశాఖలో ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. రెండోకుమారుడు గోపిచంద్ రాంజీ నగర్‌లో ఉంటూ పొగతోటలో ఓ హోటల్ నడుపుతున్నారు. కృష్ణారావు పడారుపల్లి అశోక్ నగర్‌లో ఓ ఇల్లు నిర్మించుకుని ఆరేళ్లుగా భార్య సునీతతో కలిసి ఉంటున్నాడు. ఆగస్టు 27వ తేదీ రాత్రి హోటల్ లావాదేవీలు ముగించుకుని 11.30 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంటి వద్ద ఉన్న దుండగులు కృష్ణారావును వరండాలోనే అడ్డుకుని కత్తితో గొంతు కోసి హతమార్చారు. ఆ తర్వాత ఇంటిలో నిద్రిస్తున్న భార్య సునీతను హత్య చేసి, దొరికిన నగదుతో పరారయ్యారు. మరోసటి రోజు ఉదయం పాలు పోసేందుకు వెళ్లిన రమణమ్మ గుమ్మం వద్దే రక్తపుమడుగులో ఉన్న కృష్ణారావును చూసి భయంతో కేకలు వేస్తూ వీధిలోకి పరుగులు తీసింది. స్థానికులు వేదాయపాలెం పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడు వాసిరెడ్డి గోపిచంద్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

● నిందితుల కోసం ముమ్మర గాలింపు..

దంపతుల హత్య నగరంలో పెద్ద సంచలనమైంది. దీనిని ఛాలెంజ్‌గా తీసుకున్న అప్పటి ఎస్పీ సీహెచ్ విజయరావు నిందితుల కోసం అదనపు ఎస్పీ (క్రైం) చౌడేశ్వరి ఆధ్వర్యంలో నగర ఇన్‌చార్జి డీఎస్పీ, సీసీఎస్ డీఎస్పీలు, పలువురు సీఐలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దోపిడీ దొంగల పనై ఉంటుందా!? అని అనుమానం ఉన్న ప్రాంతాలన్నీ జల్లెడ పట్టారు. చివరకు కృష్ణారావు నడుపుతున్న శ్రీరామ క్యాంటీన్‌లో పనిచేసే సిబ్బందిని పిలిపించి విచారించారు. అయితే, అక్కడ పనిచేస్తున్న మన్నూరు శివకుమార్ మాత్రం విచారణకు రాలేదు. దీంతో ఆయనపై పోలీసులకు అనుమానం వచ్చింది. రామకోటయ్య నగర్‌లో శివ కుమార్ ఉంటున్న గది వద్ద పోలీసులు నిఘా ఉంచారు. అదే నెల 31వ తేదీ మధ్యాహ్నం వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తన సిబ్బందితో కలిసి శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఇంకేముంది అసలేం జరిగిందో పూసగుచ్చినట్టు వివరించాడు శివకుమార్.

● నమ్మకంగా ఉంటూనే..

కృష్ణారావుకు చెందిన హోటల్‌లో శివకుమార్ కొన్నేళ్లుగా నమ్మకంగా పని చేస్తున్నాడు. అయితే, డబ్బుపై వ్యామోహంతో కృష్ణారావు ఇంట్లో రూ.10-15 లక్షల వరకు నగదు ఉంటుందని ఆ నగదు చోరీ చేస్తే జీవితం స్థిరపడిపోతుందని భావించాడు. ఇంకేముంది తన సమీప బంధువైన సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన కాలగందల రామకృష్ణకు విషయం చెప్పి నెల్లూరుకు రావాలని సూచించాడు. కృష్ణారావు ఇంటి తాళాలను డూప్లికేట్ చేయించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం చేయాలని ముందుగా స్కెచ్ వేశారు. అది వీలుకాలేదు. 27వ తేదీ రాత్రి శివకు మార్, రామకృష్ణలు కృష్ణారావు ఇంటికి చేరుకుని, మాటు వేశారు. సరిగ్గా 11.30-12 గంటల ప్రాంతంలో కృష్ణారావు గేటు తీసి లోపలికి వస్తుండగా తలపై బలంగా కొట్టారు. కిందపడిపోయిన కృష్ణారావు గొంతును కిరాతకంగా పెన్ కత్తితో కోసి, హతమర్చారు. ఆ తర్వాత ఇంట్లోకి ప్రవేశించి, బెడ్‌రూములో నిద్రపోతున్న మృతుడు భార్య సునీతను కర్రతో బలంగా కొట్టి హత్య చేశారు. ఇళ్లంతా గాలించి దొరికిన డబ్బు తీసుకుని శివకుమార్ గదికి చేరుకున్నారు. దోచుకున్న నగదులో శివకుమార్ రూ.70వేలు, రామకృష్ణ రూ.90 వేలు పంచుకున్నారు.



నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న నాటి ఎస్పీ విజయరావు (ఫైల్)

● వేలిముద్రలే పట్టించాయి!

ప్రధాన నిందితుడు శివకుమార్ ఎక్కడికీ పారిపోకుండా హత్య జరిగిన ప్రాంతానికి అందరితో కలిసి వచ్చాడు. మృతుడి సొంత జిల్లా ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన అంత్యక్రియల్లోనూ పాల్గొన్నాడు. దీంతో ఎవరికీ శివకుమార్‌పై అనుమానం రాలేదు. అయితే వేలి ముద్రల సేకరణకు, పోలీసుల విచారణకు రాకపోవడమే శివకుమార్‌ను పట్టించింది. హత్య కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

- నెల్లూరు (క్రైం)

న్యూస్ బాక్స్

బోగోలులో ఎంపీడీవో విచారణ

బిట్రగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఆగస్టు 28న జరిగిన సంఘటనపై వార్డు సభ్యులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి జహీర్, సర్పంచు అనిత, ఉపస ర్పంచు జనార్దన్‌రెడ్డితోపాటు వార్డు సభ్యులను ఎంపీడీవో విచారించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నయిమ్‌తాజ్ హసన్, ఏఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జలదంకి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బీజీ 167 నెంబరు జాతీయ రహదారిపై శనివారం ఎస్‌ఐ లతీఫున్నీసా ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు జలదంకి పెద్దచెరువుకట్ట కింద మలుపు వద్ద ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసి వాటికి హెచ్చరిక స్టిక్కర్లు అంటించారు.

● బారికేడ్ల ఏర్పాటు

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబయి జాతీయ రహదారిలో బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు చర్యలు చేపట్టారు. దువ్వూరు, పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తించిన బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లను అంటించిన బ్యారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ రాజేష్ మాట్లాడుతూ బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్న ప్రాంతాలలో వాహనదారులు పరిమిత వేగంతో వెళ్లాలన్నారు. రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో గోపాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, వంటశాల, విద్యాబోధనను పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తిచేసి పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

శ్మశాన స్థలం చూపాలి

కలువాయి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంట అగ్రహారంలో రీసర్వే సమస్యలపై శనివారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులకు గ్రామస్థులు అర్జీలు అందజేశారు. రీసర్వేలో తమ భూమి విస్తీర్ణం తక్కువ చూపారని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా గ్రామానికి సంబంధించిన శ్మశాన స్థలం ఆక్రమణలకు గురై కేవలం 5సెంట్లు కూడా లేదని, ఆక్రమణలు తొలగించి శ్మశాన స్థలం చూపాలని వారు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల రాక

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిలు రానున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మండలంలోని కొత్తపేట, నర్రవాడ, దుత్తలూరు పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతసాగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఎస్‌బీ జూనియర్ కాలేజ్‌లో ఎలాంటి అర్హతలేని వారికి ఓపెన్ పదోతరగతి, పదో తరగతి పాస్‌అయిన వారికి ఇంటర్‌లో అడ్మిషన్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ జిలానీ తెలిపారు. 9441206811 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ముంపు ప్రాంతాలకు మోక్షమెప్పుడో?

తాత్కాలికంగా పునరావాస కేంద్రాలకు తరలింపు

ఆహార పొట్లాల పంపిణీ ● శాశ్వత పరిష్కారం కావాలంటున్న బాధితులు




ముసునూరు ట్రంకురోడ్డులో నిలిచిన వరద నీరు, వరద నీటిలో మునిగిన ముసునూరు గిరిజన కాలనీ

కావలిటౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలొస్తే పట్టణ పరిధిలోని మునక ప్రాంతాలు ముంపునకు గురవడం, ప్రజలు నానా ఇబ్బందులు పడటం సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా ముసునూరు గిరిజన కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కావేరిగుంట గిరిజన కాలనీ, వినాయక నగర్ గిరిజన కాలనీ, వెంగాయగారి పాలెం గిరిజన కాలనీ భారీ వర్షాలకు తరచూ ముంపునకు గురవుతున్నాయి. ఇవి లోతట్టు ప్రాంతాలు కావడం, పై నుంచి ప్రవహించే వరదనీరు ముందుకు ప్రవహించేందుకు వీలు లేకుండా ఉండడంతో మునిగిపోతున్నాయి. దీంతో స్థానికులను సమీప ప్రభుత్వ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా చేసి తరలించడం, ఆహారం పంపిణీ చేయడం తంతుగా మారింది. ఈ క్రమంలో తమకు శాశ్వత పరిష్కారం కావాలని బాధితులు కోరుతున్నారు.

● త్వరలో శాశ్వత పరిష్కారానికి చర్యలు

ఇటీవల తుఫాన్‌కు మునకకు గురైన ప్రాంతాలను పరిశీలించి, బాధితుల కష్టాలు తెలుసుకున్నా. వరద నీరు నిలవకుండా ముందుకు ప్రవహించేటట్లు అన్ని చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాం. వరద నీటి తరలింపునకు శాశ్వత కాలువల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

- ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండండి



రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యేకు వివరాలు తెలుపుతున్న ఏఈ చంద్రమౌళి

లింగసముద్రం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎగువన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం ఆయన ప్రాజెక్టును సందర్శించి, నీటిమట్టాన్ని పరిశీలించారు.ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20 అడుగులు కాగా, ప్రస్తుతం 15 అడుగులకు నీరు చేరిందని ఏఈ చంద్రమౌళి ఎమ్మెల్యేకి వివరించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 20 అడుగులు నీరు చేరాక గేట్లు తెరిచి నీరు విడుదల చేస్తే, మన్నేరు పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● భక్తులకు మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

వలేటివారిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాలకొండస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న వసతులను డీసీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీ కేవీ సాగర్‌బాబు, ఎస్‌ఐ మరిదినాయుడు, టీడీపీ నేతలు మాదాల లక్ష్మీనరసింహ, కాకుమాను హర్షకుమార్, దార్ల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం : కాకర్ల



సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని పల్లెలను అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం పల్లెపండుగ కార్యక్రమంలో మండలంలోని నేలటూరు, శకునాలపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో రూ.85 లక్షల ఉపాధి నిధులతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్లకు నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నియోజవకర్గంలో రూ. 22.67 కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, తహసీల్దారు సుభద్ర, టీడీపీ రాష్ట్ర నాయకుడు చెంచలబాబుయాదవ్, సర్పంచులు మతకాల తిరుపతమ్మ, పద్మ, పేర్నపాటి గీత, ఏపీడీ గాయత్రీ, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, మన్నేటి వెంకటరెడ్డి, రియాజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● గ్రామాల రూపురేఖల మార్పు

లింగసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెసీమల రూపురేఖలు మారతాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.శనివారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని, చినపవని గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలపాడులో రూ.21.33 లక్షలు, పెదపవనిలో రూ12.67 లక్షలు, చినపవనిలో రూ.26.77 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కే శ్రీనివాసులు, ఎంపీటీసీ తూమాటి గిరిజమ్మ, టీడీపీ నాయకులు జీ సాంబయ్య, సీహెచ్ మనోహర్, వై మాధవ, బీ శ్రీనివాసులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉలవపాడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : 'పల్లె పండుగ లో భాగంగా మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని ఐదు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ముంజూరైన రోడ్లు సుమారు రూ.33 లక్షలతో కరేడులో నాగులు రోడ్లు, కొత్తపల్లెపాలెంలో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, టీడీపీ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, కన్నా ప్రసాదు, మెట్టా శ్రీనివాసులరెడ్డి, బీజేపీ నాయకురాలు తిరుమల, జయరాం, నాయుడు కోటయ్య, పున్నెపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● మోపాడులో 'పల్లె పండుగ'

కందుకూరు, అక్టోబరు 19.(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం సిమెంటు రోడ్లకు భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు తోలక వెంకటేశ్వర్లు, రావుల రవి, ఇంటూరి రమేష్, సతీష్, వంశీ, మోహన్‌రావు, కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి



సీఎంకు వినతిపత్రం అందచేస్తున్న షేక్ రఫీ

కందుకూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాపంగా ఉన్న టైలర్ల సమస్యలను పరిష్కరించాలని ముస్లిం, మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందచేశారు. టైలర్లకు ప్రత్యేకించి 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేయాలని, రాయితీపై టైలర్ షాపులకు విద్యుత్ సరఫరా చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యూనిఫారం దుస్తులు కుట్టడానికి టైలర్ సంఘాలకు అనుమతి ఇవ్వాలని, కంటి చూపు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వాలని, ఉపాధి పరంగా జీవన అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలవాలని ఆ వినతి పత్రంలో కోరారు.

చెరువు గండి పూడ్చిన రైతులు



గండి పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

కొండాపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు మండల పరిధిలోని కొమ్మి గ్రామంలోని గండికట్ల చెరువుకు శనివారం ఉదయం గండి పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు, రైతులు తీవ్రంగా శ్రమించి గండి పూడ్చారు. ఇరిగేషన్ అధికారుల సూచనలతో ఆయకట్టు రైతులు ఎక్సవేటర్ సాయంతో రింగు బండ్‌ను ఏర్పాటుచేసి నీరు వృధా పోకుండా ఆపుకోగలిగారు. ఎస్సై ఎమ్.వెంకటరావు, స్థానిక నాయకులు, రైతులు దగ్గరుండి సహాయ సహకారాలు అందించారు.

వర్షిణీప్రియకు తృతీయస్థానం

కొండాపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 1న నెల్లూరు దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వక్తృత్వ పోటీలో నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ వర్షిణీప్రియ తృతీయస్థానం సాధించింది. దీంతో ఆమెకు శనివారం డీఈవో కార్యాలయంలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీఈవో రామారావు, జిల్లా సైన్సు అధికారి కరుణాకరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు రూ.2000 నగదు అందచేశారని పాఠశాల హెచ్ఎం మారుతి తెలిపారు.

కలిగిరిలో ఉప్పొంగిన వాగులు

కలిగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. భట్టువారివారిపాలెం గ్రామం వద్ద వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు రవీంద్రబాబు, ఎంపీడీవో ప్రత్యూషలు వాగువద్ద ప్రజలు దాటకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రవాహ ఉధృతి పూర్తిగా తగ్గేంతవరకు ప్రజలు గ్రామంలోనే ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సూరేపల్లి మాధవ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 6,43,024

వలేటివారిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,43,024 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 5,850, కుంకుమార్చన ద్వారా రూ. 18,040, వివాహాల ద్వారా రూ. 3 వేలు, తలనీలాల ద్వారా రూ. 32,950, వాహనపూజల ద్వారా రూ. 4,100, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,75,000, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 580, రూము అద్దెల ద్వారా రూ. 32,280, కవర్ల ద్వారా రూ. 5,400, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,68,910, అన్నదానం ద్వారా రూ. 1,96,114, ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

వరద బాధితులకు సహాయం

కందుకూరు, అక్టోబరు19(ఆంధ్రజోతి): విజయవాడ వరద బాధితులకు మోపాడు గ్రామస్థులు ఆర్థిక సహాయం అందచేశారు. శనివారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి వారు రూ.1,00,000 చెక్కు అందచేశారు. కార్యక్రమంలో తోకల సుబ్బారావు, చిరంజీవిరెడ్డి, దామా మల్లేశ్వరరావు, వెంకట లక్ష్మీ, పుష్ప, శ్రీదేవి, చెన్నారెడ్డి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణాపాడులో భూముల రీసర్వేపై గ్రామసభ



కావలి రూరల్ : మన్నంగిదిన్నె గ్రామసభలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

జలదంకి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో తప్పొప్పుల సవరణలకు రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా శనివారం మండలంలోని క్రిష్ణాపాడులో తహసీల్దారు ప్రమీల గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో భూయజమానులు భూవిస్తీర్ణం, పేర్లు తప్పులపై అధికంగా అర్జీలు అందజేశారు. తహసీల్దారు మాట్లాడుతూ రీసర్వేలో వచ్చిన తప్పులపై సవరణలు చేపడతామని, భూయజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామసభలో రీసర్వే డీటీ శ్యాంసన్, ఆర్ఐ శ్రీజ, రైతులు పాల్గొన్నారు.

● గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కావలి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణ తెలిపారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోని తన చాంబరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కావలి డివిజన్‌లో ఈనెల 19 నుంచి నవంబరు14 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భూముల హక్కుల్లో ఏవైనా సమస్యలు ఏర్పడితే వాటిని గ్రామసభలలో పరిష్కరించుకోవచ్చన్నారు.

● రీసర్వేలో పొరపాట్లను సవరించుకోండి

అల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఏవైనా పొరపాట్లు ఏర్పడి ఉన్న రైతులు సవరించుకునేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామని తహసీల్దారు లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. మండలంలోని పురిణిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వేలో తమకు ఎదురైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిని వెంటనే పరిష్కరించి వెబ్‌ల్యాండ్ రికార్డులను సరిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే ఆర్ఐ ప్రభుదీప్ పాల్గొన్నారు.

● భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

బిట్రగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వేలో రైతుల పొలాల వివరాల్లో తప్పులు, సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరించుకునేందుకే గ్రామసభలు నిర్వహిస్తునట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. బోగోలు మండలం సాంబశివాపురంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పలు సమస్యలపై 41 మంది రైతులు అధికారులకు అర్జీలు అందచేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ గీత, మండల సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, ఆర్ఐ వాజీద్, వీఆర్వో మాల్యాద్రి, గ్రామ సర్వేరు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

కావలి రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో వంశీక్రిష్ణ పేర్కొన్నారు.కావలి మండలం మన్నంగిదిన్నెలో శనివారం జరిగిన గ్రామ సభను ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను ఈ గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందవచ్చన్నారు. గ్రామసభలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో బాలకోటయ్య, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాల జలమయం

● నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల



కనియంపాడు వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

వింజమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 100 ఇళ్లలోకి నీరు చేరింది. మండల, పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు, సర్పంచ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలు తీయించి యుద్ధప్రాతిపదికన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బీసీ కాలనీ, జీబీకేఆర్ ఎస్టీ కాలనీలలో వరద నీటిలోకి దిగి నీట మునిగిన ఇళ్లను, మగ్గాలను తమ ఫోన్‌లో ఫోటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించి వారితో మాట్లాడారు. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీట మునిగిన ఇళ్లకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పునరావాస కేంద్రాలలో ఆహారం అందించడంతోపాటు వారికి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, కాకర్ల వెంకట్, రావిపాటి సాంబయ్య, జూపల్లి రాజారావు, నీలం పెరుమాళ్ళ, సర్పంచ్ సృజన, ఎంపీటీసీ సభ్యురాలు యాకసిరి భవానీవాణి, టీడీపీ నాయకురాలు జయలక్ష్మీ, తహసీల్దారు ఎస్ఎం హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, ఇరిగేషన్ డీఈ రమణారావు, ఏఈ మహేంద్ర, ఇతర కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● స్తంభించిన జనజీవనం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్)(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలంలో శనివారం భారీవర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. మండలంలోని ముత్తరాశిపల్లి వద్ద ఉన్న గూబలవాగు, ఏరుకొల్లు వద్ద ఉన్న కావేరి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దుత్తలూరు బీసీ కాలనీతోపాటు పలుకాలనీల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో పరజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుత్తలూరు చెరువుకట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యు త్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తహసీల్దారు నాగరాజు, ఎస్ఐ ఆదిలక్ష్మిలు ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

● వరికుంటపాడు : ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజ లు అవస్థలు పడ్డారు. వాగులు, వంకల్లో చేరి న వరద నీరు సమీప వంతెనలపై ఉధృ తంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి

ఆత్మకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగుపై అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జి లక్ష్మీమాధవి తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీ ప్రాంగణంలో శనివారం ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేయబోయే వరికి అనువైన రకాలు, విత్తనశుద్ధి, నారుమళ్ల పెంపకం, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు, మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ వీ దేవసేనమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం ఎస్ఎంఎస్‌డీ విజయకుమార్ నాయక్, ఆత్మకూరు ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ రాజశేఖర్, ఆత్మకూరు, అనంతసాగరం ఏఎస్‌పేట మండలాల వ్యవసాయ శాఖాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దర్గా, గుడి సమీపంలో మద్యం దుకాణం వద్దు

ఏఎస్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని గ్రామస్థులు జిల్లా కలెక్టరుకు శనివారం ఫిర్యాదు చేశారు. సర్వే నెం 20లో కొండ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నూతనంగా మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, బంగారమ్మ గుడి, దర్గాకు సమీపంలో ఏర్పాటు చేశారని వాపోయారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వేరే ప్రదేశానికి మద్యం దుకాణం మార్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు విన్నవించినట్లు గ్రామస్థులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

వరికుంటపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వాడి పంచాయతీ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులకు సంబంధించి కళాజాత నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లూరు నుంచి వచ్చిన చైతన్య జానపద కళాకారుల బృందం ఆధ్వర్యంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ, సీజనల్ వ్యాధులకు సంబంధించి కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, ఉపాధిహామి పథకం గురించి గేయాలు, నాటికల రూపంలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషం నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి రామాయణం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. తూర్పుబోయమడగల, తూర్పుచెన్నంపల్లి గ్రామ పంచాయతీల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొండపోరంబోకు భూమిలో సీడ్‌బాల్స్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లి వద్ద ప్రభుత్వ కొండపోరంబోకు భూమిలో శనివారం ఎస్ఎన్ఐఆర్‌డీ, ఎఫ్ఈఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ వేసే కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి వనరుల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ పోరంబోకు భూమిలో సీడ్‌బాల్స్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, ప్రాజెక్టు మేనేజరు నాగార్జున, కోఆర్డినేటర్ కేశవనారాయణ, క్షేత్రసహాయకుడు నారాయణరెడ్డి, వసంతరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న మూలం రమేష్

అనంతసాగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. మండలంలోని ఆమనిచిరివెళ్లలో శనివారం జరిగిన మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జమిలీ ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. అనంతరం మండల నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో గంటా లక్ష్మీపతి, పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బారాయుడు, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై వరి విత్తనాలు

కావలి రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో రైతుల కోసం రాయితీపై ప్రభుత్వం వరి విత్తనాలను అందుబాటులో ఉంచిందని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులకు పంపిణీ కోసం రైతు సేవా కేంద్రాలల్లో కెఎస్ఎం1638 రకం 300 కింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉంచిందన్నారు. 25 కిలోల ధర రూ. 1215 కాగా, రాయితీపై రూ.1065కి అంది చేస్తామన్నారు. బీపీటీ 5204 రకం వరి విత్తనాలు 30 కిలోల ధర రూ.1045 కాగా, రాయితీపై రూ. 920లకు ఇస్తామన్నారు.

బహుమతుల అందజేత



ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఆదరణ పొందేందుకు సీతారామపురం మార్గంలో తిరిగే బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్‌లో విజేతలైన ప్రయాణికులకు శనివారం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో టిక్కెట్లను లాటరీ తీయగా షేక్ మస్తాన్, చెన్నయ్యలు విజేతలుగా నిలవడంతో వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.